అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 28-7-2023

సంపుటి : 9 | సంచిక : 159 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50



పార్లమెంటులో నల్ల దుస్తులతో ప్రతిపక్షాల నిరసన

ఇండియా వర్సెస్ మోడీ

9లో







ముంచెత్తుతోంది...

ఊళ్ళన్నీ నీటిలోనే .. పల్లెలు జలమయం

ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు.. తెరుచుకున్న గేట్లు

- ప్రమాదకరంగా కడెం ప్రాజెక్టు...
- భద్రాద్రి గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక
- తెగిన చెరువులు, కుంటలు.. పలువురు గల్లంతు
- ప్రజలను కాపాడిన రెస్క్యూ టీమ్‌లు
- ఏడాది వాన ఒక్కరోజులో కురిసిందన్న అధికార వర్గాలు
- హైదరాబాద్ వాసుల ఆందోళన
- ములుగు జిల్లా వెంకటాపూర్‌లో 65 సెం.మీ వర్షపాతం

సీఎం కేసీఆర్ సమీక్ష
ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారుల నియామకం

ఆకాశానికి చిల్లు పడిందా అనేలా వాన కురుస్తోంది.. ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో వరదలు ముంచెత్తుతున్నాయి. ఊరు వాడ తేడా లేకుండా ఊళ్లన్నీ చెరువుల్లా మారాయి. చెరువులు, కుంటలు తెగిపోయాయి. ప్రాజెక్టులు ప్రమాదకర స్థాయిలో ఉండటంతో పూర్తి గేట్లను ఎత్తడం వల్ల పరివాహక గ్రామాలను వరద ముంచెత్తింది. జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. 108 గ్రామాలు జలమయ్యాయి. గల్లంతైన వారిలో కొంతమంది జాడ కానరాలేదు. పట్టణాలు, కాలనీలు అస్తవ్యస్తంగా మారాయి. గ్రేటర్ హైదరాబాద్ వాసులు ఆందోళనలో ఉన్నారు. ముంపు ప్రాంత ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.. గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

నవతెలంగాణ- విలేకరులు

తెలంగాణలో ఎక్కడ చూసినా వర్షబీభత్సపు ఛాయలు కనిపిస్తున్నాయి.ఇండ్లు కూలిపోయాయి. పంటలు వరదలకు తుడిచిపెట్టుకుపోయాయి. కల్వర్టులు, రోడ్లు తెగిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు ప్రమాదకర పరిస్థితికి చేరుకుంది. ఖమ్మంలో మున్నేరు నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. వరదల్లో చిక్కుకున్న వారిని రెస్క్యూ టీం సురక్షిత ప్రాంతానికి తరలించింది. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నుంచి భారీగా వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలను అధికారులు బంద్ చేశారు. భద్రాద్రి వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్‌లో పట్టాలపైకి వరద చేరడంతో పలు రైళ్లను నిలిపేశారు. జంపన్నవాగు ప్రాంతంలో చిక్కుకున్న చిరు వ్యాపారులు, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన స్థానికులను ఎన్‌డిఆర్ఎస్(రెస్క్యూ టీం) బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. వెంకటాపురం మండల కేంద్రంలోని ...10లో

ప్రాణనష్టం జరగకుండా చూడండి : కేటీఆర్



వర్షాలను రాజకీయం చేయడం తగదు
హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి

10లో

సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

పార్టీ శ్రేణులకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు
వరద బాధితులను ఆదుకోవాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సహాయ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని పార్టీ శ్రేణులను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలు, వరదల వల్ల వేలాది ఎకరాల్లో పత్తి, కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలు తదితర పంటలు నీటిలో మునిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల ప్రాణనష్టంతోపాటు, మూగ జీవాలు చనిపోయాయని వివరించారు. లోతట్టు కాలనీల ఇండ్లలోకి వరదనీరు చేరడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయంతో ప్రజలు వారి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని తెలిపారు. వరంగల్, ...9లో

మూడేండ్లలో 20 సార్లు పెరిగిన గ్యాస్ ధర



9లో..

తక్షణ సహాయచర్యలు చేపట్టాలి

మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు సీఎం ఆదేశాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ప్రాణనష్టం జరగకుండా చూడాలి. భారీ వరదల నేపథ్యంలో ప్రాజెక్టుల వద్దే ఉంటూ సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ముంపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో రక్షణ, పునరావాసం, వైద్యం, ఆహార సరఫరా వెంటనే చేపట్టాలి....' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులను గురువారం ఆదేశించారు. సీఎం ఆదేశాలతో సీఎస్ శాంతికుమారి సచివాలయం నుంచి అధికారులతో సమీక్షించారు. అవసరమైన చోటికి ఎన్డీఆర్ఎఫ్ ...2లో

జీపీ కార్మికుల సమస్యలు

పరిష్కరించండి..

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

వివరాలు 9లో..

విద్యాసంస్థలకు

నేడు సెలవు

ముఖ్యమంత్రి కేసీఆర్

వివరాలు 9లో..

జమిలి ఎన్నికలు కష్టమే

నిర్వహణకు అడ్డంకులు

ఐదు రాజ్యాంగ సవరణలు చేయాలి

- వేల కోట్లు ఖర్చు చేయాలి
- భారీగా ఈవీఎం,వీవీప్యాట్‌లు అవసరం
- అదనపు పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు కావాలి : రాజ్యసభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

వివరాలు 9లో

స్టాండింగ్ కమిటీ నుండి

ప్రతిపక్షాల వాకౌట్

డేటా ప్రొటెక్షన్ బిల్లుపై అభ్యంతరం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో


వ్యక్తిగత సమాచార రక్షణ బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లుపై చర్చించి, ఆమోదం తెలిపేందుకు గురువారం జరిగిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశం నుండి వాకౌట్ చేశాయి. బిల్లుకు సంబంధించిన నివేదికను ఆమోదించడానికి ...9లో



కుతంత్రమే!

మణిపూర్ హింస వెనుక అసలు కథ

- మైతీల కొమ్ముకాస్తున్న 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం
- సమస్య పరిష్కారంలో ఉదాశీనత
- ఉద్దేశపూర్వకంగానే తాత్సారం
- రాజకీయ లబ్ధి కోసం సాగతీత



మణిపూర్ హింసాకాండను అణచివేయడంలో కేంద్రం ఎందుకు ఉదాశీనంగా వ్యవహరిస్తోంది? ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారు? సమస్యను సత్వరమే పరిష్కరించకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారు? హింసకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్ ఎందుకు విఫలమవుతోంది? .... ఈ ప్రశ్నలు ఇప్పుడు భారతీయుల మెదళ్లను తొలచివేస్తున్నాయి. వీటికి సమాధానం కోసం జాతి యావత్తూ ఆసక్తిగా ఎదురు చూస్తూనే ఉంది.

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లో నిరసన గళాల గొంతు నొక్కడంలోనూ ప్రత్యర్థి పార్టీల ప్రభుత్వాలున్న రాష్ట్రాలలో ప్రత్యర్థులపై ప్రభుత్వ సంస్థలను ఉసిగొల్పడంలోనూ చురుకుగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వం మణిపూర్ విషయంలో మాత్రం అచేతనంగా వ్యవహరిస్తోంది. మణిపూర్ హింసకు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను మాత్రమే బలిపశువును చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం జరుగుతోంది. రాష్ట్రాలలో కూడా బీజేపీకి అధికారాన్ని కట్టబెడితే ఆయా రాష్ట్రాల వ్యవహారాలను తాను నేరుగా నియంత్రిస్తానని చెప్పుకుంటున్న పెద్దమనిషి... మణిపూర్‌లో తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ పరిస్థితిని ఎందుకు నియంత్రించలేకపోతున్నారు? అసాధారణ సంఖ్యలో కేంద్ర భద్రతా దళాలను మోహరించినప్పటికీ హింసను అదుపు చేయలేకపోయానని మోడీ ప్రభుత్వం చెబుతుందా? రాష్ట్ర ప్రభుత్వానికి సాయం చేసేందుకు ప్రత్యేక ప్రతినిధులను పంపడం ద్వారా తనకు ...2లో



పేసర్లు ప్రతాపం చూపించే కెన్సింగ్టన్ ఓవల్‌లో టీమ్ ఇండియా స్పిన్నర్లు మాయ చేశారు. చైనామన్ కుల్దీప్ యాదవ్, లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజాలు సంయుక్తంగా ఏడు వికెట్లు పడగొట్టారు. 88/3తో మెరుగ్గానే కనిపించిన కరీబియన్లు.. స్పిన్ ఆడలేక 114 పరుగులకే కుప్పకూలారు.

కుల్దీప్, జడేజా మాయజాలం

- 114కు కుప్పకూలిన కరీబియన్లు
- విండీస్‌తో భారత్ తొలి వన్డే

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్


కరీబియన్ పిచ్‌లు కరుడుగట్టిన పేస్‌కు చిరునామా. కొంతకాలంగా అక్కడ పేస్ పదును తగ్గుతున్నా.. భారత జట్టు పర్యటనలో మరీ తీసికట్టుగా తయారయ్యాయి. డొమినికాలో తొలి టెస్టులో భారత స్పిన్నర్లు మాయజాలం చేయగా.. తాజాగా కెన్సింగ్టన్ ఓవల్ తొలి వన్డేలో సీన్ పునరావృతం. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (4/6), రవీంద్ర జడేజా (3/37) కండ్లుచెదిరే ప్రదర్శనతో చెలరేగారు. ఇద్దరు స్పిన్నర్లు వికెట్ల వేటలో మ్యాజిక్ ప్రదర్శన చేయగా కరీబియన్ల బ్యాటర్లు చేతులెత్తేశారు. 23 ఓవర్లలో 114 పరుగులకే వెస్టిండీస్ కుప్పకూలింది. కెప్టెన్ షాయ్ హోప్ (43, 45 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటంతో జట్టుకు మూడంకెల స్కోరు అందించాడు.

కుల్దీప్, జడేజా షో : భారత్‌తో వన్డేల్లో వెస్టిండీస్ రెండో అత్యల్ప స్కోరు నమోదు చేసింది. 2018లో తిరువనంతపురం వన్డేలో 31.5 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలిన కరీబియన్లు.. తాజాగా వారి సొంతగడ్డపై 114 పరుగులకే చేతులెత్తేశారు. తొలుత టాస్ నెగ్గిన భారత్ ఛేదనకు మొగ్గుచూపింది. దీంతో తొలి వన్డేలో ఆతిథ్య విండీస్ తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. ఓపెనర్ కైల్ మేయర్స్ (2)ను హార్దిక్ పాండ్య వెనక్కి పంపి శుభారంభం అందించగా.. అరంగేట్ర పేసర్ ముకేశ్ కుమార్‌కు అలిక్ అతానేజ్ (22) వికెట్ కోల్పోయాడు. బ్రాండన్ కింగ్ (17)ను శార్దుల్ ఠాకూర్ సాగనంపాడు. టాప్ ఆర్డర్‌లో ముగ్గురు బ్యాటర్లు నిష్క్రమించినా.. వెస్టిండీస్ కుదురుగానే కనిపించింది. కెప్టెన్ హోప్ (43) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆ జట్టు డ్రెస్సింగ్‌రూమ్‌లో ఆశలు నింపే ప్రయత్నం చేశాడు. షిమ్రోన్ హెట్‌మయర్ (11)తో కలిసి కీలక భాగస్వామ్యం నమోదు చేసిన హోప్.. ఆ జట్టును మంచి స్కోరు దిశగా నడిపించాడు. కానీ బంతి స్పిన్నర్ల చేతికి అందగానే సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. 15.3 ఓవర్లలో 88/3తో మెరుగైన స్థితిలో నిలిచిన వెస్టిండీస్.. స్పిన్నర్ల మాయజాలంతో 23 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యింది. 26 పరుగులకే చివరి ఏడు వికెట్లు చేజార్చుకున్న వెస్టిండీస్ స్వదేశంలో మూడో అత్యల్ప స్కోరు చేసిన చెత్త రికార్డును మూటగట్టుకుంది.

చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మాయ ఆకాశమే హద్దుగా సాగింది. 18 బంతుల్లో 6 పరుగులే ఇచ్చిన కుల్దీప్ ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా సైతం ఆరు ఓవర్లలో 37 పరుగులకే 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. రోవ్‌మాన్ పావెల్ (4), రోమారియో షెఫర్డ్ (0), డొమినిక్ డ్రాక్స్ (3), యానిక్ (3), మోతె (0), జేడెన్ (0) దారుణంగా విఫలమయ్యారు.

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

- ప్రణరు, సాత్విక్-చిరాగ్ జోడీ సైతం
- జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్



టోక్యో (జపాన్) : భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు జపాన్ ఓపెన్‌లో సత్తా చాటుతున్నారు. రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు తొలి రౌండ్లోనే నిరాశపరిచినా.. మెన్స్ సింగిల్స్, మెన్స్ డబుల్స్ విభాగాల్లో భారత షట్లర్లు టైటిల్ వేటలో దూకుడుగా దూసుకెళ్తున్నారు. సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్, యువ షట్లర్ లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి చేరుకోగా.. పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్ శెట్టి సైతం క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపారు.

మెన్స్ సింగిల్స్‌లో అన్‌సీడెడ్, కెనడా ఓపెన్ విజేత లక్ష్యసేన్ వరుసగా రెండో రౌండ్లో రాణించాడు. జపాన్ ఆటగాడు కంటా సునేయమపై వరుస గేముల్లో గెలుపొందాడు. 50 నిమిషాల పాటు సాగిన ప్రీ క్వార్టర్స్ పోరులో లక్ష్యసేన్ 21-14, 21-16తో అలవోక విజయం నమోదు చేశాడు. తొలి గేమ్‌లో లక్ష్యసేన్ దూసుకెళ్లాడు. 11-5తో విరామ సమయానికి భారీ ముందంజలో నిలిచాడు. 16-14తో ఉండగా వరుసగా ఐదు పాయింట్లు గెల్చుకుని తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లోనూ లక్ష్యసేన్ విరామ సమయానికి 11-9తో ఆధిక్యంలో నిలిచాడు. కానీ ద్వితీయార్థంలో జపాన్ కుర్రాడు పుంజుకున్నాడు. 13-13తో స్కోరు సమం చేసి 16-15తో ముందంజ వేశాడు. ఈ సమయంలో లక్ష్యసేన్ మరోసారి అత్యుత్తమ ప్రదర్శన చూపించాడు. వరుసగా ఏడు పాయింట్లు కొల్లగొట్టిన లక్ష్యసేన్ 21-16తో రెండో గేమ్‌ను, క్వార్టర్‌ఫైనల్స్ బెర్త్‌ను కైవసం చేసుకున్నాడు. మూడు గేముల పాటు హోరాహోరీగా సాగిన ఆల్ ఇండియన్ ప్రీ క్వార్టర్స్‌లో సహచర షట్లర్, మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్‌పై



హెచ్.ఎస్ ప్రణయ్ పైచేయి సాధించాడు. 57 నిమిషాల మ్యాచ్‌లో ప్రణయ్ 19-21, 21-9, 21-9తో శ్రీకాంత్‌పై గెలుపొందాడు. ఉత్కంఠగా సాగిన తొలి గేమ్‌లో శ్రీకాంత్ గెలుపొందాడు. 10-10 నుంచి 18-18 వరకు నువ్వా నేనా అన్నట్టు సాగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ చివర్లో వరుస పాయింట్లతో ముందంజ వేశాడు. కానీ తర్వాతి రెండు గేముల్లో ప్రణయ్ చెలరేగాడు. శ్రీకాంత్‌ను చిత్తుగా ఓడించాడు. చివరి గేముల్లో ఏమాత్రం పోటీ ఇవ్వలేని శ్రీకాంత్ చేతులెత్తేశాడు. క్వార్టర్స్ బెర్త్‌ను ప్రణయ్‌కి అప్పగించాడు.

పురుషుల డబుల్స్‌లో కొరియా ఓపెన్ చాంపియన్స్ సాత్విక్, చిరాగ్ జోడీ క్వార్టర్స్‌కు చేరుకుంది. డెన్మార్క్ జోడీ జెప్పీ, లాసెలపై 21-17, 21-11తో వరుస గేముల్లో సాధికారిక విజయం సాధించారు. తొలి గేమ్‌లో డెన్మార్క్ షట్లర్ల నుంచి ప్రతిఘటన కనిపించింది. 11-9తో విరామ సమయానికి ముందంజలో నిలిచిన సాత్విక్, చిరాగ్.. అదే దూకుడు కొనసాగించారు. రెండో గేమ్‌లో సాత్విక్, చిరాగ్ దూకుడు ముందు డెన్మార్క్ జోడీ నిలువలేదు. ఏకపక్షంగా సాగిన గేమ్‌ను 21-11తో సొంతం చేసుకున్న సాత్విక్, చిరాగ్ నేడు క్వార్టర్‌ఫైనల్లో చైనీస్ తైపీ జోడీతో తలపడనున్నారు. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జోడీ నిరాశపరిచింది. లోకల్ షట్లర్లు నమి, చిహరుల చేతిలో 21-23, 19-21తో వరుస గేముల్లో పోరాడి ఓడింది.

ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు షురూ

- యూత్, జూనియర్ పోటీలకు తొలిసారి భారత్ ఆతిథ్యం



న్యూఢిల్లీ : ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్ గ్రేటర్ నోయిడాలో గురువారం ఆరంభమయ్యాయి. ఆసియాలోని 15కు పైగా దేశాలు, 200 మంది అథ్లెట్లు, 50కి పైగా సాంకేతిక సిబ్బంది, కోచ్‌లు ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో భాగస్వామ్యం అవుతున్నారు. తొలిసారి భారత్ ఆతిథ్యం ఇస్తున్న ఈ ఈవెంట్‌ను భారత, ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ ఆఫీస్ బేరర్లతో కలిసి కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రారంభించారు. భారత్ నుంచి 30 మంది వెయిట్‌లిఫ్టర్లు పోటీల్లో బరువులు ఎత్తేందుకు సిద్ధమవుతున్నారు. టోర్నీలో ఓవరాల్‌గా 61 మెడల్స్ అందుబాటులో ఉన్నాయి. శుక్రవారం నుంచి పోటీలు షురూ కానుండగా, ఆగస్టు 5న పోటీలు ముగియనున్నాయి.

స్వదేశానికి సిరాజ్

విండీస్‌తో వన్డే సిరీస్‌కు దూరం



బ్రిడ్జ్‌టౌన్ : టీమ్ ఇండియా నయా పేస్ దళపతి, హైదరాబాదీ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమి లేని వేళ భారత పేస్ విభాగానికి సారథ్యం వహిస్తున్న సిరాజ్.. చీలమండ గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. గాయం తీవ్రత చిన్నదే అయినా.. బీసీసీఐ వైద్య బృందం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సిరాజ్‌కు విశ్రాంతి సూచించింది. దీంతో వెస్టిండీస్‌తో తొలి వన్డేకు ముందు మహ్మద్ సిరాజ్ ఫిట్‌నెస్ సమస్యలతో జట్టు నుంచి తప్పుకున్నాడు. ఎన్‌సీఏలో తదుపరి రిహాబిలిటేషన్ కోసం మహ్మద్ సిరాజ్ తక్షణమే భారత్‌కు పయనం అవుతున్నట్టు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. మహ్మద్ సిరాజ్ స్థానంలో మరో పేసర్‌ను వన్డే జట్టుకు ఎంపిక చేయలేదు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు 17 మందితో కూడిన జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఎంపిక చేయగా.. ప్రస్తుతం జట్టుతో 16 మంది క్రికెటర్లు ఉన్నారు.

ఐర్లాండ్‌తో సిరీస్‌కు బుమ్రా!

- వేగంగా సిద్ధమవుతున్న పేస్ దళపతి



న్యూఢిల్లీ : భారత స్టార్ పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా పునరాగమనం ఎన్‌సీఏ షెడ్యూల్‌కు ముందే జరుగనుంది!. ఈ ఏడాది మార్చిలో వెన్నునొప్పి శస్త్రచికిత్స చేయించుకున్న బుమ్రా.. ఏప్రిల్ నుంచి రిహాబిలిటేషన్‌లో ఉన్నాడు. ఆసియా కప్‌కు బుమ్రా అందుబాటులోకి వస్తాడని నేషనల్ క్రికెట్ అకాడమీ వర్గాలు అంచనా వేశాయి. కానీ నెట్స్‌లో బుమ్రా పూర్తి స్థాయిలో బౌలింగ్ సాధన చేస్తున్నాడని గత వారం బీసీసీఐ మెడికల్ అప్‌డేట్‌లో తెలిపింది. దీంతో ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌లో బుమ్రా ఆడే అవకాశం కనిపిస్తోంది. ఆగస్టు 18, 20, 23న మూడు టీ20ల కోసం భారత జట్టు ఐర్లాండ్‌కు వెళ్లనుంది. ఐర్లాండ్ సిరీస్‌కు భారత జట్టును ఈ వారంలో ఎంపిక చేయనున్నారు. బుమ్రాతో పాటు మహ్మద్ షమి సైతం విరామం ముగించుకుని ఆసియా కప్‌కు అందుబాటులోకి రానున్నాడు. దీంతో బుమ్రా, షమి, సిరాజ్‌లతో కూడిన భారత పేస్ దళం వన్డే వరల్డ్‌కప్‌కు ఫిట్‌గా సిద్ధమవుతుందని బీసీసీఐ ఆశిస్తోంది.

ఆగస్టు 27 నుంచి ఎంఎస్‌డీసీఏ స్కూల్ క్రికెట్ లీగ్

- టీ20 లీగ్‌కు ట్రయల్స్‌తో ఆటగాళ్ల ఎంపిక
- మొదలైన ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ



నవతెలంగాణ-హైదరాబాద్ : ఎంఎస్ ధోని క్రికెట్ అకాడమీ (ఎంఎస్‌డీసీఏ) స్కూల్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తుంది. ఆగస్టు 27 నుంచి 8 జట్లతో కూడిన టీ20 లీగ్ ఆరంభం కానుండగా.. ఆగస్టు 20 హైదరాబాద్‌లోని ఎంఎస్‌డీసీఏ శిక్షణ కేంద్రాల్లో సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు లీగ్ నిర్వాహకులు బ్రెయినాక్స్ బీ డైరెక్టర్ రషీద్ బాషా, డీపీఎస్ (నాచారం) విద్యాసంస్థల సీఈవో మల్కా యశస్వి, 7హెచ్ స్పోర్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్ గురువారం జరిగిన మీడియా సమావేశంలో ప్రకటించారు. 'స్కూల్ స్థాయిలో క్రికెట్ లీగ్ నిర్వహణ హర్షనీయం. ప్రతిభావంతులైన క్రికెటర్లు ట్రయల్స్‌లో పోటీపడి అద్భుత అవకాశాన్ని దక్కించుకోవాలి. లీగ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఐదుగురు క్రికెటర్లకు పల్లవి ఫౌండేషన్ రూ.5 లక్షల స్కాలర్‌షిప్ అందించనుందని' అని యశస్వి తెలిపారు.

ఓపెన్ సెలక్షన్స్ : స్కూల్ క్రికెట్ లీగ్‌ను ఎంఎస్‌డీసీఏ వినూత్నంగా ముందుకు తీసుకురానుంది. 8 జట్లు పోటీపడే లీగ్‌లో.. ఆటగాళ్లను పూర్తిగా ఎంఎస్‌డీసీఏ అకాడమీ కోచ్‌లే ఎంపిక చేస్తారు. సెలక్షన్ ట్రయల్స్ కోసం క్రికెటర్లు ఆగస్టు 17 వరకు దరఖాస్తు చేయవచ్చు. ఆగస్టు 25న జట్ల పేర్లు, ట్రోఫీ, జెర్సీ ఆవిష్కరించనున్నారు. ఆగస్టు 27న లీగ్ మ్యాచ్‌లో మొదలై, సెప్టెంబర్ 3న టైటిల్ పోరుతో లీగ్ ముగియనుంది. 'ప్రతిభావంతులైన క్రికెటర్లను వెలుగులోకి తీసుకొచ్చి ప్రోత్సహించటమే ఎంఎస్‌డీసీఏ ఉద్దేశం. బాలురు అండర్-14, బాలికలు అండర్-16 విభాగాల్లో టీ20 లీగ్‌ను స్కూల్ లెవల్‌లో నిర్వహిస్తున్నాం. లీగ్‌లో సత్తా చాటిన నాణ్యమైన క్రికెటర్లకు మా అకాడమీలో ఆరు నెలలు ఉచిత శిక్షణ అందించనున్నామని' రషీద్ బాషా తెలిపారు. స్కూల్ క్రికెట్ లీగ్ రిజిస్ట్రేషన్, మరిన్ని వివరాల కొరకు 7396386214, 7618703508 నంబర్లను సంప్రదించవచ్చు.

తక్షణ సహాయ చర్యలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

బృందాలను వెంటనే తరలించారు. రాష్ట్ర స్థాయిలో వరదల పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన డీజీపీ, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను తరలించేందుకు పోలీసులను పురమాయించారు.

ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఆదేశాలు

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరి, దాని ఉపనదులు, వాగులు, వంకలు ప్రమాద హెచ్చరికలు దాటి ఉప్పొంగి ప్రవహిస్తున్న పరిస్థితుల్లో, వరద ముంపును తగ్గించేటందుకు చర్యలు చేపట్టాలని సీఎం కోరారు. ఈ మేరకు ఇన్‌ఫ్లోను ముందస్తుగా అంచనా వేసి, గేట్లు ఎత్తివేస్తూ, వరద నీటిని కిందికి వదలాలని చీఫ్ ఇంజనీర్లకు సీఎం ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఎస్సారెస్పీ, కాళేశ్వరం, కడెం ప్రాజెక్టు, మిడ్ మానేరు, లోయర్ మానేరు తదితర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లకు సీఎం స్వయంగా ఫోన్లు చేసి, పరిస్థితులను పర్యవేక్షించారు.

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు.మూసీ పరివాహక ప్రాంతాల్లో సహాయ చర్యలను చేపట్టేలా అధికారులను ఆదేశించారు. మంత్రి సత్యవతి రాథోడ్‌కు సీఎం ఫోన్ చేసి గోదావరి పరివాహక ప్రాంతాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నీట మునిగిన మోరంపల్లి గ్రామంలో ప్రజలను రక్షించేలా పరిస్థితిని సమీక్షించారు. ములుగు ముంపు ప్రాంతంలో కొనసాగుతున్న సహాయక చర్యలను సత్యవతి రాథోడ్ స్వయంగా పర్యవేక్షించి, అక్కడే బస చేస్తున్నారు. మరోవైపు మంత్రి హరీశ్‌రావు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, రాష్ట్రస్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. జిల్లాల్లో కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి ఎక్కడ అవసరమైతే అక్కడ అత్యవసర వైద్య సదుపాయాలు అందించేలా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

ప్రజలకు ఇబ్బందుల తలెత్తకుండా ఉండేందుకు వీలుగా ప్రభుత్వ యంత్రాం గాన్ని అప్రమత్తం చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలి పారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పరిస్థితుల ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు వెల్లడించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఫైర్ తదితర శాఖల ఎమర్జెన్సీ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సచి వాలయంలో వర్షాలు, వరద పరిస్థితులు, సహాయ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేకంగా ముగ్గురు సీనియర్ అధికారులను నియమించి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. 7997950008, 79979597 82 ,040-23450779 అనే నెంబర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. కొత్తగూడెం , హైదరాబాద్ లలో రెండు చొప్పున ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, ములుగు, వరంగల్‌లో ఒక్కొక్క బృందం ఉందని సీఎస్ తెలిపారు.

కు'తంత్ర'మే!

(మొదటిపేజీ తరువాయి)

విశేష అధికారాలు సంక్రమించినప్పటికీ పరిస్థితిని చక్కదిద్దలేకపోతున్నానని చెబుతుందా? అది వైఫల్యమా లేక హింసను ఆపడం ఇష్టం లేదా?

ఉద్దేశపూర్వక 'నిస్సహాయత'

ఏ ప్రాంతంలో అయినా మతపరమైన హింస 24 గంటలకు పైగా కొనసాగితే అధికారులకు ఆ హింసను అడ్డుకోవడం ఇష్టం లేదని లేదా దానిలో వారికీ భాగముందని అర్థం చేసుకోవాలని సీనియర్ పోలీస్ అధికారులు అంటున్నారు. మరి మణిపూర్‌లో సుమారు మూడు నెలలుగా హింసాకాండ కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్న చేదునిజం మొదటి రోజే తెలిసిపోయింది. అంతర్గత భద్రత పేరిట తాను తీసుకుంటున్న చర్యలన్నింటినీ సమర్థించుకుంటున్న ప్రభుత్వం... ఇతర దేశాలతో సరిహద్దులు కలిగిన రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలలో భద్రతను తన అధీనంలోకి తీసుకుంటున్న ప్రభుత్వం...సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్ తగలబడిపోతుంటే చూస్తూ కూర్చుంది. ఈ ఉద్దేశపూర్వక 'నిస్సహాయత' వెనుక ఓ కుతంత్రం ఉందని చెప్పక తప్పదు.

మైతీలకు అండదండలు

ముందుగా మణిపూర్‌లో కొనసాగుతున్న హింస స్వభావమేమిటో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మెజారిటీ తెగ అయిన మైతీకి రాష్ట్ర పోలీసుల మద్దతు ఉన్నదని, ఆ తెగ వారు లోయలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పెత్తనం చెలాయిస్తున్నారని పరిశీలకులు బల్లగుద్ది మరీ చెబుతున్నారు. పైగా మైతీలకు ముఖ్యమంత్రి రక్షణ ఉన్న విషయం బహిరంగ రహస్యమే. కుకీ జనాభాను అంతం చేయాలన్న తమ ఉద్దేశాన్ని మైతీ నేతలు బాహాటంగానే బయటపెడుతున్నారు. అయితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మైతీల అరాచకాలకు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కొమ్ముకాస్తున్నారని అనుకుంటే మోడీ ప్రభుత్వం కానీ, మణిపూర్‌లోనే ఉన్న ప్రధాని ప్రత్యేక ప్రతినిధులు కానీ ముఖ్యమంత్రిని రాజీనామా చేయాలని ఎందుకు కోరడం లేదు? దీనిని బట్టి చూస్తే మైతీలను నియంత్రించడం కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి కానీ, రాష్ట్రంలోని బీరేన్ ప్రభుత్వానికి కానీ న ం త రా వ ం ా ఇష్టం లేదని తేలిపోతుంది. రాష్ట్రాన్ని జా తులపరంగా నిట్టనిలువునా చీల్చి, రాజకీయ లబ్ది పొందడమే దీని వెనుక దాగిన కుట్ర అని అర్థమవుతుంది.

ఇతర రాష్ట్రాలలోనూ...

మణిపూర్ పరిణామాలు ఇతర రాష్ట్రాల పైన కూడా ప్రభావం చూపడం మొదలు పెట్టాయి. మణిపూర్‌లో కుకీలపై జరుగుతున్న దాడులతో మిజోరంలో అశాంతి చెలరేగింది. అక్కడ నివసిస్తున్న మైతీలకు బెదిరింపులు వస్తున్నాయి. దీనిపై తక్షణమే స్పందించిన బీరేన్ సింగ్, మిజోరంలోని మైతీలను తరలించేందుకు ప్రత్యేక ఛార్టర్డ్ విమానాలు పంపుతామని ప్రకటించారు. అంతేకానీ హింసను అరికట్టి, కుకీలలో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్రం కానీ, రాష్ట్రం కానీ చెప్పడం లేదు. అస్సాంలోని బారక్ లోయలో నివసిస్తున్న మిజోలకు మైతీ గ్రూపులు హెచ్చరికలు పంపడం మొదలు పెట్టాయి. ఇక మేఘాలయలోని స్థానిక ముఠాలు మణిపూర్ నుండి ఆశ్రయం కోరి వచ్చే వారిని అనుమతించబోమని తెగేసి చెబుతున్నాయి. మొత్తంగా చూస్తే దశాబ్దాల తరబడి ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో ఇప్పుడు అస్థిరత కన్పిస్తోంది. అదను కోసం వేచిచూస్తున్న ఉగ్రవాద గ్రూపులు బలాన్ని పుంజుకొని తమ తెగల మద్దతుతో క్రియాశీలకంగా వ్యవహరించేందుకు సిద్ధపడుతున్నాయి. ఆ గ్రూపులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఏ మాత్రం నమ్మకం లేదు.

పక్కదారి పట్టింది...

మౌనంగా ఉండడం కాదు. మణిపూర్ హింస ను అడ్డుకోవడానికి నిరాకరించడం ప్రధానిలోని సంక్లిష్టతకు నిదర్శనం. 78 రోజుల మౌనం తర్వాత మోడీ పెదవి విప్పినప్పటికీ అది మణిపూర్ గురించి కాదు...వెలుగు చూసిన వీడియో గురించి. అప్పటి నుండీ బీజేపీ మంత్రులు, టీవీ వ్యాఖ్యాతలు అసలు సమస్యను పక్కనపెట్టి అదే పనిగా మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై మాట్లాడడం మొదలు పెట్టారు. ఏతా వాతా తేలేదేమంటే మణి పూర్ హింస మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టదు. దాని మౌనం, చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చూస్తుంటే జరుగుతున్న గందరగోళం బీజేపీకి ఎన్నికల ప్రయోజనం చేకూర్చేదిగా ఉంది.

'బయటి వ్యక్తుల' ప్రస్తావనతో...

సాయుధ దళాల సామాజిక అధికారాల చట్టాన్ని (ఎఎఫ్ఎస్‌పీఏ) విధించాలంటూ కొందరు మణిపూర్ ప్రజలు చేస్తున్న డిమాండ్ హాస్యాస్పదం గా ఉంది. ఎందుకంటే మెజారిటీ ప్రజలు దశాబ్దాలుగా ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. మోడీ ప్రభుత్వ జోక్యం లేకుండా ఇదంతా జరుగుతోందంటే నమ్మశక్యంగా లేదు. ఏ ప్రభుత్వమైనా దేశంలోనూ, సమాజంలోనూ శాంతి స్థాపనకు కట్టుబడి ఉంటుంది. కానీ మోడీ ప్రభుత్వం మాత్రం ఎప్పు డూ గందరగోళం సృష్టించడానికే ప్రయత్నిస్తుంది. గందరగోళం, అనిశ్చితి, అస్థిరత వంటివి ప్రభుత్వాలకు ఎంతగానో ఉపయోగ పడతాయి. ఎందుకంటే అవి ప్రజల మనసులో అయోమయాన్ని సృష్టిస్తాయి. మణిపూర్ లో అస్థిరత, హింసను మోడీ ప్రభుత్వం ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయో గించుకునే అవకాశం ఉంది. ఓ హెచ్చరిక, ఓ హామీతో ఆ పార్టీ హిందీ ప్రాంతాలకు ఓట్ల కోసం వెళుతుంది. బయటి వ్యక్తులు ఈశాన్య ప్రాంతంపై ఆధిపత్యం చెలాయిస్తారని హెచ్చరిస్తూ దానిని తాను నియంత్రిస్తానని హామీ ఇస్తుంది. ఈ 'బయటి వ్యక్తుల' ప్రస్తావన ఎన్నికలు వచ్చిన ప్రతి సందర్భం లోనూ బీజేపీ తీసుకొస్తూనే ఉంటుంది. దానిని సజీవంగా ఉంచేందుకు ప్రయత్నిస్తుంది.

నేడూ పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల పాటు మోస్తరు వానలు, ఆయా జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. శుక్రవారం నాడు ఆదిలాబాద్, కొమ్రం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముందని హెచ్చరించారు.

సుభాష్ ముండా హంతకులను తక్షణమే అరెస్టు చేయండి

- సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ : జార్ఖండ్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రముఖ గిరిజన నాయకులు సుభాష్ ముండా దారుణ హత్యను సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. హంతకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో రాంచీ జిల్లాలోని దళదల్లిలోని అతని కార్యాలయంలోనే కొందరు దుండగులు దారుణంగా కాల్చి చంపారు. రాంచీ జిల్లాలోని నగ్రి ప్రాంతంలో 34 ఏండ్ల సుభాష్ ముండా ఒక ప్రముఖ నాయకుడని, గిరిజన, పేద, అట్టడుగు వర్గాల ప్రజల హక్కులను పరిరక్షిం చే పోరాటాల్లో కీలకంగా ఉన్నారని పొలిట్ బ్యూరో తెలిపింది. సామాన్య ప్రజల్లో సుభాష్‌కు ఉన్న ఆదరణ, ఆకర్షణ కారణంగానే హతియా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు సార్లు, మందార్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో సీపీఐ(ఎం) తన అభ్యర్థిగా నిలబెట్టిందని గుర్తు చేసింది. ముండా హత్య కేసుపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేయాలని, హంతకులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

సరిహద్దు ప్రతిష్టంభనపై బాలిలో చర్చించిన మోడీ, జిన్‌పింగ్

- వెల్లడించిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ : గతేడాది బాలిలో జరిగిన జి 20 సమావేశాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు సరిహద్దుల్లో నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలియచేసింది. ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారని తెలిపింది. చైనా అధ్యక్షుడు ఈ విషయాన్ని వెల్లడించిన కొద్ది రోజుల తర్వాత భారత విదేశాంగ శాఖ ఈ ప్రకటన చేసింది. విదేశాంగ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా ఆనాడు బాలిలో మీడియాతో మాట్లాడుతూ, ఇరువురు నేతలు కేవలం మర్యాదపూర్వకంగా మాట్లాడుకున్నారని మాత్రమే చెప్పారు.

అయితే ఇటీవల జోహాన్నెస్‌బర్గ్‌లో బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశం నేపథ్యంలో భారత్ జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ డోవల్, చైనా విదేశాంగ వ్యవహారాల కమిషన్ డైరెక్టర్ వాంగ్ యి మధ్య సమావేశం జరిగింది. ఆ సమావేశంపై ప్రకటన చేస్తూ చైనా విదేశాంగ శాఖ పై విషయాన్ని వెల్లడించింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా దీనిపై ప్రకటన చేసింది.

చదువులు ఆగం...



విద్యార్థుల భవిత ప్రశ్నార్థకం

- భారీ వర్షాల నేపథ్యంలో వరుసగా సెలవులు
- నష్టపోతున్న ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులు
- టెన్త్, ఇంటర్ చదివే వారిపై తీవ్ర ప్రభావం
- 'ప్రయివేటు'లో ఆన్‌లైన్ తరగతులు
- ప్రీప్రైమరీ విద్యార్థులనూ వదలని యాజమాన్యాలు
- పది, ఇంటర్ పిల్లలకు నేరుగా బోధన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాల నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకూ ప్రభుత్వం సెలవులు ప్రకటిస్తున్నది. ఈనెల 20 నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వర్షాలకు విద్యార్థుల చదువులు ఆగమవుతున్నాయి. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది. అయితే ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివే విద్యార్థులపైనే ఈ సెలవుల ప్రభావం తీవ్రంగా ఉన్నది. వారి చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులే ఎక్కువగా నష్టపోతున్నారు. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులపై ఎక్కువ ప్రభావం పడనుంది. ఎందుకంటే వారు మార్చి, ఏప్రిల్‌లో పబ్లిక్ పరీక్షలను రాయాల్సి ఉంటుంది. కాబటి ప్రతిరోజూ ఆ విద్యార్థులకు ఎంతో కీలకం. వరుస సెలవుల నేపథ్యంలో సిలబస్ పూర్తి చేయడంపైనా ప్రభావం పడుతుంది. గతంలో 2020-21, 2021-22 రెండు విద్యాసంవత్సరాలు కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలోనూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులే ఎక్కువగా నష్టపోయారు. ఆ ప్రభావం ఇంకా వెంటాడుతూనే ఉన్నది. విద్యార్థుల సామర్థ్యం రోజురోజుకు పడిపోవడమే అందుకు నిదర్శనం. వివిధ సర్వే సంస్థల నివేదికల ప్రకారం మూడో తరగతి లెక్కలను ఎనిమిదో తరగతి విద్యార్థులు కూడా చేయలేకపోతున్నాయి. ఇలా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులే అన్ని రకాలుగా నష్టపోతున్నారు. ఇంకోవైపు ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పర్యవేక్షణ అధికారుల పోస్టుల్లో ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారు. సబ్జెక్టు టీచర్ల కొరతతో బోధనపై ప్రభావం పడుతున్నది. విద్యావాలంటీర్లను నియమించడం లేదు. ఇప్పుడు వర్షాల నేపథ్యంలో సెలవులతో ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులే మరోసారి నష్టపోవాల్సి వస్తున్నది.



ప్రయివేటులో ప్రత్యామ్నాయ బోధన

వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం సెలవులు ప్రకటించినా ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రత్యామ్నాయ బోధనపై దృష్టి సారించాయి. ఆన్‌లైన్‌లో పాఠాలను అక్కడి టీచర్లు బోధిస్తున్నారు. ప్రీప్రైమరీ విద్యార్థులనూ వదలడం లేదు. ఇది తల్లిదండ్రులకే తర గతులు నిర్వహిస్తున్నట్టుగా ఉన్నది. చిన్నపిల్లల పక్కన కచ్చితంగా తల్లి లేదా తండ్రి ఉండాల్సి వస్తున్నది. ఇక పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల కైతే కొన్ని విద్యాసంస్థలు నేరుగా తరగతులను నిర్వహిస్తున్నా యి. ఈ రకంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులు నష్ట పోతుంటే ప్రయివేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులు పాఠాలు వింటున్నారు. దీంతో విద్యారంగంలో అంతరాలు పెరుగు తున్నాయి. ఇంకోవైపు ప్రయివేటులో ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తుండడంతో తల్లిదండ్రులపై భారాలు పడుతున్నా యి. ఒకవైపు ఫీజులు, యూనిఫారాలు, షూ, బ్యాగులు కొనేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు ఆన్‌లైన్ తరగతుల కోసం మొబైల్ ఫోన్లులేదంటే ల్యాప్ టాప్‌లు, కంప్యూటర్లు కొనాల్సి వస్తున్నది. దీంతో ఆర్థికంగా తల్లిదండ్రులపై భారాలు పడుతున్నాయి. ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న తల్లిదండ్రులు మరింత ఇబ్బంది పడాల్సి వస్తున్నది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి : చావ రవి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

రాష్ట్రంలో వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం వరుసగా సెలవులు ప్రకటించింది. ఎక్కడ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారో ఆయా ప్రాంతాల్లో సెలవులిస్తే బాగుంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే నిర్ణయం తీసుకోవడం వల్ల నష్టం కలుగుతుంది. పనిదినాలు నష్టపోవాల్సి వస్తుంది. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఎక్కువ పనిగంటలు, సెలవు దినాల్లోనూ తరగతులను నిర్వహించే అవకాశముంటుంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆ రకమైన పరిస్థితి ఉండదు. సెలవులిచ్చినా ప్రయివేటుతోపాటు గురుకులాల్లోనూ బోధన సాగుతున్నది. ఆన్‌లైన్‌లో పాఠాలను బోధిస్తున్నారు. దాన్ని నియంత్రించడం లేదు. సర్కారు నిర్ణయం వల్ల మండల, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే నష్టపోతున్నారు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండవు. అది ఉన్నా చెప్పేందుకు అవకాశముండదు. ఏ కారణాలతో సెలవులిచ్చినా అది సహేతుకమైనా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని చదివే బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. జరిగిన నష్టాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలి.

పరీక్ష తర్వాత సవరణలు : ఎంహెచ్ఎస్ఆర్‌బీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆగస్టు నెలలో నిర్వహించనున్న స్టాఫ్ నర్సు పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల వివరాల్లో ఏవైనా సవరణలుంటే పరీక్షల అనంతరం చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్టు రాష్ట్ర వైద్యసేవల నియామక మండలి తెలిపింది. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ, సవరణలకు అవకాశమిచ్చామని తెలిపింది. అయినా హాల్ టికెట్ల డౌన్‌లోడ్ తర్వాత కూడా సవరణల కోసం అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తుండటంతో బోర్డు ఈ నిర్ణయాన్ని తీసుకుందని తెలిపింది. పుట్టిన తేదీ, ఇంటిపేరు తదితర తప్పులతో పాటు సాంకేతిక లోపం కారణంగానూ తమ హాల్ టికెట్లలో తప్పులొచ్చాయని అభ్యర్థులు వాపోతున్నారు. అయితే వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, పరీక్ష అనంతరం సవరించుకోవచ్చని మండలి సూచించింది.

హాల్ టికెట్ల డౌన్‌లోడ్...

హాల్ టికెట్ల డౌన్‌లోడ్, ప్రింట్ తీసుకోవడంలో ఇబ్బందులుంటే హెల్ప్‌లైన్ నెంబర్ 74169 23578 నెంబర్‌లో గానీ helpdeskstaffnurse2023@gmail.comలోగానీ సంప్రదించవచ్చు.

అన్ని రకాల సెలవులు రద్దు : వైద్యారోగ్యశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారీ వర్షాల నేపథ్యంలో నేపథ్యంలో వైద్యారోగ్యశాఖలో ఉద్యోగులు, సిబ్బందికి అన్ని రకాల సెలవులను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు జిల్లా వైద్యారోగ్య అధికారులను ఆదేశించారు. ఉద్యోగులందరూ తప్పనిసరిగా విధుల్లో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదేశాలు అమలు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీచ రాజకీయాలు మానుకోవాలి

- రెడ్కో చైర్మెన్ వై.సతీష్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి నీచ రాజకీయాలు చేయటం మానుకోవాలని తెలంగాణ రెడ్కో చైర్మెన్ వై సతీష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో హితవు పలికారు. ప్రజలు కష్టాల్లో ఉంటే.. జీహెచ్ఎంసీ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వటమేంటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తీరు శవాల మీద పేలాలు ఏరుకున్నట్టుగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిస్తే.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాత్రం ఆందోళనలకు పిలుపునిచ్చారని పేర్కొన్నారు. దీన్ని బట్టే ఎవరు ప్రజల పక్షాన పనిచేస్తున్నారనేది అర్థమవుతున్నదని తెలిపారు.

డిగ్రీలో చేరే గడువు 31 వరకు పొడిగింపు

- వర్షాల నేపథ్యంలో ఉన్నత విద్యామండలి నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువును ఈనెల 28 నుంచి 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల నేపథ్యంలో బుధ నుంచి శుక్రవారం వరకు మూడురోజులపాటు అన్ని విద్యాసంస్థలకూ ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని తెలిపారు. అందుకే మొదటి, రెండు, మూడో విడతలో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన వారు కాలేజీల్లో రిపోర్టు చేసే గడువు కూడా ఈనెల 31 వరకు పొడిగించామని పేర్కొన్నారు. అదేరోజు నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

జోరువానలోనూ బతుకు పోరు

- కలెక్టరేట్ల ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా
- భారీ వర్షంలోనే నిరసన
- ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరిక

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యల పరిష్కారం కోసం 22 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేశారు. జోరు వానలోనూ గురువారం కలెక్టరేట్లను ముట్టడించారు. వర్షంలోనే కూర్చుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా తమ గోడు వినకపోతే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.మహిపాల్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. వీరికి కేవీపీఎస్, గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కలెక్టర్ నారాయణకు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 22 రోజులుగా జీపీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కారించకుండా వారిని అధికారులు బెదిరించడం సరికాదన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు అన్ని మండలాల నుంచి కార్మికులు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి బయటకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. మొదట మున్సిపల్ ఆఫీసు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. వర్షం కురుస్తున్నా గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి ఎర్రజెండా చేతపట్టి కదం తొక్కారు. ధర్నా నేపథ్యంలో కార్యాలయ గేట్లను మూసేయడంతో వానలోనే కార్మికులు ధర్నా చేశారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు.

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జేఏసీ నాయకత్వంలో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌ను ముట్టడించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. యాదాద్రిభువనగిరి, నల్లగొండ కలెక్టరేట్లను వేలాది మంది కార్మికులు ముట్టడించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించారు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు, కొప్పర్లు పట్టుకుని ధర్నాలో పాల్గొన్నారు.



పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి పుత్రశోకం

- ఎమ్మెల్యే పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి
- నివాళులర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ

నవ తెలంగాణ - పటాన్ చెరు



పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పుత్రశోకంలో మునిగిపోయారు. ఎమ్మెల్యే పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి(35) గురువారం ఉదయం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో అనారోగ్యంతో మతి చెందారు. కుమారుడి మరణంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో పాటు కుటుంబీకుల రోదనలు అందరినీ తీవ్రంగా కలిచి వేశాయి. నిన్నమొన్నటి వరకు అందరితో కలిసి మెలిసి ఉంటూ ఆప్యాయంగా పలకరించిన విష్ణువర్ధన్ రెడ్డి మరణ వార్తతో.. సన్నిహితులు, స్నేహితులు, బంధుమిత్రులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మృతునికి భార్య కిరణ్మయితో పాటు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. గురువారం ఉదయం ఆస్పత్రి నుంచి ఎమ్మెల్యే నివాసానికి విష్ణు భౌతికకాయాన్ని తీసుకువచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే సొంత స్థలం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ పక్కన విష్ణువర్ధన్ రెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో రాష్ట్ర మంత్రులు మహమ్మద్ అలీ, తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ వెన్నవరం భూపాల్ రెడ్డి, మహిళా కార్పొరేషన్ చైర్మెన్ సునీతా లక్ష్మారెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, మదన్ రెడ్డి, మాణిక్ రావు, జిల్లా కలెక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, కుర్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో కొత్త పరిశోధనలకు శ్రీకారం

- రాయల్ కాలేజ్ గ్లాస్గో భాగస్వామ్యంతో సేవల్లో మెరుగుదల
- నిమ్స్‌ను సందర్శించిన రాయల్ కాలేజ్ అధ్యక్షులు డాక్టర్ మైక్ మెకెర్డీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్ ఆస్పత్రిలో సేవల్ని మరింత మెరుగుపరిచేందుకు కొంత పరిశోధనలకు శ్రీకారం చుట్టేందుకు రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో, నిమ్స్ పరస్పర సహకారం అందించుకోనున్నట్టు ఆ కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ మైక్ మెకెర్డీ తెలిపారు. ఇంగ్లాండ్, స్కాట్లాండ్ దేశాల్లో నాణ్యమైన వైద్యాన్ని, పరిశోధనల్ని అందిస్తున్న ఈ సంస్థ అధ్యక్షులు హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిని గురువారం సందర్శించారు. నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప నేతృత్వంలో వివిధ విభాగాల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ మైక్ మాట్లాడారు. ఆస్పత్రిలో పేదలకు అందుతున్న నాణ్యమైన వైద్యసేవలను కొనియాడారు. యాంటీ బయోటిక్స్, ఇతర మందుల వినియోగం, వివిధ రకాల పరిశోధనల గురించి నిమ్స్ వైద్యులతో చర్చించారు. రెండు సంస్థల మధ్య పరస్పర ఒప్పందం ద్వారా పరిశోధనలు మరింత వేగవంతం చేయొచ్చని అన్నారు. నిమ్స్ ఎండీ, పీజీ, ఎంసీఎచ్ విద్యార్థులు ఇంగ్లాండ్ వెళ్లి వైద్య సేవలు, పరిశోధనలపై తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని, అలాగే అక్కడి వైద్య విద్యార్థులు నిమ్స్‌కొచ్చి తెలుసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా వైద్య వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అవగాహన చిత్రాలను నిమ్స్ డైరెక్టర్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో ఓయస్‌డి డాక్టర్ గంగాధర్, డాక్టర్ పరంజ్యోతి, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ తిర్మల్, డాక్టర్ శాంతి వీర్, డాక్టర్ కృష్ణ రెడ్డి, పలు విభాగాల అధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

మనోవేదనతో కార్మికుడు మృతి

నవతెలంగాణ-బయ్యారం

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఉప్పలపాడు గ్రామ పంచాయతీ పంప్ ఆపరేటర్ బయ్య కృష్ణ(45) మృతిచెందారు. గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో కృష్ణ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. నాలుగు రోజులుగా వర్షంలో తడుస్తూనే సమ్మెలో కూర్చున్నాడు. తమ హక్కులను సాధించుకునే వరకు సమ్మె కొనసాగిస్తామని కుటుంబీకులతో చెబుతూ ఉండేవాడు. గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కృష్ణ మృతిచెందారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం ఆలోచించి మరో కార్మికుడు బలి అవ్వకముందే గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.



స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అసమర్థత వల్లే...

- కడెం ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడం లేదు
- కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అసమర్థ వల్లే నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడం లేదని కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గతేడాది కూడా గేట్ల సమస్యతోనే ఇబ్బంది ఏర్పడి సాగు భూములన్నీ కోతకు గురయ్యాయని ఒక ప్రకటనలో గుర్తు చేశారు. గేట్ల పని తీరును పర్యవేక్షించి సరి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం భేషరతుగా తమ తప్పును ఒప్పుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు.

నేడు జీహెచ్ఎంసీ ముట్టడి

టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు

వరదలు, భారీ వర్షాలతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడించాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నగర జీవనం అతలాకుతలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

మణిపూర్ తరహాలో తెలంగాణలో బీజేపీ కుట్ర

మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ఆరోపించారు. మణిపూర్‌లాగే తెలంగాణను కూడా రావణకాష్టం చేసేందుకు ఆ పార్టీ ఎంపీ సోయంబాపురావు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రెండు తెగల మధ్య చిచ్చు పెట్టేలా వ్యాఖ్యలు చేసిన సోయం బాబురావు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మణిపూర్ తరహా కుట్రలకు తెరలేపిన బీజేపీ

- తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని చూడడం ద్వారా మణిపూర్ తరహాలో బీజేపీ కుట్ర చేస్తున్నదని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలనీ, లేదంటే పోరాటం చేస్తామంటూ బీజేపీకి చెందిన ఆదిలాబాద్ బీజేపీ పార్లమెంట్ సభ్యులు సోయం బాబురావు ప్రకటించటాన్ని చూస్తే..గిరిజనుల మధ్య చిచ్చురేపే కుట్రకు పాల్పడుతున్నారని అర్థమవుతున్నదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న గిరిజనుల మధ్య మణిపూర్‌లో ఘర్షణలు రగిలించి, మారణహోమం సృష్టించారని తెలిపారు. దేశమంతా బీజేపీ పాలిత మణిపూర్ మారణ హోమంపై స్పందిస్తుంటే.. సోయం బాబురావు అక్కడి తరహా కుట్రలకు తెరలేపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మణిపూర్‌లో గిరిజన తెగలపై దాడులు, హత్యలు, చేసి మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడులకు పాల్పడుతుంటే బాధ్యతగల ఆ ఎంపీ కనీసం స్పందించలేదని గుర్తుచేశారు. మతోన్మాదుల చేతిలో ఆయన కీలుబొమ్మగా సోయం బాబురావు మారాడని విమర్శించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గిరిజన హక్కులకు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. అడవులు, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు బుధవారం పార్లంట్‌లో చట్టం చేస్తుంటే ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు. కేంద్రం అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడకుండా ఆ సమస్యను పక్కదారి పట్టించేందుకే ఇలాంటి దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని గతంలో ప్రధాని మోడీకి 45 మంది బీజేపీ పార్లమెంట్ సభ్యుల సంతకాలతో వినతి పత్రం ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు గిరిజన వ్యవారాల శాఖ మంత్రికి వినతి పత్రం ఇచ్చారని పేర్కొన్నారు. 1976లోనే రాజ్యాంగబద్ధంగా ఎస్టీ జాబితాలో లంబాడీ గిరిజనులను కలిపారనీ, వారిని ఆ జాబితా నుంచి తొలగించడం సాధ్యం కాదని సోయం బాబు రావు కు తెలిసినా ఆదివాసి గిరిజనులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకే బీజేపీ నాటకం ఆడుతోందని తెలిపారు. బాబురావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో గిరిజనుల మధ్య ఎలాంటి ఘర్షణలు జరిగినా..అందుకు బీజేపీనే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఎంపీహెచ్ఏ (ఫిమేల్) నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

- ఖాళీ పోస్టుల్లో కాంట్రాక్టు ఎంపీహెచ్ఏలను రెగ్యులర్ చేయాలి : టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,520 ఎంపీహెచ్ఏ (ఫిమేల్) పోస్టుల భర్తీకి వైద్యారోగ్య సేవల నియామక మండలి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ-సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ ఫసియుద్దీన్, కె.యాదానాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీ పోస్టుల్లో ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ (ఫిమేల్) అభ్యర్థులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. నోటిఫికేషన్‌లో కాంట్రాక్టు సర్వీస్‌కు 20 మార్కుల వెయిటేజీ ఇచ్చి, 80 మార్కులకు పరీక్ష నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో కాంట్రాక్టు ఏఎన్ఎంలకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. 20 ఏండ్లుగా సేవలందిస్తున్న వారిని రెగ్యులర్ చేయకుండా నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదని సూచించారు. విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ గతంలో నోటిఫికేషన్ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్, రోస్టర్ ప్రకారంగా డిస్టిక్ సెలక్షన్ కమిటీ (జిల్లా ఎంపిక కమిటీ) ఆధ్వర్యంలో నియమితులయ్యారని గుర్తుచేశారు. అనేక ఏండ్లుగా సేవలందించిన అనుభవం వారికుందని తెలిపారు. అలాంటి వారిని కాదని కొత్త వారికి అవకాశమిస్తే పాత వారికి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అతి తక్కువ వేతనంతో ఏండ్ల తరబడి సేవలందించిన వారి సేవలను క్రమబద్ధీకరించకుండా, రాతపరీక్షలో ఉత్తీర్ణులై ఉద్యోగాల్లో చేరాలని చెప్పడం అన్యాయమంటూ వ్యతిరేకించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ (ఫిమేల్)లు అందరూ రెగ్యులర్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సెకెండ్ ఏఎన్ఎంలు, ఈసీ ఏఎన్ఎంలు, అర్బన్ సెంటర్ ఏఎన్ఎంలు ఇలా రకరకాల పేర్లతో సేవలందించారని తెలిపారు.

భారీ వర్షాల నేపథ్యంలో నీటిపారుదలశాఖ అప్రమత్తం : రజత్‌కుమార్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర సాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖ అప్రమత్తంగా ఉందని ఆ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ తెలిపారు. కడెం ప్రాజెక్టులో రెండు గేట్లు మొరాయించాయనీ, వాటికి వెంటనే మరమ్మతులు చేసి పునరుద్ధరించినట్ల చెప్పారు. డ్యామ్ ఎత్తు 700 అడుగులు కాగా, 702 అడుగుల మేర నీటి ప్రవాహం ఉందని అన్నారు. గతేడాది 706 అడుగుల మేర నీరు ప్రవహించిందనీ, ఎలాంటి ఇబ్బంది జరగలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు.

మిషన్ కాకతీయ ఫలితాలు కనిపిస్తున్నయ్..

బుధవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం 8 గంటల వరకు ములుగులో అత్యధికంగా 650 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంత పెద్ద మొత్తంలో వర్షాపాతం నమోదవడం ఇదే తొలిసారని రజత్‌కుమార్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్‌లో అత్యధిక వర్షపాతం నమోదైందనీ, నీటిపారుదల శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నదని గుర్తు చేశారు. మిషన్ కాకతీయ ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయనీ, మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువుల పూడికతీతతో ఇంత భారీ వర్షాలు, వరదలతో పెద్దగా గండ్లు పడడం లేదన్నారు. ఇంత పెద్ద ఎత్తున వరదలు వచ్చిన కేవలం 100లోపు చెరువులు మాత్రమే గండ్లు పడ్డాయని తెలిపారు. గోదావరి నదిలో వరద ఎక్కువగా ఉందనీ, జిల్లా కేంద్రాల్లో నీటిపారుదల శాఖ ప్రత్యేకంగా ఇంజినీర్లను నియమించినట్టు వివరించారు. కడెంలో వరద ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఇన్‌ఫ్లో తగ్గిందన్నారు. రాబోయే కొద్దిగంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్యామ్‌లపైకి వెళ్లి సెల్ఫీ తీసుకోవద్దని సూచించారు.

భద్రాచలం వద్ద ఉధతంగా గోదావరి

భద్రాచలం దగ్గర గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నదని రజత్‌కుమార్ తెలిపారు. అక్కడ సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల్లోని నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.లోతట్టు

ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉంచామన్నారు. సైనికులను అక్కడ అందుబాటులో ఉంచుతామనీ, సాయంత్రం భద్రాచలానికి రెండు హెలికాప్టర్లు పంపున్నట్టు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు గేట్లు ఎప్పుడు ఎత్తి ఉంచాలని చెప్పామనీ, గోదావరి నదిలో వరద ప్రవాహం తగ్గే అవకాశాలున్నాయని వివరించారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

గంగాడి సుధీర్ మరిన్ని మంచి రచనలు చేయాలి

- 'కవనం' కవితా సంపుటి ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రముఖ కవి, రచయిత రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన గంగాడి సుధీర్ మరిన్ని రచనలు చేయాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. ఆయన రచించిన 'కవనం' కవితా సంపుటిని కేటీఆర్ ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్‌లోని టీ సాట్ ప్రాంగణంలో ఓయూ వీసీ రవిందర్ యాదవ్, అంబేద్కర్ యూనివర్శిటీ వీసీ సీతారామారావ్, టీ సాట్ సీఈవో శైలేష్ రెడ్డి, ఇతర విద్యావేత్తల సమక్షంలో మంత్రి పుస్తకాన్ని ఆవిష్కరించారు. తన మొదటి పుస్తకం 'ఇగురం' కథా సంపుటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారంటూ గంగాడి సుధీర్ ఈసందర్భంగా గుర్తు చేశారు.

సంపాదకీయం

స్పెయిన్ ఎన్నికల్లో మితవాదులకు అడ్డుకట్ట!

ఐదు కోట్ల జనాభా ఉన్న స్పెయిన్లో గత ఆదివారం నాడు జరిగిన సాధారణ ఎన్నికల్లో మితవాద శక్తులను అడ్డుకోగలిగినప్పటికీ రాజకీయ ప్రతిష్టంభన ఏర్పడింది. ప్రాంతీయ పార్టీలతో బేరసారాలకు తెరలేచే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న వామపక్ష కూటమి పార్టీలు సంపూర్ణ మెజారిటీ తెచ్చుకోవటంలో విఫలమై స్వల్ప తేడాతో పెద్ద కూటమిగా నిలిచాయి. పార్లమెంటు దిగువ సభలో 350 డిప్యూటీలకు గాను వామపక్షాలకు 172, మితవాద పార్టీలకు 170 వచ్చాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 176 స్థానాలు అవసరం. కాటలాన్ ప్రాంతానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని కోరుతున్న జుంట్స్ పార్టీ ఏడు స్థానాలు తెచ్చుకుంది. దాని షరతులకు అంగీకరించిన కూటమి ఇప్పుడు అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. అధికార కూటమిలోని సోషలిస్టు పార్టీ గతం కంటే రెండు సీట్లు అదనంగా తెచ్చుకొని 122 స్థానాలతో రెండవ పార్టీగా అవతరించింది. అంతకు ముందు 89 స్థానాలతో రెండవ పక్షంగా ఉన్న పాపులర్ పార్టీ 136 స్థానాలతో అతి పెద్ద పక్షంగా ఉంది. అధికార కూటమిలోని కమ్యూనిస్టు, పోడెమాస్ తదితరులతో కూడిన వామపక్ష సంఘటన గతంలో ఉన్న 38లో ఏడు కోల్పోయి 31తెచ్చుకుంది. ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీ లేనందున పెద్ద పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారు. అది సభలో మెజారిటీ నిరూపించు కుంటుందా చేతులెత్తేస్తుందా, వచ్చే రోజుల్లో ఏం జరగనుంది అనేదాని కంటే మితవాద భూతాన్ని అధికారంలోకి రాకుండా చేశారనే సంతృప్తి, అభినందనలు అధికార కూటమి పొందింది. అనేక మంది ఈ పరిణామాన్ని స్వాగతించారు. ఐరోపాలో మరో దేశాన్ని మితవాద శక్తుల కౌగిలిలోకి పోకుండా చేశారని పరిశీలకులు భావిస్తున్నారు. మే నెలలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో అధికార కూటమిలోని ప్రధాన సోషలిస్టు వర్కర్స్ పార్టీ తన పట్టును కోల్పోయింది. దాంతో సాధారణ ఎన్నికల్లో మితవాద పాపులర్ పార్టీ 150 నుంచి 160 స్థానాల వరకు తెచ్చుకుంటుందని, మరో మితవాద ఓక్స్ పార్టీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని వివిధ సర్వేలు, విశ్లేషణలు ఎన్నికలకు ముందు వెలువడ్డాయి. నియంత జనరల్ ఫ్రాంకో తరువాత తొలిసారిగా స్పెయిన్లో పచ్చిమితవాద ఓక్స్ పార్టీ చక్రం తిప్పుతుందని భావించారు. పాపులర్ పార్టీ నుంచి విడిపోయిన శక్తులు 2014లో ఓక్స్ పార్టీగా రంగంలోకి వచ్చాయి. గత ఎన్నికల్లో 52 స్థానాలు తెచ్చుకొని ఈ సారి 33కు పరిమితమైంది.

> ప్రస్తుతం ఐరోపా, అనేక దేశాల్లో పచ్చి మితవాద శక్తులు పెరుగుతున్న పూర్వరంగంలో వాటిని అడ్డుకోవటం చిన్నదేమీ కాదు. స్పెయిన్‌లో అడ్డుకున్నప్పటికీ అవి అధికారానికి దగ్గరగా వచ్చినందున వాటి ముప్పును తక్కువగా చూడకూడదు. మితవాదులను అడ్డుకోగలమనే సందేశాన్ని ఇచ్చిన స్పెయిన్ సోషలిస్టు, వామపక్ష శక్తుల తీరు ఒక్క ఐరోపాకే కాదు, ప్రపంచమంతటికీ ఉత్తేజం కలిగించేదిగా ఉంటుంది.



మితవాద శక్తులను అడ్డుకోవటం వామపక్షాలకు ఒక పెద్ద విజయంగా కొందరు వర్ణించారు. సోషలిస్టు పార్టీ నేత పెడ్రో సాంఛెజ్ తొలిసారి 2018 ప్రధాని కాగా రెండవసారి 2019 ఎన్నికల్లో గెలిచి 2020లో తొలిసారిగా స్పెయిన్‌లో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. దీనిలో కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు ఎలోండా డియాజ్ అధినేతగా సుమర్ పేరుతో 15 పార్టీలు, శక్తులతో కూడిన వామపక్ష కూటమి ఉంది. ఆమె కార్మికశాఖ మంత్రిగా కూడా ఉన్నారు. పోడెమాస్ నేత పాబ్లో గ్లెసియాస్ రాజకీయాల నుంచి తప్పుకోవటంతో ఈ కూటమి నేతగా ఎలోండాను ఎన్నుకున్నారు. పాపులర్ పార్టీ, ఓక్స్ కూటమి అధికారంలోకి వస్తే దేశానికి ముప్పని సోషలిస్టు, వామపక్ష కూటమి ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చిన అంశాలు ఫలితాలను ఇచ్చాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్వీడన్, ఫిన్లండ్, ఇటలీ ఎన్నికల్లో పచ్చి మితవాద శక్తులు అధికారానికి వచ్చాయి. ఇక్కడ కూడా మితవాద కూటమి వస్తే ఐరోపా సమాఖ్యలో అనేక అంశాల మీద మితవాద శక్తుల పట్టు బిగిసే అవకాశం ఉందని జర్మనీ, ఫ్రాన్స్ ఆందోళన చెందాయి. ఓక్స్ పార్టీతో తమకెలాంటి సంబంధం లేదని పాపులర్ పార్టీ ఎన్నికల ప్రచారంలో చెప్పుకోవాల్సి వచ్చింది. కానీ మే నెలలో జరిగిన ప్రాంతీయ, స్థానిక సంస్థల ఎన్నికలలో ఆ రెండు పార్టీలు కలసి అనేక చోట్ల అధికారాన్ని పంచుకోవటాన్ని, తిరోగామి అంశాలపై ఏకాభిప్రాయం వెల్లడించటాన్ని వామపక్షాలు ఎత్తి చూపాయి. అక్కడి రాజ్యాంగం ప్రకారం ఫలితాలు వెలువడిన నెలరోజుల్లో పార్లమెంటు సమావేశం జరుగుతుంది. పెద్ద పార్టీ నేతను రాజు ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తాడు. మూడు నెలల్లో మెజారిటీ నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ విఫలమైతే రెండవ పార్టీకి అవకాశం అది కూడా కుదరకపోతే మరోసారి ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఐరోపా, అనేక దేశాల్లో పచ్చి మితవాద శక్తులు పెరుగుతున్న పూర్వరంగంలో వాటిని అడ్డుకోవటం చిన్నదేమీ కాదు. స్పెయిన్‌లో అడ్డుకున్నప్పటికీ అవి అధికారానికి దగ్గరగా వచ్చినందున వాటి ముప్పను తక్కువగా చూడకూడదు. మితవాదులను అడ్డుకోగలమనే సందేశాన్ని ఇచ్చిన స్పెయిన్ సోషలిస్టు, వామపక్ష శక్తుల తీరు ఒక్క ఐరోపాకే కాదు, ప్రపంచమంతటికీ ఉత్తేజం కలిగించేదిగా ఉంటుంది.

దేశాన్ని నగ్నంగా నడిపించిన వారు మన పాలకులా?

గతంలో లాగ మతం వేరు దేశభక్తి వేరు కాదు. ప్రస్తుతం మనదేశంలో ఆరెండూ కలిసిపోయి ప్రజల భావోద్రేకాలతో ఆడుకుంటున్నాయి. ప్రపంచంలో భారతదేశానికి అతిపెద్ద ప్రజాస్వామిక దేశం - అనే గుర్తింపు ఉంది. ప్రపంచంలోని ఓటర్లలో నాలుగోవంతు ఈ దేశంలోనే ఉన్నారు. ప్రపంచ జనాభాలో ఆరోవంతు ఈ దేశంలోనే ఉన్నారు. అందువల్ల ఈ దేశంలో జరుగుతున్న రాజకీయ మార్పుల ప్రభావం దక్షిణ ఆసియాలోనూ, ఇతర ప్రజాస్వామిక ప్రపంచ దేశాల మీదా ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. 'దేశభక్తి'కి సంబంధించిన సమస్యలు ప్రపంచంలో ఒక్క భారతదేశమే ఎదుర్కోవడం లేదు. ఇతర దేశాల్లో కూడా మతపరమైన దేశభక్తి కొంత బలపడుతూ ఉంది. ఉదాహరణకు టర్కీ, లాటిన్ అమెరికా, పశ్చిమ ఐరోపా, సోవియట్ లోని కొన్ని భాగాలు చెప్పుకోవచ్చు.




డాక్టర్ దేవరాజు మహారాజు

2018 నాటి కోస్టారికాన్ అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఒక నినాదం బలంగా వినపడింది. "మనల్ని దైవం పంపించిన ఒక మనిషి (MAN OF GOD) పరిపాలించకపోతే ఇక వేరెవరూ పాలించలేరు" అనేది ఒక మంత్రంగా పనిచేసింది. ఆ మధ్య విజయవంతంగా గెలిచిన రైట్ వింగ్ బ్రెజిల్ అధ్యక్ష అభ్యర్థి జైర్ బొల్సనారో ప్రజల్లోకి ఒక సందేశాన్ని పంపించగలిగాడు. "పైన దేవుడున్నాడు గనకనే బ్రెజిల్ ముంగిట అన్నీ సమకూరాయి." ఇలా క్రిస్టియన్ మతతత్వ దేశభక్తులు, ఇస్లాం మతతత్వ దేశభక్తులు ఎక్కువైపోతున్నారు. ఈ దైవభక్త దేశభక్తులు ఎక్కడైనా చేసేది ఒక్కటే... ముందు లేని దేవుణ్ణి చూపిస్తారు. తర్వాత సంస్కృతీ సంప్రదాయాలంటారు. గతమెంతో ఘనకీర్తి - గల వాళ్ళమన్నది గుర్తు చేస్తుంటారు. భావోద్వేగాలను రెచ్చగొట్టి, మనుషుల్ని భావదాస్యంలోకి లాగేస్తారు. ఆ తర్వాత వారి పబ్బం వారు గడుపుకుంటారు. లాభమంతా అధికారం చేజిక్కించుకున్న వాడికే తప్ప, అధికారం అందించే వాడికి ఆకలి, దారిద్ర్యం మినహా మిగిలేది ఏమీ ఉండదు.

భారతదేశంలోనూ జరుగుతున్నది ఇదే. గతంలో జరుగుతూ వచ్చింది కూడా ఇదే. బలవంతులు రాజులైతే వారికి సలహాదారుల స్థానంలో బ్రాహ్మణులుండేవారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత, రాజ్యాంగం రాసుకున్న తరువాత, మెరుగైన సమాజానికి రూపకల్పన జరిగింది. సమాజంలోని మనుషులందరికీ సమానమైన హక్కులు - బాధ్యతలూ వచ్చాయి. స్త్రీ-పురుషులకు సమాన స్థాయి లభించింది. మత ప్రసక్తిలేని విద్య అందరికీ అందుబాటులోకి వచ్చింది. 'ప్రజాస్వామ్య పరిరక్షణే మా ధ్యేయం' అని చెప్పుకున్న కాంగ్రెస్, స్వాతంత్ర్యానంతరం చాలాకాలం దేశాన్ని పాలించింది. అయితే అప్పుడప్పుడు కొన్ని తప్పిదాలు కూడా చేసింది. ముఖ్యంగా ఇందిరాగాంధీ సమయంలో సిక్కుల ఊచకోత, గోల్డెన్ టెంపుల్ ఆపరేషన్‌లు జరిగాయి. ప్రతిఫలంగా ఆమె తన ప్రాణాలే కోల్పోవాల్సి వచ్చింది. రాజ్యాంగ బద్ధంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించు కుంటూ వస్తే, దేశంలో ఎన్నో దుర్ఘటనలు జరగకుండా ఉండేవి. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ రావాలేగాని, తప్పుల మీద తప్పులు, ఇంకా పెద్ద తప్పులు చేసుకుంటూ పోతే, దేశంలో ప్రజాస్వామ్యానికి కాలం చెల్లిపోతుంది.

బీజేపీ పూర్తి మెజార్టీతో అధికారం చేపట్టినప్పటి నుండి దేశంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజాస్వామ్య సంస్కృతిని ధ్వంసం చేస్తూ, హిందుత్వ సంస్కృతిని ప్రాచుర్యంలోకి తేవడంతో - దేశంలో మైనార్టీలకు భద్రత లేకుండా పోయింది. అంతే కాదు, అధికారంలో ఉన్నవారే అల్లర్లకు ఆజ్యం పోస్తున్నప్పుడు, మెజార్టీగా ఉన్న హిందువులకు కూడా రక్షణ లేకుండా పోయింది. అల్లర్లు మొదలయ్యాయంటే, అవి ఎటునుండి ఏ మలుపు తీసుకుంటాయో తెలియదు. అల్లర్లలో చిక్కుకున్న వారు ఏ మతస్తులైనా కావొచ్చు కదా? కొన్ని నెలలుగా మణిపూర్ మండిపోతుంటే ఈ దేశ ప్రధాని ఒక చిన్న మాట మాట్లాడలేదు. ఈ విషయంపై ప్రముఖ జర్నలిస్ట్ కరన్ థాపర్ ఏమన్నారో చూడండి... "టర్కీ భూకంపానికి మన ప్రధాని స్పందించి ట్వీట్ చేస్తారు. గుజరాత్ తుపాన్ గురించి 'మన్‌కి బాత్'లో ప్రస్తావిస్తారు. కాని, మణిపూర్‌లో కొన్ని నెలలుగా జరుగుతున్న మారణకాండ గురించి ఎక్కడా ఏమీ స్పందించరు. అంటే ఈ దేశం ఏమి అర్థం చేసుకోవాలి? 1. ఆయనకు ఈ విషయం తెలియకపోవచ్చు. 2. విషయమంతా తెలిసినా, దాన్ని గుర్తించడానికి, వాటిపై స్పందించడానికి బాహుశా ఆయనకు ఆసక్తి లేకపోవచ్చు" అని! మణిపూర్‌లో జరుగుతున్న క్రైస్తవ వ్యతిరేక హింసకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మద్దతు ఇస్తున్నాయని ఆరోపిస్తూ మిజోరామ్ బీజేపీ ఉపాధ్యక్షుడు ఆర్. వన్‌రామ్ ఛుఅంగా తన పదవితో పాటు బీజేపీ పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇంపాల్‌ను సందర్శించారు కానీ, రాష్ట్రంలో చర్చ్ భవనాలను తగులబెట్టడాన్ని ఆయన తప్పుపట్టలేదు. చర్చ్‌లను తగలబెడుతూ ఉంటే కేంద్ర ప్రభుత్వం ఖండించకపోవడం - భరించలేని బీజేపీ పార్టీ ఉపాధ్యక్షుడు రాజీనామా చేసి బయటికి వెళ్ళిపోయాడు. పార్టీ ముఖ్యం కాదు, మానవత్వానికి ప్రాధాన్యమివ్వడం ముఖ్యం! అని అనుకుని ఉంటారు, వన్‌రామ్ ఛుఅంగా.

ఉత్తర భారతదేశం వరదల్లో కొట్టుకుపోతూ ఉంటే, ఢిల్లీ ఎర్రకోట చుట్టూ నీళ్ళు నిలిస్తే, గాంధీ సమాధి సైతం నీట మునిగితే - దగ్గరుండి కాపలాదారు చూస్కోవాలి కదా? దేనికి ముందు ప్రాధాన్యత ఇవ్వాలి? దేనికి తరువాత ఇవ్వొచ్చు అనేది చూస్కోవాలి కదా? ఏదో అర్జంటు పని ఉన్నట్టు భారత ప్రధాని ఫ్రాన్స్‌కు వెళ్ళిపోతాడా? ఎక్కడికి వెళ్ళినా



> కొన్ని నెలలుగా మణిపూర్ మండిపోతుంటే ఈ దేశ ప్రధాని ఒక చిన్న మాట మాట్లాడలేదు. ఈ విషయంపై ప్రముఖ జర్నలిస్ట్ కరన్ థాపర్ ఏమన్నారో చూడండి... "టర్కీ భూకంపానికి మన ప్రధాని స్పందించి ట్వీట్ చేస్తారు. గుజరాత్ తుపాన్ గురించి 'మన్‌కి బాత్'లో ప్రస్తావిస్తారు. కాని, మణిపూర్‌లో కొన్ని నెలలుగా జరుగుతున్న మారణకాండ గురించి ఎక్కడా ఏమీ స్పందించరు. అంటే ఈ దేశం ఏమి అర్థం చేసుకోవాలి? 1. ఆయనకు ఈ విషయం తెలియకపోవచ్చు. 2. విషయమంతా తెలిసినా, దాన్ని గుర్తించడానికి, వాటిపై స్పందించడానికి బాహుశా ఆయనకు ఆసక్తి లేకపోవచ్చు" అని!

కొనుగోళ్ళకే కదా? అవి తరువాతైనా చేసుకోవచ్చు కదా? సరే ఇది అలా ఉండనిద్దాం! ఈ హిందుత్వ వాదులు ఏం కోరుకుంటున్నారూ? అంటే... భారత రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలవారు సమానమే కానీ, అధిక సంఖ్యాకులుగా ఉన్న హిందువులకు సమాజంలో అగ్రస్థానం దక్కాలి. వారే మొదటిస్థాయి పౌరులు. ఇక మిగతావారంతా నోరెత్తకుండా రెండోస్థాయి పౌరులుగా పడి ఉండాలి. అంతే! ఆ కుట్రలో భాగంగానే, మిగతావారిని హిందువుల నుండి విడగొట్టి - చూపడానికే వారసత్వ చట్టాలు తెచ్చారు. దేశవ్యాప్తంగా వందల షహీన్‌బాగ్‌లు వెలిసి కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా నిరసించాయి. రైతు వ్యతిరేక చట్టాల్ని రైతులు తిప్పికొట్టిన విషయం కూడా మనం మరవకూడదు. ఎన్ని పరాభవాలు, పరాజయాలు ఎదురైనా మూర్ఖులు తమ పట్టుదలను వదలరు. అందుకు తాజా ఉదాహరణ యూనిఫాం సివిల్‌కోడ్. మతము - సంస్కృతి- దేశభక్తి అన్నింటినీ కలిపి దేశాన్ని 'హిందూ రాష్ట్ర'గా మార్చేయాలని ప్రభుత్వానికి వెనక ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ పథకాలు రచిస్తోంది.

అరవై ఏళ్ళుగా గత ప్రభుత్వం చేసిందీ? అని మోడీ తరచూ తన ప్రసంగాల్లో ప్రశ్నిస్తుంటారు. గత ప్రభుత్వాలు అరవైయేండ్లుగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ వస్తున్నాయని చెప్పడానికి మోడీజీయే ఒక పెద్ద ఉదాహరణ! ఒక రుజువు!! చదువుకోకపోయినా, రైల్వేస్టేషన్‌లో చాయ్ అమ్ముకుని బతికినా, భిన్నమైన ఆలోచనా ధోరణి గలవాడైనా... ఈ దేశ ప్రజలు అతన్ని ప్రధానిని చేశారు కదా? ప్రజాస్వామ్యంటే అదే... గత పాలకులు నిరంకుశులైతే మోడీ ప్రధాని అయ్యేవాడే కాదు. ముందు ఆ విషయం గ్రహించుకుంటే బావుండేది. అయినా ఆ స్థానానికి ఉన్న విలువను కాపాడలేక, ప్రపంచ దేశాల ముందు నవ్వులపాలు కావడం ఆయన తప్పిదం!! అధికారంలో ఉన్నవారు ఎప్పుడైనా తామేం చేస్తున్నామని ఆత్మావలోకనం చేసుకోవడం మంచిది. ఏ ప్రభుత్వం ఏం చేసింది? ఏం చేయలేదూ? అన్నది ప్రజలు బేరీజు వేసుకుంటారు. అది వారి పని - నాయకులు వారి బాధ్యతల్ని వారు నిర్వహించుకుంటూ ఉంటే, ఇతరులను ప్రశ్నించొచ్చు. ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలు (జులై 2023) ఎగ్గొట్టి కేంద్ర సహాయమంత్రి వచ్చి హైదరాబాదులో రోడ్డుమీద భైఠాయిస్తాడు. తను వెంటనే బాటసింగారం డబుల్ బెడ్‌రూంలు చూడాలంటాడు. పార్లమెంట్ సమావేశాలు ఎగ్గొట్టి రావడం గొప్ప బాధ్యతగల పనా? ఎప్పుడు ఎక్కడ ఏ పని చేయాలో కనీస పరిజ్ఞానం కేంద్ర మంత్రులకే లేకపోతే ఎలా?

ఇది రాస్తున్న సమయానికి 2023 జులై 20న అన్ని టెలివిజన్ చానళ్ళలో ముగ్గురు మణిపూర్ కుకీ జాతి స్త్రీలను నగ్నంగా వీధుల్లో నడిపించిన వీడియో కనిపించింది. కలవరపడ్డ దేశ ప్రజలు తలదించు కున్నారు. మతోన్మాదం నీడన జరిగిన రాజకీయాన్ని ఈసడించుకున్నారు. జాతీయపతాకం అవనతమైనట్ల య్యింది. దేశం ప్రాభవం కోల్పోయింది. అంతకు ముందు రెండున్నర నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండకు ఈ పరేడ్ ఒక కొనసాగింపు. నగ్నంగా నడిపించిన ఆ ముగ్గురు స్త్రీలలో ఒక స్త్రీ భర్త సైనికుడు. దేశాన్ని రక్షించిన తను, తన భార్యను, తన గ్రామస్తుల్ని రక్షించుకోలేక పోయానని వాపోయాడు. భోరున విలపించాడు. ఆ ఏడుపు అతనొక్కడిదే కాదు, ఈ దేశంలో మనసున్న మనుషులందరిదీ... ఆ విషయాన్ని సుప్రీంకోర్టు వెంటనే సుమోటాగా స్వీకరించింది. మతాలవారిగా కులాల వారిగా ప్రజల్ని విభజించి, స్త్రీ శరీరాలను పావులుగా వాడుకునే దుష్ట రాజకీయాల్ని కేంద్ర ప్రభుత్వం అదుపులో పెట్టుకోలేకపోయింది. దేశ ప్రజల ముందు నిస్సిగ్గుగా బయటపడింది. 'ఇండియా'గా ఐక్యమైన విపక్షాలన్నీ మణిపూర్ వైఫల్యానికి దేశ ప్రధాని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి. పార్లమెంటు సమావేశాల తొలిరోజునే మణిపూర్ మారణహోమం గురించి చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి.

కుకీ మహిళల్ని నగ్నంగా ఊరేగించి అమానుష సంఘటన 2023 మే 4న జరిగితే, జులై 20న 78రోజుల తర్వాత ఒకరిని అరెస్టు చేశారు. దేశ పరిపాలనా వ్యవస్థ పనితీరును ఇది ప్రతిఫలిస్తుంది. నిజానికి సీన్‌లో కనిపించేవారు దోషులే అయినా, వారిని ఉసిగొల్పిన పెద్దదోషులు వేరే ఉన్నారు. నోర్లు విప్పకుండా, నిర్లిప్తంగా ఘోరాలు జరగడానికి సహకరించిన రాష్ట్ర - కేంద్ర నాయకులే అసలు దోషులు! స్వతంత్ర భారతదేశంలో తొలిసారి జరిగిన ఈ సంఘటన, కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్ని అంటే డబుల్ ఇంజన్ సర్కార్‌ని ప్రశ్నించింది. వారి మెదళ్ళలోని అనాగరికతకు అద్దం పట్టింది. మణిపూర్ జనాభాలో 54శాతానికి పైగా ఉన్న మైతీలకు కుకీ, నాగ గిరిజన తెగలకూ మధ్య బీజేపీ తన రాజకీయ లబ్ధికోసం చిచ్చుపెట్టింది. గిరిజన చట్టాలను అతిక్రమించి మైతీలను గిరిజనులుగా మార్చడానికి బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయి. కుకీ, నాగ తెగలు ప్రతిఘటించాయి. ఈ గిరిజన తెగల వారు క్రిస్టియన్లు. అందువల్ల మతోన్మాదులు ప్రభుత్వాల అండతో వారి ఇండ్లు, చర్చ్‌లు ధ్వంసం చేశారు. వందల మందిని చంపేశారు. స్త్రీలపై అత్యాచారాలు చేశారు. రెండున్న నెలలుగా అక్కడ మారణహోమం జరుగుతున్నా, రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి అందరికందరూ మౌనం వహించారు. అదుపు చేయడానికి ప్రయత్నించలేదు. అంతా అయిపోయాక దేశ ప్రధాని విభ్రాంతిని వ్యక్తం చేశారు. తన తన ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చి, ఒక రాజకీయ ప్రకటన చేశారు. దాన్ని మించిన అవివేకపు ప్రకటన మరొకటి ఉండదని దేశ ప్రజలు ఉడికిపోయారు. నిజాయితీ గల మనుషులైతే నాయకు లంతా రాజీనామాలిచ్చి, రాష్ట్రపతి పాలన తేవాలి. దానితో పరిస్థితి అదుపులోకి రావొచ్చు. మోడీజీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ గాయమైంది. ప్రధానిగా ఉన్నప్పుడు మణిపూర్ మండిపోయింది. ఎన్ని తప్పులు క్షమించినా, దేశ ప్రజలు బీజేపీ ప్రభుత్వం చేసిన ఈ రెండు తప్పుల్ని ఎప్పటికీ క్షమించరు. మణిపూర్‌లో మహిళల శరీరాలు రాజకీయ రణాలకు యుద్ధభూములయ్యాయి. అయినా అధికార పార్టీలో ఉన్న మహిళలు ఎవరూ గొంతెత్తలేదు. అన్యాయాన్ని నిరసించలేదు. మానవీయ విలువల్ని తొక్కిపెట్టే రాజకీయాలు ఇంత నీచంగా ఉంటాయా?

చివరగా- మనుషులుగా ఎదగని వారిని నాయకులుగా ఎన్నుకున్న ఈ దేశ ప్రజల మూర్ఖత్వంపై కూడా మనం జాలిపడక తప్పదు. వీళ్ళెప్పుడు ఎదుగుతారూ? తమలో నుంచి మానవత్వం, నిజాయితీగల నాయకుల్ని ఎప్పుడు తయారు చేసుకుంటారూ? ఈ చీకటిపాలనను ఎప్పుడు అంతం చేసుకుంటారూ?

- వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

ప్రకృతి శాసనం

ఎవడి రహస్య ఎజెండాలు
వాడికి ఉన్నాయి.

ఎన్నికల ఓట్ల కళ్ళద్దాలు తప్ప
వాడికేం కన్పించదు.

మనిషిగా జీవించడం
ఎప్పుడో మానేసాడు

ఈక్షణం నాబతుక్కి
రక్షణ కావాలి
దిక్కులు పిక్కటిల్లే
ఆక్రందన నాది
నరకప్రాయమైన
గుండెలోతుల్లో నుండి
వస్తున్న ఆత్మఘోష ఇది.

పేరుకే ప్రజాస్వామ్యం!
నాపై మూకాసురల రాజ్య దండయాత్ర

ఈ అసురుల ప్రాణ ప్రతిష్ఠ ఎవరిది?
నీది కాదా..?

నన్ను చంపినోళ్ళనో
నన్ను చెరచినోళ్ళనో
చంపేస్తే సరా? అదే
సమస్యాంతమా?

యుగయుగాలుగా
ఇవేగా ఘోరాలు - నేరాలు
మారణ హోమాలు - యుద్ధాలు
ఊచకోతలు - ప్రతీకారాలు

అసలు మనిషిపై
అంత కక్షెందుకు నీకు

నాలాగా నీవు
తల్లికడుపున పుట్టలేదా?
మరినీలాగానాకు
బతికే హక్కులేదా ఇదేం ధర్మం?

... ...

రక్షణ రక్షణ రక్షణ
రక్షణ స్థాపించే
శాంతిని శోధించండి
సాధించండి, బోధించండి

మనిషి రక్షణ పట్టని
మనిషెందుకు? పాలనెందుకు?

మళ్ళీ మళ్ళీ చెప్పున్నా...
నా రక్షణకై నేనే
నా మనుషులతో కలసి
జన్మ జన్మలు పోరాడుతా
ఇదే మానవ ధర్మం
ప్రకృతి శాసనం.

- కె శాంతారావు
9959745723

మెయిల్ @నవతెలంగాణ

ప్రతిపక్షాల ఆఖరి అస్త్రం... అవిశ్వాసం!

ప్రజాస్వామ్య దేశంలో అన్ని అంశాలపై చర్చించేందుకు వేదికగా పార్లమెంట్ ఉండాలి. ప్రజలకు అవసరమైన వివిధ చట్టాలను ప్రవేశపెట్టడం, సమగ్రమైన చర్చ జరిగి, అధికార, విపక్ష పార్టీల సభ్యులు సూచించిన ఆమోదయోగ్యమైన సలహాలు పరిగణనలోకి తీసుకోవడం అధికారపక్షం బాధ్యత. కానీ ఇటీవల కాలంలో అలా జరగటం లేదు. బీజేపీ సొంత అజెండాలకు, పట్టింపులకుపోయి, సభా సమయాన్ని వృథాచేస్తోంది. గత పార్లమెంటు సమావేశాల్లో "అదానీ" ఆర్థిక వ్యవహారాలపై జేపీసి వేయాలని విపక్షాలు పట్టుబట్టినా ఏమాత్రం లెక్కచేయకుండా కాలం వెళ్లదీసింది. ఇప్పుడు కూడా అదేతీరున వ్యవహరిస్తోంది. మణిపూర్ అమానుష సంఘటనపై ప్రస్తుతం పార్లమెంటు సమావేశాల్లో దేశ ప్రధాని మాట్లాడాలని విపక్షాలు పట్టుబడుతున్నా నేటికీ ప్రధాని మాట్లాడకపోవడం శోచనీయం. ఎలాగైనా ప్రధాని చేత మాట్లాడించాలని ప్రతిపక్షాలు ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. దీంతో విపక్షాలకు బలం లేకపోయినా, ప్రధాని చేత నోరు విప్పించాలని, వాస్తవాలు వెలుగులోకి రప్పించాలని ఒకే ఒక్క ఉద్దేశంతో అవిశ్వాస తీర్మాన నోటీసును ప్రవేశపెట్టాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 28వ అవిశ్వాస తీర్మానం నోటీసు, ప్రస్తుత మోడీ ప్రభుత్వానికి 2వ అవిశ్వాస తీర్మానమిది. స్పీకర్ ఆమోదం పొందడంతో త్వరలో చర్చ, ఓటింగ్ జరగనుంది. 1962లో చైనా చేతిలో భారత్ ఓడిన సందర్భంగా ఆచార్య కృపలాని, అప్పటి ప్రధాని నెహ్రూపై 1963లో అవిశ్వాస తీర్మానం మొదటి సారిగా ప్రవేశపెట్టారు. లాల్ బహదూర్ శాస్త్రిపై మూడుసార్లు, అత్యధికంగా ఇందిరాగాంధీ పై 15సార్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. కేవలం ఒకే ఒక ఓటు తేడాతో వాజ్‌పాయ్ ప్రభుత్వం పడిపోయిన సందర్భం కూడా దేశానికి తెలిసిందే.

ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో అనేక హింసాత్మక ఘటనలు జరుగుతున్నా, గత మూడు నెలలుగా మంటల్లో కాలిపోతున్నా అధికారంలో ఉన్న ప్రధాని కనీసం ఒకసారైనా ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోవడం బాధాకరం. కనీసం వాస్తవ పరిస్థితులు దేశ ప్రజలకు పార్లమెంటు వేదికగా తెలపకపోవడం శోచనీయం. ప్రతిపక్షాల ఒత్తిడి చేసినా నోరువిప్పకపోవడంతో, ఇక ఆఖరి అస్త్రంగా అవిశ్వాస తీర్మానం ద్వారా, ప్రధాని చేత మాట్లాడించాలని నిర్ణయించారు. గెలుపోటములు ఎలాగున్నా, దేశంలో జరిగే వివిధ సమకాలీన సమస్యల్ని ఉద్దేశించి పాలకులు ప్రజలకు వివరించాలి. అనుమానాలను, భయభ్రాంతులను పటాపంచలు చేయాలి. అన్యాయం జరిగినవారికి ధైర్యం, భరోసా ఇవ్వాలి. ఎంతో ప్రజాధనాన్ని వెచ్చించి నడుపుతున్న పార్లమెంటు, వివిధ రాష్ట్రాల శాసనసభల, శాసనమండలి సమావేశాలు ప్రజా సమస్యలు చర్చించేందుకు, అభివృద్ధికి వేదికలుగా ఉపయోగించుకుంటేనే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరు ఉంటుంది. అంతే తప్ప ఊకదంపుడు మాటల వల్ల, ఉత్తుత్తి ప్రసంగాల వల్ల కాదనే విషయాన్ని కేంద్ర పాలకులు గ్రహించాలి.

- ఐ.పి.రావు

నాటో సదస్సు : ప్రపంచంపై ఆధిపత్యానికి కుతంత్రాలు!

లిథుయేనియా రాజధాని విల్నియస్‌లో ఇటీవల జరిగిన నాటో సదస్సు, అమెరికా నేతృత్వంలో పశ్చిమ దేశాల సైనిక కూటమి సరి కొత్తదాడి ప్రారంభించింది. ఉక్రెయిన్ యుద్ధం ఈ సదస్సులో కీలకాంశం అయినప్పటికీ, చివరగా జారీ చేసిన డిక్లరేషన్ మాత్రం ఆ అంశాన్ని మించి, యూరప్‌కు వెలుపల ఇతర ప్రాంతాల్లో తన ప్రయోజనాల గురించి పేర్కొంది. తద్వారా ప్రపంచ ఆధిపత్యాన్ని ఎలాగైనా కొనసాగించాలనే తన ఉద్దేశ్యాన్ని అది స్పష్టం చేసింది. గతేడాది మాడ్రిడ్‌లో జరిగిన సదస్సు డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లుగా, భూ, వాయు, సముద్ర జలాల, సైబర్ స్పేస్ రంగాల్లో ఎదురయ్యే భద్రతాపరమైన ముప్పులకు సంబంధించి '360 డిగ్రీల వైఖరి' గురించి డాక్యుమెంట్ పేర్కొంటోంది. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించినంత వరకు నాటో వినిపించిన గళం, దూకుడును పెంచేలా, పోరాటానికి సుముఖంగా వున్నామనేలా ఉంది. అంతేకానీ శాంతి చర్చలకు గల అవకాశాల గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ఉక్రెయిన్ భూభాగాల నుండి రష్యా పూర్తిగా, బేషరతుగా వైదొలగాలన్నది శాంతికి ముందస్తు షరతుగా పేర్కొంది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు, యుద్ధ పరికరాల సరఫరాలను పెద్దఎత్తున పెంచేందుకు నాటో సదస్సు విడిగా ఒక ఒప్పందంలో అంగీకరించింది.

తక్షణమే నాటో సభ్యత్వం కావాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేస్తున్న డిమాండ్‌ను నాటో నేతలు అంగీకరించ లేదు. దీనికి కూడా వ్యూహాత్మక ఎత్తుగడలు వున్నాయి. ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇచ్చినట్లైతే నాటో ఒప్పందంలోని ఆర్టికల్ 5 అమల్లోకి వస్తుంది. అంటే అమెరికా, ఇతర నాటో సభ్య దేశాలు ప్రత్యక్షంగా రష్యాతో యుద్ధానికి దిగినట్లే అవుతుంది. ప్రస్తుతం నాటో కూటమిలోకి పరోక్షంగా వచ్చినట్లే నంటూ డిక్లరేషన్ ఉక్రెయిన్‌కు హామీ ఇచ్చింది. "నాటో కూటమితో రాజకీయంగా విలీనమైనట్లేనని, పరస్పరం సహకరించు కోవడం మరింత పెరుగుతోందని" డిక్లరేషన్ పేర్కొంది. ఒకపక్క నాటో దేశాలు అందించే అత్యంత అధునాతనమైన ఆయుధాల సాయంతో నిలకడగా అలా పోరు సల్పుతూనే, మరోపక్క యుద్ధం కారణంగా జరిగే విధ్వంసం, వినాశనం భారాన్ని మాత్రం ఉక్రెయిన్ భరించే పరిస్థితి నెలకొనాలని అమెరికా కోరుకుంటోంది. ఫిన్లాండ్‌ను కొత్త సభ్యురాలిగా తీసుకున్నారు. టర్కీ తన అభ్యంతరాన్ని ఉపసంహరించు కోవడంతో స్వీడన్ చేరికకు మార్గం సుగమమైంది. ఈ రెండు దేశాల చేరికతో, రష్యాతో భూ సరిహద్దులు రెట్టింపు కన్నా పెరిగాయి. తూర్పు యూరప్ అంతటా మోహరించిన బలగాలు, ఆయుధాల వివరాలను పేర్కొంటూ ఒక డాక్యుమెంట్‌ను నాటో సదస్సు ఆమోదించింది. అలాగే నాటో సత్వర ప్రతిస్పందనా బలగాల సంఖ్యను 40వేల నుండి మూడు లక్షల మంది సైనికులకు పెంచాలన్న ప్రణాళికకు కూడా ఆమోదముద్ర వేసింది. ఆ రకంగా, రష్యా చుట్టుపక్కల సరిహద్దులను నాటో బలగాలతో చుట్టుముట్టడం చాలా వేగంగా పెరిగింది. ఇలా నాటో తూర్పు దిశగా విస్తరించడమే ఉక్రెయిన్‌లో యుద్ధానికి మొదటి కారణంగా వుంది. జర్మనీ ఏకీకరణ తర్వాత నాటోను తూర్పు దిశగా విస్తరించబోమని ఇచ్చిన హామీ నుండి అమెరికా, పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళాయి. మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, ఇండో-పసిఫిక్ ప్రాంతంతో సహా ప్రపంచంలో ప్రతి భాగంలోనూ తమ వ్యూహాత్మక ప్రయోజనాల గురించి విల్నియస్ డిక్లరేషన్ మాట్లాడింది. ఆ రకంగా, గుత్తాధిపత్యం కోసం... తన ప్రపంచ ప్రణాళికకు ద్రోహం చేసింది.

డిక్లరేషన్‌లో కీలకంగా దృష్టి పెట్టిన మరో అంశం చైనా. "అంతర్జాతీయంగా తన ప్రభావాన్ని, అధికారాన్ని పెంచుకు నేందుకు, విస్తృత స్థాయిలో రాజకీయ, ఆర్థిక, సైనిక సాధనాలు ఉపయోగిస్తోందంటూ" చైనాపై ఆరోపణలు చేసింది. "హానికరమైన హైబ్రిడ్, సైబర్ కార్యకలాపాలతో నాటో భద్రతను దెబ్బతీస్తోందని, కీలకమైన సాంకేతిక రంగాలను, ముఖ్యమైన మౌలిక సదుపాయాలను, వ్యూహాత్మక పరికరాలను, సరఫరా మార్పులను నియంత్రించడానికి ప్రయత్నిస్తోందంటూ ఆరోపణలు చేసింది. ప్రపంచ దేశాలపై అమెరికా గుత్తాధిపత్యాన్ని కొనసాగిం చేందుకు రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటు చేసుకున్న యంత్రాంగాలు-నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను ఉల్లంఘిస్తోం దంటూ చైనాపై ఆరోపణలు చేసింది. విల్నియస్ సదస్సులో క్వాడ్, అకస్ దేశాల రాజకీయ నేతల భాగస్వామ్యాన్ని చూసిన చైనాను ఈ రకంగా లక్ష్యంగా చేసుకుంది. ఈ సదస్సుకు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రధానులు, దక్షిణ కొరియా అధ్యక్షుడు హాజరయ్యారు. చైనాను ఎదుర్కొనడానికి, ఏకాకిని చేయడానికి తూర్పు ప్రాంతంలో నాటోను సృష్టించాలని అమెరికా ఆశిస్తోంది. క్వాడ్ సభ్యురాలై నప్పటికీ భారత్ ఈ సదస్సులో పాల్గొనలేదు.



ప్రాథమికంగా ఉక్రెయిన్ యుద్ధాన్ని, రష్యాను విల్నియస్ సదస్సు ఎదుర్కోనాల్సి ఉన్నందున, తన తటస్థ వైఖరిని దృష్టిలో ఉంచుకుని భారత్ ఈ సదస్సుకు హాజరు కాలేక పోయింది. అయితే, పశ్చిమ దేశాల కూటమి అనుసరిస్తున్న ఇండో-పసిఫిక్ వ్యూహాన్ని నాటో సదస్సు అంచనా వేస్తోంది. ఈ ఇండో పసిఫిక్ వ్యూహంలో ఇప్పటికే భారత్ పూర్తిగా రంగంలోకి దిగింది.

పెరుగుతున్న సైనికీకరణను, అమెరికా, దాని మిత్రపక్షాల దూకుడును నాటో సదస్సు స్పష్టంగా తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సైన్యం ఉపసంహరణకు దిగిన జర్మనీ, జపాన్‌లు రెండూ తిరిగి ఆయుధాలను సమకూర్చుకునే పంథాను ఇప్పుడు అనుసరిస్తున్నాయి. సైనిక పాటవాన్ని సమకూర్చు కుంటున్నాయి.

> పెరుగుతున్న సైనికీకరణను, అమెరికా, దాని మిత్రపక్షాల దూకుడును నాటో సదస్సు స్పష్టంగా తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సైన్యం ఉపసంహరణకు దిగిన జర్మనీ, జపాన్‌లు రెండూ తిరిగి ఆయుధాలను సమకూర్చుకునే పంథాను ఇప్పుడు అనుసరిస్తున్నాయి. సైనిక పాటవాన్ని సమకూర్చు కుంటున్నాయి. ఉక్రెయిన్ సాయుధ బలగాల ప్రతి దాడిలో పెద్దగా పురోగతి లేకపోయినప్పటికీ ఉక్రెయిన్‌లో యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆశిస్తున్నారు.

ఉక్రెయిన్ సాయుధ బలగాల ప్రతి దాడిలో పెద్దగా పురోగతి లేకపోయినప్పటికీ ఉక్రెయిన్‌లో యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగా లని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆశిస్తున్నారు. యూరప్‌పై తన గుత్తాధి పత్యాన్ని మరింత సంఘటితం చేసుకోవా లన్న అమెరికా ఆకాంక్షకు, చైనాతో జరగబోయే పోరాటంలో వారందరినీ కూడగట్టేందుకు ఈ సుదీర్ఘ యుద్ధం, అనుగుణంగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే, అమెరికా దుందుడుకు ప్రణాళికలను మోడీ ప్రభుత్వం మరింతగా అంగీకరించడాన్ని చూడాల్సి ఉంటుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నవతెలంగాణ 5
కరీంనగర్ - జగిత్యాల
శుక్రవారం 28 జులై 2023



ఆగని వాన.. జనం హైరానా



ఉధృతంగా మత్తడిదూకుతున్న జమ్మికుంట నాయిని చెరువు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెగని వర్షం

- ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్న అధికారులు
- గోపాలపూర్ ఇసుక క్వారీలో 19కార్మికులను రక్షించిన సహాయక సిబ్బంది
- పొంగిపొర్లుతున్న వాగులు.. పలుచోట్ల కట్టలు తెగిన దిగువప్రాంతాలు జలమయం
- పలు ప్రాంతాలలో ఇళ్లలోకి వర్షపు నీరు
- రోడ్డుమీదుగా సాగుతున్న వరద ఉధృతితో పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- ఓసీపిల్లో 12 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- జగిత్యాల-ఆర్మూర్ మధ్య రాజీవ్‌రహదారి నిలిపివేత
- కాళేశ్వరం వద్ద 9 మీటర్లకు చేరుకున్న గోదావరి
- ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరికలు జారీ
- మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరికలు



ముస్తాబాద్‌లో సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న కస్తూరిబా విద్యార్థులు



సిరిసిల్ల పట్టణంలో లోతట్టు ప్రాంతంలో వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి ఎత్తుకుని తీసుకొస్తున్న పోలీసులు



జమ్మికుంటలో ఇండ్లలోకి వచ్చిన వరదనీరు

రెండు రోజులుగా వాన వీడటం లేదు. ఏకంగా ఆకాశానికి చిల్లుపడిన విధంగా బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. ఏకంగా కరీంనగర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో 35సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిన్నట్నుంచీ కురుస్తున్న కుండపోత వానలకు.. చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. ఓవైపు వాగులు, వంకలు పొంగి పొర్లుతుండటంతో పలు గ్రామాలు, మండల కేంద్రాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంకోవైపు వరద పోటెత్తడంతో గోదావరి ఉప్పొంగుతోంది. హుజూరాబాద్, జమ్మికుంట, పెద్దపెల్లి, రామగుండం, వేములవాడ వంటిచోట్ల భారీవానకు కాలనీలు జలమయమయ్యాయి.ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వస్తుండటంతో గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. ఓసీపీల్లో సుమారు 12వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మరోరెండు రోజులపాటు భారీ వర్షాలు తప్పవని హెచ్చరించిన వాతావరణ శాఖ రాజన్నసిరిసిల్ల జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి



సిరిసిల్ల పట్టణంలో లోతట్టు ప్రాంతంలో వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి ఎత్తుకుని తీసుకొస్తున్న పోలీసులు



నీట మునిగిన జగిత్యాలపట్టణంలోని శివారుకాలనీ

కరీంనగర్ జిల్లాలో...

- కరీంనగర్ జిల్లాలో జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్, అంబేద్కర్ కాలనీ, కష్ణ కాలనీ జలమయమై ఇండ్లన్నీ సగం వరకు నీట మునిగాయి. ఇండ్లలోకి నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆ నీటిని తొలిగించేందుకు నానా తిప్పలు పడుతూ.. మోటార్లు, పైపుల ద్వారా ఎత్తిపోస్తున్నారు. హుజూరాబాద్ ఉర్దూభవన్ కాలనీలో ఈ తీవ్రత ఎక్కువగా కనిపించింది. అటు జమ్మికుంటలోనూ కాలనీలు జలమయమయ్యాయి. కరీంనగర్ శివారులోని రేకూర్తి గురుకుల హాస్టల్, సైదాపూర్ మండలం మోడల్‌స్కూల్, రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ కస్తూరిబా పాఠశాల భవనాలు జలదిగ్బంధం కావడంతో అందులోని పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలో సబ్‌స్టేషన్ నీట మునగడంతో వి ద ్య ు త్ అంతరాయం ఏర్పడింది. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామ ఇండ్లలోని వరద నీరు చేరడంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. కరీంనగర్‌జిల్లా కేంద్రంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. శివారు కాలనీల్లో వరద నీరు వచ్చి చేరింది. దీంతో మేయర్ సునిల్‌రావు సుడిగాలి పర్యటన చేశారు. లోతట్టు ప్రాంతాలను సందర్శించి నగర వీధుల్లోకి వచ్చిన వరద ప్రవాహాన్ని తప్పించారు. పలు రోడ్లను, డివైడర్లను తొలగిస్తూ సహాయక చర్యలు చేపట్టారు. నాలుగు జిల్లాల కలెక్టర్లు ట్రోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా ప్రజలకు సహాయక చర్యలు అందిస్తున్నారు. ఆయా జిల్లా శాఖల అధికారులు అప్పగించిన ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టారు. కరీంనగర్ రూరల్ మండలం ఇలరుకుల్ల - చెర్లబూత్కూర్ గ్రామాల మధ్య ఉధృతంగా వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తపల్లి చెరువులు అలుగుదూకుతూ ఉధృతంగా వరద రోడ్డుపైకి రావడంతో కొత్తపల్లి మీదుగా వెళ్లే కరీంనగర్ - హుస్నాబాద్ రాకపోకలునిలిచిపోయాయి. గన్నేరువరం మండల కేంద్రంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుతో కరీంనగర్ వైపు రాకపోకలు బంద్ అయ్యాయి.

సిరిసిల్ల జిల్లాలో...

- సిరిసిల్ల జిల్లాలో భారీ వర్షాల కారణంగా అతలాకుతలం అవుతోంది. ఫాజల్ నగర్ కల్వర్టుపై నుండి ఉధతంగా వరద నీరు ప్రవహిస్తుండడంతో వేములవాడ, జగిత్యాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేములవాడ పట్టణంలోని మూలవాగు ఉధతంగా ప్రవహిస్తోంది. మల్లారం కల్వర్టుపై వరద నీటి కారణంగా వేములవాడ, హనుమాజీపేట మధ్య రాకపోకలను నిలిపివేశారు. వేములవాడ మండలంలో అత్యధికంగా 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. వేములవాడ పట్టణానికి శాతరాజు పల్లి, మల్లారం గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. ఇల్లంతకుంట మండలంలో బిక్కవాగు ఉధతంగా ప్రవహిస్తోంది. దీంతో జవారిపేట గాలిపల్లి, నర్సక్క పేట గ్రామాల్లోని ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. కోనరావుపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషన్ వరదనీటిలో చిక్కుకున్నాయి. రుద్రంగి మండల కేంద్రంలో వేములవాడ కోరుట్ల వెళ్లే రహదారిపై నందివాగు ఉదతంగా ప్రవహిస్తుండడంతో మండల కేంద్రానికి దారులు మూసుకుపోయాయి. గంభీరావుపేట నుండి లింగన్నపేట మార్గం వద్ద వరధ తీవ్రత పెరగడంతో మండల కేంద్రానికి దారిమూసుకుపోయింది. వీర్నపల్లి మండలంలో వాగులు పొంగిపొర్లుతుండటంతో 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శివారుకాలనీలు నీట మునిగి ఇండ్లలోని సామాగ్రి పాడైపోయింది. వారిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కోనరావుపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీ జలదిగ్బంధంలో ఉండిపోయింది.

పెద్దపల్లి జిల్లాలో..

- పెద్దపల్లి జిల్లాలోని కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల పరిధిలోకి వచ్చే మంథని నియోజకవర్గం గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అతలాకుతలం అవుతోంది. మలహర్ మండలంలో మానేరు ఉధతంగా ప్రవహిస్తుండడంతో, పివి నగర్, కుంభంపల్లి గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరుకుంది. మండలంలోని ఆరెవాగు ఉదతంగా ప్రవహిస్తోంది. మల్హర్ తహసిల్దార్ కార్యాలయం వరదనీటిలో చిక్కుకోవడంతో, అధికారులు సిబ్బంది అక్కడికి వెళ్లలేని పరిస్థితి. ఇదే మండలంలోని ఖమ్మం పల్లి వంతెన పై నుండి వరద నీరు ప్రవహిస్తోంది. మహాముత్తారం మండలంలో పెద్దవాగు ఉధతి దశ్యా కాటారం మేడారం మధ్య వాహనాలు నిలిపివేశారు. గోదావరి సమీపంలో ఉండే పలిమెల మండలంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని పోలీసు అధికారులు డప్పు చాటింపు వేయించారు. మహదేవపూర్ మండలంలో చింతపల్లి వాగు ఉధతంగా ప్రవహిస్తోంది.సింగరేణి రామగుండం రీజియన్ పరిధిలోని నాలుగు ఉపరితల గనుల్లో 1.20లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. భారీ వర్షాల కారణంగా ఉపరితల గనుల్లోకి వర్షపు నీరు రావడంతో ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. వరద నీటిలో మునిగిన ఎన్ టి పి సి పరిధిలోని ఆటోనగర్, న్యూ పోరటపల్లి ప్రాంతాల ప్రజలను అక్కడి నుండి తరలించారు. వీరందరికీ పునరావాస శిబిరాల్లో సౌకర్యాలు కల్పించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్‌రహదారి, స్వప్నకాలనీ, పూసలరోడ్డు, శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెద్దపల్లి జిల్లాలో హుస్సేన్‌మియా వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

గురువారం ఒక్క రోజునే 10సెంటీమీటర్లకుపైగా వర్షం కురిసిన ప్రాంతాల వివరాలు

జిల్లా	మండలం	ప్రాంతం	వర్షపాతం
కరీంనగర్	ఇల్లందకుంట	మల్యాల	38.5సె.మీ
కరీంనగర్	జమ్మికుంట	కొత్తపల్లి	31.2సె.మీ
కరీంనగర్	హుజూరాబాద్	బోర్నపల్లి	27.5సె.మీ
కరీంనగర్	వీణవంక	వీణవంక	23.8సె.మీ
జగిత్యాల	కోరుట్ల	ఐలాపూర్	15.5సె.మీ
జగిత్యాల	బీమారం	మన్నెగూడెం	15.4సె.మీ
జగిత్యాల	కథలాపూర్	కథలాపూర్	15.3సె.మీ
జగిత్యాల	బీమారం	గోవిందారం	14.9సె.మీ
జగిత్యాల	మేడిపల్లి	మేడిపల్లి	14.3సె.మీ
జగిత్యాల	కోరుట్ల	కోరుట్ల	13.7సె.మీ
జగిత్యాల	మల్లాపూర్	మల్లాపూర్	13.6సె.మీ
జగిత్యాల	మెట్‌పల్లి	మెట్‌పల్లి	10.8సె.మీ
సిరిసిల్ల	వేములవాడ	వేములవాడ	15.2సె.మీ
సిరిసిల్ల	బోయిన్‌పల్లి	బోయిన్‌పల్లి	13.9సె.మీ
సిరిసిల్ల	చందుర్తి	మర్రిగడ్డ	10.5సె.మీ
సిరిసిల్ల	రుద్రంగి	మానాల	09.5సె.మీ
పెద్దపల్లి	ఎలిగేడు	ఎలిగేడు	17.5సె.మీ
పెద్దపల్లి	సుల్తానాబాద్	సుల్తానాబాద్	16.5సె.మీ
పెద్దపల్లి	ధర్మారం	ధర్మారం	15.8సె.మీ
పెద్దపల్లి	ఓదెల	ఓదెల	15.2సె.మీ
పెద్దపల్లి	శ్రీరాంపూర్	శ్రీరాంపూర్	14.3సె.మీ
పెద్దపల్లి	ముత్తారం	ముత్తారం	12.9సె.మీ
పెద్దపల్లి	అంతర్గాం	అంతర్గాం	13.8సె.మీ
పెద్దపల్లి	రామగుండం	రామగుండం	13.5సె.మీ
పెద్దపల్లి	పాలకుర్తి	పాలకుర్తి	11.3సె.మీ
పెద్దపల్లి	కమాన్‌పూర్	కమాన్‌పూర్	10.6సె.మీ
పెద్దపల్లి	పెద్దపల్లి	పెద్దపల్లి	10.3

జగిత్యాల జిల్లాలో...

- జగిత్యాల జిల్లాలోభారీ వర్షాల కారణంగా మెట్‌పల్లి సమీపంలోని మేడిపల్లి గ్రామంలో ఎన్‌హెచ్63పైన చెరువు మత్తడితో రోడ్డుపై వరద ఉధృతి ఎక్కువగా మారింది.

ఆర్మూర్ నుంచి జగిత్యాల వెళ్లే వాహనాలకు అనుమతి నిలిపివేశారు. వెల్గటూర్ మండల పరిధిలోని వెల్గటూర్ - రాజక్కపల్లి గ్రామాల మధ్య ఉన్న పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం అటువైపుగా వెళ్తున్న మెగా కంపెనీకి చెందిన ట్యాంకర్ వాగులో చిక్కుకుంది. వరద ప్రవాహం కొంత తగ్గుముఖంపట్టాక బయటకు తీశారు. జగిత్యాల జిల్లాలో 1069 చెరువులకుగాను 864 చెరువులు మత్తడి దూకుతున్నాయి. రెండు చెరువుల కట్టలు దెబ్బతిన్నాయి. ఈ జిల్లాలో ఒక ఇల్లు పూర్తిగా కూలిపోగా 94 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 7 పునరావాస కేంద్రాల్లో 1065మందికి ఆశ్రయం కల్పించారు.

19 మంది కార్మికులు సురక్షితం

భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రవాహం వలన బయటకు రాలేక మంథని మండలం గోపాల్‌పూర్ మానేరువాగులో చిక్కుకున్న 19 మంది కార్మికులను సురక్షితంగా బయటపడ్డారు. వాగుకు దగ్గర ఉన్న ఇసుక క్వారీలో పని చేస్తున్న వారు వరద ఉధృతి ఎక్కువ కావడంతో బయటికి రాలేకపోవడంతో అక్కడి చేరుకున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రక్షణ, సహాయక చర్యలు చేపట్టారు. మంథని మండలం బోయిన్ పేటకు చెందిన మత్స్యకారులు (గజ ఈతగాల్లు), గోదావరిఖనికి చెందిన మత్స్యకారులు (గజ ఈతగాల్లు) రెండు పడవలలో ఫైర్ సిబ్బందితో కలిసి ఏడు గంటలపాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి ఇసుక క్వారీలలో పనిచేసే మొత్తం 19 మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో డిసిపి వైభవ్ గైక్వాడ్, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వి.హనుమ, జడ్పీ సీఈవో శ్రీనివాస్ సహా జిల్లా యంత్రాంగం పాల్గొంది.

ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని... ఇసుక క్వారీ వరద ప్రవాహంలో గల్లంతైన మధు అనే యుకుడు ఈత కొట్టుకుంటూ చిన్న ఓదెల సమీపంలో ఒడ్డుకు చేరాడు. వరద ఉధృతిలో కొట్టుకుపోయిన మధు చాకచాక్యంగా వరద నీటిని తప్పించుకుంటూ కొద్ది దూరం వరకు ఈత కొట్టి సమీపంలోని చిన్నఓదెల వద్ద సేఫ్ అయ్యాడు. అయితే మానేరు పరివాహక ప్రాంతానికి చేరుకుని పర్యవేక్షిస్తుండగానే గల్లంతైన మధు అక్కడ ప్రత్యక్షం కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గోడ కూలి ఒకరు.. జలపాతం మునిగి మరొకరు

కోరుట్ల పట్టణంలోని జవహర్‌నగర్‌లో ఇంటి గోడ కూలి విజేత (50) అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. మరోవైపు పెద్దపల్లి జిల్లా కేంద్ర సమీపంలోని సబ్బితం జలపాతం వద్ద నీట మునిగి ఓ యువకుడు మరణించాడు.

పల్లెల్లో పరిశభ్రతకు చర్యలు : జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య

నవతెలంగాణ - కరీంనగర్ : మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వెంటనే పల్లెల్లో పరిశుభ్రత కోసం జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య గురువారం ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్యలోపం, కలుషిత నీటి వల్ల అతిసార, కలరా, టైఫాయిడ్, ఈగలు, దోమల వల్ల మలేరియా, మెదడువ్యాపు, డెంగ్యు, చికెన్‌గున్యా మొదలైన వ్యాధులుప్రబలే అవకాశంఉందని తెలిపారు. ఈ వ్యాధుల ప్రబలకుండా నిరోధించడమే నివారణ కన్నా మిన్నాఅని పేర్కొన్నారు. గ్రామాల్లో కోళ్ల ఫారముల యజమానులతో సంప్రదించి పారిశుధ్య విషయమై అప్రమత్తం చేయాలని తెలిపారు. పీడబ్ల్యుఎస్, మంచినీటి వనరులను, ట్యాంకులను ప్రతివారమూ క్లోరినేషన్ చేయాలని సూచించారు. ప్రతిరోజూ సాయంత్రం ఫాగింగ్ నిర్వహించాలని తెలిపారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారం, నీటి నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు...

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ప్రాజెక్టుసామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుతనీటినిల్వ (టీఎంసీల్లో)
లక్ష్మీబారాజ్	5,00,000	5,00,000	---	---
అన్నారం బారాజ్	1,30,000	1,30,000	---	---
శ్రీపాద ఎల్లంపల్లి	7,32,582	6,69,258	20.175	16.7
ఎగువమానేరు	11,985	11,985	2.20	2.20
మధ్యమానేరు	26,700	2700	27.6	18.6
దిగువమానేరు	1,79,070	56,279	24.034	18.552

గోదావరి పరివాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ - జగిత్యాల టౌన్ :ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్ట్ ఎగువ పరివాహక ప్రాంతాలైన మహారాష్ట్ర లో, ఉత్తర తెలంగాణాలో అతిభారీ వర్ష సూచన కారణంగా ఏక్షణం లోనైనా ప్రాజెక్ట్ ల వరద గేట్లు ఎత్తి గోదావరి నది లోకి నీళ్ల వదిలే అవకాశం ఉన్నది. కావున గోదావరి నది పరివాహక ప్రాంత మండలాలైన ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, బీర్పూర్, ధర్మపురి, వెల్గటూర్ నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ భాస్కర్ సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 నెంబర్ కి కాల్ చేసి సహాయం పొందవలసిందిగా ఎస్పీ భాస్కర్ సూచించారు. పలు ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. జిల్లా లో ఎడతెరపీ లేకుండా వర్షాలు కురుస్తున్నందున జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా, పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ భాస్కర్ తెలిపారు. జిల్లా లో వివిధ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న 61 కల్వర్టు, బ్రిడ్జి లు పూర్తి స్థాయిలో మునిగిపోయి రాకపోకలు స్తంభించాయని తెలిపారు.

ఇల్లు కూలిపోయిన వారికి ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల 12వ వార్డులో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నక్క శశిధర్, ఒరగంటి శ్రీనివాస్ ఇల్లు కూలిపోగా వారిని పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, గృహ లక్ష్మి పథకం అమలుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ భరోసా ఇచ్చినారు.

జగిత్యాల పట్టణం జలమయం

నవతెలంగాణ - జగిత్యాల : జగిత్యాల పట్టణంలోని టవర్ సర్కిల్, పోచమ్మ వాడ, మహాలక్ష్మి నగర్, గంజ్ రోడ్, తులసినగర్, బైపాస్ రోడ్డు, గోవిందు పల్లె, ధరూర్ క్యాంపు కొంత భాగం జలమయం కా గా ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గోవిందుపల్లె వాగు ఉధతం గా పారటంతో పట్టణంలోని వెంకటాద్రి నగర్‌తో సంబంధాలు తెగి పోయాయి. పట్టణానికి రాలేక ఇబ్బంది పడుతున్నారు. అలాగే పట్ట ణంలోని కృష్ణానగర్, మార్కండేయనగర్‌లో రోడ్డువాగును తలపిస్తు న్నది. పట్టణంలో గాంధీనగర్ 12వ వార్డులో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒరగంటి శ్రీనివాస్ ఇల్లు కూలి పోయింది.

పలు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బైపాస్ రోడ్డు, మోతె రోడ్డు లో నీట మునిగిన ఇండ్లను, వరద నీటిని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరిశీలించినారు.

అధికారులతో కలిసి పలు వార్డులలో ఎమ్మెల్యే సందర్శన :

జగిత్యాల పట్టణంలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా లోతట్టు ప్రాంతాలను, పలు వార్డు లను స్థానిక నాయకులు, అధికారులతో సందర్శించి ప్రజలతో మాట్లాడి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ఆదేశించినారు.







మేడిపల్లిలో..







కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అధికంగా వర్షాలు కురుస్తున్నందున జగిత్యాల జిల్లాలో అన్ని రకాలుగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు ఉధతంగా కురవడంతో వరద నీరు చెరువులు కుంటలు నిండిపొంగిపొర్లుతున్నాయని, దీంతో రోడ్ల వెంట రహదారులోని వంతెనలు మునిగిపోయాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఈ కంట్రోల్ రూం. వర్షాల వలన ఏమైనా సమాచారం, తక్షణ సహాయం కోసం ఫోన్ నెంబర్ 08724 222557 ను సంప్రదించి విషయాలు తెలియజేయలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

జిల్లాలో కురుస్తున్న వర్షాల వలన ప్రాణ నష్టం వాటిల్లకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం రోజున తన క్యాంపు కార్యాలయం నుండి జిల్లా, మండల అధికారులు, పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ జిల్లాను రెడ్ అలర్ట్ గా ప్రకటించిందని, రానున్న 24 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళికలతో సమన్వయంతో ఉండి, లోతట్టు, నీటి పరివాహక ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లాలో 6 మండలాల్లోని 30 గ్రామాలు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నందున, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడం ద్వారా నీటి ప్రవాహం వలన సమస్యలు రావడం జరుగుతాయని, ఆ గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రతీ మండలంలో సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, వసతులు కల్పించాలని ఆదేశించారు. ఇప్పటికే 90 గృహాల్లోని 296 మందిని సహాయ పునరావాస కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు.

నవతెలంగాణ - మల్లాపూర్ : భారీ వర్షానాకి మండల కేంద్రంలో దేవుని కుంట తెగి, పెద్ద చెరువుకు భారీ వరద రావడంతో తెగిపోయింది. గొర్రెపల్లి గ్రామంలో కొత్త కుంట చెరువు కట్ట తెగి రహదారిపై వరద చేరింది. కొత్త దామరాజు పల్లి గ్రామంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో, స్థానిక అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఓబులాపూర్ గ్రామంలో కల్వర్టు తెగిపోవడంతో అటువైపుగా రాకపోకలు నిలిచిపోయాయి. సిరిపూర్‌లో ఎస్సారెస్పీ డి29 కెనాల్‌కు గండిపడడంతో పొలాలకు వర్షం నీరు చేరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సహాయక చర్యల్లో తాసిల్దార్ రవీందర్, ఎస్సై నవీన్ కుమార్, ఇన్చార్జి ఎంపీడీవో,ఎంపీ ఓ జగదీష్ పాల్గొన్నారు.

కథలాపూర్‌లో స్తంభించిన రవాణా

నవతెలంగాణ - కథలాపూర్ : మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు నిండి మత్తళ్లు పొంగిపొర్లుతున్నాయి. దుంపెట గ్రామ చెరువు తెగి ప్రవాహానికి వేములవాడ, కోరుట్ల రహదారిపై వాహనాలు ఆగిపోయాయి. గ్రామంలో రెండు ఇళ్లు కూలి నష్టం జరిగింది. చెరువు కింద ఉన్న రెండు వందల ఎకరాల పంట నష్టం జరిగింది. భూషణ్‌రావుపేట, నక్కల ఒర్రె, మోటకుంటలు తెగి దాదాపు వంద ఎకరాల పంట నష్టం వాటిల్లింది. గంభీర్ పూర్ కొత్త చెరువు, సూరమ్మ చెరువు, బొమ్మెన చెరువులు అలుగు దూకుతున్నాయి. సిరికొండ గ్రామ చెరువు నిండి ప్రవాహం రహదారిపైకి రావడంతో వాహనాలు నిలిచిపోయాయి. మండలంలో పరిస్థితులను డిఈ ప్రశాంత్, ఏఈ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

వరదతో తెగిన రాకపోకలు

నవతెలంగాణ - మేడిపల్లి : మేడిపల్లి మండల కేంద్రంలోని మేడిపల్లి నుండి కొండాపూర్ వెళ్లే మారం, భీమారం నుంచి మన్నెగూడం వెళ్లే మార్గం, కమ్మరిపేట నుండి వెంకటరావుపేట వెళ్లే రహదారిపై వరద కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. రాజలింగంపేటలోని నిండు గర్భిణీ చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లలేక ఇబ్బంది పడింది. జేసీబీ సహాయంతో సర్పంచ్, గ్రామస్తుల, అధికారుల, సహకారంతో ఆ రోడ్డును ఏర్పాటు చేసి గర్భిణీని కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. రాగోజిపేట నుండి జగిత్యాలకు వెళ్లే రోడ్డు, భీమారం మండలంలో రోడ్డు మార్గం వర్షం కారణంగా రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి.

'సోయం బాపూరావు ఖబడ్దార్'

నవతెలంగాణ - కొనరావుపేట : గిరిజనులను కించపరిచే విధంగా ఎస్టీ జాబితాల నుండి తొలగించమనడం బీజేపీ ఎంపీ సోయం బాపూరావుకు సోయి లేదా అని లంబాడి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు నరేష్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని వట్టిమల్ల గ్రామంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎంపీ సోయం బాపురావు గిరిజనులను ఎస్‌టి జాబితా నుండి తీసివేయాలని లెటర్ రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేవలం ఎన్నికల కోసం ఆదివాసీ, గిరిజనుల మధ్య చిచ్చు పెట్టడం సరికాదన్నారు. ఐక్య వేదిక నాయకులు పాప రావు, రాజు నాయక్, కేత్యా నాయక్, లోక్య తదితరులు పాల్గొన్నారు.

అంతా జలమయం.. భయానకం



జమ్మికుంట : పునరావాస కేంద్రంలో ప్రజలు



జమ్మికుంట : అన్నదానం చేస్తున్న నాయకులు



తిమ్మాపూర్ : ఎల్ఎండీ గేట్లనుంచి పరవళ్లు తొక్కుతున్న మానేరు జలాలు

నవతెలంగాణ - జమ్మికుంట

రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, హనుమండ్లపల్లి లోతట్టు ప్రాంతం, ధర్మారం, కొత్తపెల్లి గ్రామాల్లో వందల ఇండ్లు నీటిమునిగాయి. కొత్తపెల్లి, ధర్మారం గ్రామాలలో 362 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ రెండు గ్రామాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. నాయిని చెరువు ముత్తడి పడడంతో కరీంనగర్, జమ్మికుంట రహదారిలో రవాణా బంద్‌చేశారు. నగరం గ్రామ చెరువును జెసిబిలతో సర్పంచ్ ఆధ్వర్యంలో గండి తీయించారు. జమ్మికుంట, కోరేపల్లి రహదారిపై వర్షపు నీరు అధికంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని పలు గ్రామాలలో ఇండ్లు కూలిపోయాయి. ఇండ్లలోకి నీళ్లు చేరిన ప్రజలను మున్సిపల్ అధికారులు పునరావస కేంద్రాలకు తరలించారు. రక్షణ చర్యలను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు పరిశీలించారు. ప్రజలకు ఆహారపదార్థాలను అందజేశారు. వైస్ చైర్మన్ దేశీనీ స్వప్నకోటి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నవతెలంగాణ - వీణవంక

ఐదు రోజులోగా కురుస్తున్న వానలకు చెరువులన్నీ నిండాయి. మండలంలోని నర్సింగాపూర్, లస్మక్కపల్లి, కనపర్తి, వీణవంక, మామిడాలపల్లి, కోర్కల్, నర్సింహులపల్లి, కొండపాక, వల్భాపూర్, బేతిగల్, చల్లూరు, పోతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. చల్లూరులో రెండు, వీణవంకలో ఒకటి, మామిడాలపల్లిలో ఒకటి, కనపర్తిలో ఒకటి, బ్రాహ్మణపల్లిలో ఒకటి మొతం ఆరు ఇండ్లు వర్షానికి నాని కూలిపోయాయి. భారీ వర్షానికి నీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో కరీంనగర్-జమ్మికుంట రహదారిపై పలుచోట్ల అంతరాయం ఏర్పడింది. మామిడాలపల్లి-పచ్చునూరు, కోర్కల్-శ్రీరాములపేట, వీణవంక-నర్సింగాపూర్ గ్రామాల మధ్య రోడ్లు తెగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మండలంలోని కనపర్తి-బేతిగల్, కనపర్తి-వీణవంక, గ్రామాల మధ్య రోడ్లు తెగడం కనపర్తి-జగ్గయ్యపల్లి గ్రామాల మధ్య భారీ చెట్లు గాలులకు నేలకొరగడంతో పూర్తిగా కనపర్తి గ్రామం దిగ్బంధనంలోకి వెళ్లింది. దీంతో ఆ గ్రామ ప్రజలు ఎటూ వెళ్లలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. బొంతుపల్లి-గద్దపాక, ఎల్బాక-గంగారం, ఘన్ముక్ల-రెడ్డిపల్లి గ్రామాల మధ్య వరద నీరు రోడ్లపైకి రావడంతో కొంత సేపు రాకపోకలు నిలిచిపోయాయి. మండలం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో 80శాతంపైగా వరి, పత్తి పంటలు నీట మునిగాయి. నర్సింగాపూర్, కనపర్తి తదితర గ్రామాల్లో సర్పంచులు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తహసీల్దార్ దండిగ రాజయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మండలంలని అన్ని గ్రామాల్లోని పరిస్థితులను సమీక్షించారు. అవసరమున్న చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

నవతెలంగాణ రామడుగు

భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామడుగు ఎస్ఐ తోట తిరుపతి సూచించారు. ఎవరైనా ఆపదలోఉంటే పోలీసులకు, 100 డయల్ చేయాలన్నారు. రామడుగు బ్రిడ్జి పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని వరద ప్రవాహం తగ్గేంతవరకు అటువైపు వెళ్లొద్దన్నారు. వారం నుండి కురుస్తున్న భారీ వర్షాలకు రామడుగు బ్రిడ్జిపై నుండి గురువారం ఉధృతంగా వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మోతే రోడ్యాం, మోతె వాగుపై నిర్మించిన బ్రిడ్జపై నుండి వరుద ప్రవాహం ఎక్కువై రాకపోకలు నిలిచిపోయాయి. దేశరాజుపల్లి గ్రామ ఊర చెరువు కట్టకు గండిపడటంతో గ్రామస్తులు సమాచారం మేరకు ఎస్ఐ తోట తిరుపతి వెంటనే స్పందించి ఇరిగేషన్ అధికారి, సర్పంచు, ఎంపీటీసీ గ్రామస్తులతో కలిసి మరమ్మత్తులు చేపించారు. వెలిచాల గ్రామ పరిధిలోని ప్రశాంత్ భవనం వరకు మొత్తం వరుదనీరు చేరడంతో కాంపౌండ్ వాల్ కూలింది. దీంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. మండలంలోని దేశరాజుపల్లి, వెదిర, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఎనిమిది ఇండ్లు కూలిపోయినట్లు ఆర్ఐ బాలకిషన్ తెలిపారు.

నవతెలంగాణ - గంగాధర



గంగాధర : కాసారం రోడ్డుపై వరద

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గంగాధర మండలంలోని ఆయా గ్రామాల చెరువులు మత్తడి దూకుతుండగా, వరద ప్రవాహంతో కల్వర్టులు, రోడ్లపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా, రవాణా సౌకర్యాలు స్తంభించాయి. మండలంలోని నారాయణపూర్ చెరువు నిండి దిగువన ఉన్న లక్ష్మీదేవిపల్లి గ్రామ ప్రధాన రహదారిపై నిర్మించిన బ్రిడ్జిపై నుండి వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో గంగాధర, లక్ష్మీదేవిపల్లి, బూర్గుపల్లితోపాటు అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాసారం, గర్శకుర్తి, ఉప్పరమల్యాల, గట్టుభూత్కూర్ గ్రామాల చెరువులు నిండి మత్తడి దూకుతుండడంతో రోడ్లపై నిర్మించిన కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో ఆయా గ్రామాలకు రోడ్డు మార్గాలు జలదిగ్బంధమై రాకపోకలు నిలిచి పోయాయి. గోపాల్‌రావుపల్లి, వెంకంపల్లి, హిమ్మత్‌నగర్-గట్టుభూత్కూర్ గ్రామాల్లోని కల్వర్టుపై వరద నీటి ప్రవహం పెరిగి రాకపోకలు నిలిచాయి. మండలంలోని పలు గ్రామాల్లోని ఇండ్లు కూలిపోయాయి. వరద ప్రవాహంతో పొలాల్లో ఇసుక మేటలు వేయగా, చేన్లలో మొలకెత్తిన పలు రకాల పంటలు నీట మునిగాయి.

వరద ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే సుంకె

వరద ఉధృతిని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పలు గ్రామాలు తిరిగి పరిశీలించారు. రాకపోకలు నిలిచిపోగా, రవాణా సౌకర్యాలు స్తంభించిన విషయంపై ఆరా తీశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నవతెలంగాణ - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని బావుపేట గ్రామం పెద్దమోరీ వద్ద వేములవాడ రహదారిపై గురువారం వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ పరిశీలించారు. రహదారిపై ప్రయాణికులు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరారు. ఈ రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు ఇండ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని సూచించారు.

నవతెలంగాణ - శంకరపట్నం

శంకరపట్నం మండలంలోని మొలంగూర్, రాజపూర్ గ్రామాల్లో ఇటీవల భారీ వర్షాలకు ఇండ్లు కూలాయి. గురువారం తహసీల్దార్ గూడూరి శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ కె.కేశవరెడ్డి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు టార్పలిన్‌లను అందజేశారు. ఎంపీడీఓ బషీరుద్దీన్, ఎంపీటీసీ మొయినుద్దీన్, బోడ సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. మండలంలో ఆర్కండ్ల, గద్దపాక వాగు పొంగడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. కన్నాపూర్, తాడికల్, చింతగుట్ట, రాజాపూర్, అంబాల్‌పూర్, మెట్‌పల్లి, లింగాపూర్ గ్రామాల్లో పలు ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. మండలంలో వరద పరిస్థితిని హుజురాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ లక్ష్మారెడ్డి పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజుల నుండిఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి నుండి వచ్చే వరద కాలువ గండి పడి మన్నెంపల్లి గ్రామంలోవర్షపు నీరు ఇండ్లలోకి వచ్చి చేరింది. గ్రామస్తులు బయటికి రాకుండా బిక్కు బిక్కుమంటు భయందోళకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పునరావాస కేంద్రాలకు తరలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఎల్ఎండి కాలనీలో ఇల్లు గోడలు కులాయి. ఇంట్లో ఉన్న వారిని సురక్షిత స్థలానికి గ్రామస్తులు పంపారు. కొత్తపల్లి-హుస్నాబాద్ రహదారిపై గల కల్వర్టుపై నీరు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తపల్లి చెరువు పూర్తిగా నుండి మత్తడి దుంకుతుంది.



సైదాపూర్ : వసతిగృహం నుంచి విద్యార్థులను తీసుకువస్తున్న సిబ్బంది



వీణవంక : నర్సింగాపూర్ వద్ద రోడ్డుపై నుండి వెళ్తున్న వరద



వీణవంక : నర్సింగాపూర్లో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న గంగాడి తిరుపతిరెడ్డి



రామడుగు : పూర్తిగా మునిగిన రామడుగు బ్రిడ్జి



గంగాధర : లింగంపల్లిలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

భారీ వర్షాలతో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా పటిష్ట చర్యలు

రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

లోయర్ మానేరు డ్యాం 16 గేట్లు ఎత్తి 56వేల క్యూసెక్‌ల నీరు విడుదల



గేట్లు ఎత్తేందుకు స్విచ్ ఆన్‌చేస్తున్న మంత్రి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : భారీ వర్షాలతో జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా పటిష్టచర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ఈఎన్సి, సీపీలతో కలసి కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం 16 గేట్లను మంత్రి కమలాకర్ తెరిచారు. మొదట మూడు గేట్లు ఎత్తగా క్రమక్రమంగా రాత్రి వరకు మొత్తం 16 గేట్లు ఎత్తి 56వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కెనాల్‌ల ఓవర్ ఫ్లో కారణంగా రోడ్లపై నుండి వరద ప్రవహించడంతో అక్కడక్కడ కొంతమేర రోడ్లు డ్యామేజ్ అయినాయని, భారీ వర్షాలతో జిల్లా కేంద్రంలో అక్కడక్కడా నీరు నిలిచినా అరగంటలోనే నీరు మొత్తం ఖాళీ అయిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగిన వెనువెంటనే చర్యలు తీసుకోవడానికి అధికార యంత్రంగం సిద్దంగా ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నందున అత్యవసర పనులుంటే తప్ప బయటకు రాకూడదని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఎగువ నుండి ఎల్ఎండికి 17 టియంసీల నీరు వచ్చిచేరిందని అన్నారు. మోయతుమ్మెద వాగు ప్రస్తుతం 50వేల క్యూసెక్ నీటితో ప్రవహిస్తుందని, మిడ్ మానేరు నుండి 1లక్షా 5వేల క్యూసెక్‌లతో మొత్తం ఎల్ఎండిలో లక్షా 55వేల ఇన్ ఫ్లో నీరు వచ్చిచేరిందన్నారు. దీంతో నీరు విడుదల చేసినట్టు చెప్పారు. ఎగువ నుండి వచ్చే నీటి ఆదారంగా ఔట్ ఫ్లో పెంచడం, తగ్గించడం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.గోపి, సీపీ సుబ్బారాయుడు, మేయర్ సునీల్‌రావు, ఈఎన్సి శంకర్, ట్రైని కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్, ఈఈ నాగభూషణం, ఏఈ వంశీ, అధికారులు పాల్గొన్నారు.

జలమయమైన ఆదర్శ పాఠశాల

నవతెలంగాణ - సైదాపూర్ : బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి సైదాపూర్, వెన్కెపల్లి, దుద్దెనపల్లి, ఆకునూర్, పెర్కపల్లి గ్రామాల నుంచి భారీగా వరద వచ్చింది. సోమారంలోని ఆదర్శ పాఠశాల జలమయమైంది. ఆదర్శ పాఠశాల వసతి గృహంలో సుమారు 60 మంది విద్యార్థినులు చిక్కుకుపోయారు. వారిని సైదాపూర్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం తన సిబ్బందితో పాటు స్థానికుల సహాయంతో గురువారం సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మండలంలో 201.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి బొమ్మకల్ గ్రామంలో ఇల్లు కూలింది. చెరువులు కుంటలు మత్తడి దూకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. సైదాపూర్, మొలంగూర్, సోమారం, ఎక్లాస్పూర్, ఎలా బోతారం, గొడిశాల తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

నవతెలంగాణ - గన్నేరువరం

గన్నేరువరం మండలంలో బుధవారం రాత్రి 26 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. పెద్ద చెరువు మత్తడికి వరద ఉధృతితో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గన్నేరువరం నుంచి జంగపల్లి, గుండ్లపల్లి మీదుగా కరీంనగర్, మండల కేంద్రం నుంచి పారువెల్ల మీదుగా ఇల్లంతకుంటకు రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా యువజన నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎంపి బండి సంజయ్ కుమార్ ఎన్నికల సమయంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా బ్రిడ్జి, డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

పోలీసు వాహనంలో గర్భిణి తరలింపు



గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన వేముల సుప్రియ అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో వారు 108 అంబులెన్స్ కు ఫోన్ చేయగా అంబులెన్స్ చొక్కారావుపల్లె మీదుగా గన్నేరువరం చెరువు మత్తడి వద్దకు వచ్చి ఆగింది. అలుగుపై వరద ఉధృతికి దాటే పరిస్థితి లేక వెనిదిరిగింది. బాధితులు పోలీసులకు సహాయం కోరారు. ఎస్సై చందా నరసింహారావు తక్షణమే స్పందించి పోలీస్ వాహనంలో ఆమెను ఎక్కించుకొని సిద్దిపేట జిల్లా తోటపల్లి మీదుగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. తక్షణం స్పందించిన పోలీస్ సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండలంలో చెరువులు, కుంటలు నిండి మత్తడి దుంకుతున్నాయి. మండల కేంద్రంలోని కుడి చెరువు మత్తడి దుంకుతూ రైతుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడ్డాయి. కుమ్మరి, రెడ్డి వాడల్లో ఇండ్లలోకి నీరు చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ జెసిబి సహాయంతో రోడ్డుపై ఉన్న నీటిని బయటకు పంపించేశారు. పలు గ్రామాల్లో ఇండ్లు కులాయి. భూపాలపట్నం శివారులో చెరువు కింద గండి పడింది. మంగళపల్లి గ్రామంలో 200 సంవత్సరాల నాటి పురాతన మర్రిచెట్టు కూకటి వేళ్లతో రోడ్డుపై పడింది.

నవతెలంగాణ - హుజూరాబాద్



హుజూరాబాద్ : పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్య

హుజురాబాద్ చరిత్రలోనే ఎన్నడూ పడని విధంగా బుధవారం రాత్రి 28 సెంటీమీటర్ల వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుండి గురువారం 10 గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. పట్టణంలోని లోతట్టు మామిండ్ల వాడ, ఇందిరానగర్ గాంధీనగర్, గొల్లవాడ తదితర ప్రాంతాలలో వర్షపు నీరు ఇండ్లలోకి వచ్చి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. జమ్మికుంట రోడ్‌లోని మున్నూరుకాపు వీధిలో రోడ్డుపై నుండే వరద నీరు భారీగా ప్రవహించింది. బస్టాండ్ సమీపంలోని ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయ ఆవరణమంతా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం, ఉర్దూ పాఠశాల ప్రాంతం వర్షపు నీరు నిండిపోయింది. చిలుకవాగులోకి వరద భారీగా రావడంతో హుజురాబాద్ - కనుకులగిద్దకు మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. గుండ్ల చెరువుకు గండిపడే అవకాశం ఉన్నందున వరద కాలువకు అధికారులు గండి పెట్టి నీటిని మళ్లించారు.

పట్టణంలో కరీంనగర్ రోడ్డు పెట్రోల్ బంక్ ఎదురుగా కొత్తపల్లి రోడ్డుకు వెళ్లే దారిలో నెయ్యి తయారీ కేంద్రంలోకి వర్షం నీరు భారీగా చేయడంతో రెండు మోటర్లు నీతో మునగడంతో పాటు బట్టి కూలిపోయింది. భద్రపరిచిన నెయ్యి ప్యాకెట్లు విప్పుకుపోయి నీళ్లలో కరిగిపోయాయని, సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందనియజమాని నాగేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలశ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ కల్లేపల్లి రమాదేవి, కాంగ్రెస్ నాయకులు సొల్లు బాబు ఏముల పుష్పలత నర్సింగ్ రెవెన్యూ సిబ్బంది సందర్శించి పరిశీలించారు.

వరద బాధితులకు ఉపసర్పంచ్ అనిల్‌గౌడ్ సాయం

ఇంటింటికీ భోజనం పంపిణీ



ఇంటింటికి భోజనం అందజేస్తున్న ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్

నవతెలంగాణ - తిమ్మాపూర్ : జోరు వానలతో ఊరూ ఏరు ఏకమవుతున్నాయి. జన జీవనం అస్తవ్యస్తమవుతోంది. ఇండ్లను వరద ముంచెత్తుతోంది. దీంతో వరద బాధితులను ఆదుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరో వస్తారు.. సాయం చేస్తారని చూడకుండా బాధితులకు నేనున్నానని అండగా నిలిచారు మండలంలోని మన్నెంపల్లి ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్. బుధ, గురువారం కురిసిన భారీ వర్షానికి గ్రామంలోని లోతట్టు ప్రాంతాల ఇండ్లలోకి నీరు చేరింది. మోకాలు లోతు నీళ్లలో ఇబ్బంది పడుతున్న గ్రామస్తుల ఇండ్లకు వెళ్లి పరామర్శించారు. నీరు పోయేలా చర్యలు చేపట్టారు. స్థానిక యువకులతో కలిసి వరదలో ఇబ్బంది పడుతున్న వారికి ధైర్యం చెప్పారు. పొయ్యి కూడా వెలిగించే పరిస్థితి లేకపోవడంతో బాధితుల కోసం ప్రత్యేకంగా భోజనం తయారు చేయించారు. ఇంటింటికీ వెళ్లి ఆహార పొట్లాలు అందించారు. భయపడొద్దని, తనవంతు సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం జగదీష్, గుంటి వెంకటేష్, కామేరా సంపత్, కొలిపాక కిరణ్, బూడిద కిషోర్, పారునంది స్వామి, పారునంది సంపత్, పారునంది పోచమల్లు, సుధగోని వేణు, బోయిని శ్రీకాంత్, సుదగోని సదయ్య అశోద అనిల్, సతీష్, పారునంది ప్రశాంత్, చిట్టెల వినీత్ పాల్గొన్నారు.



కొత్తపల్లి : ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్



శంకరపట్నం : పరిశీలిస్తున్న పోలీసు అధికారులు



చొప్పదండి : మత్తడి దుంకుతున్న చొప్పదండి కుడి చెరువు



తిమ్మాపూర్ : కొత్తపల్లి హుస్నాబాద్ రహదారిపై వరద

నారాయణపూర్ జలాశయానికి పొంచి ఉన్న ప్రమాదం

- కట్ట తెంపేందుకు అధికారుల ప్రయత్నం
- అడ్డుకున్న ఇస్తారుపల్లి గ్రామస్తులు
- ఇస్లాంపూర్ వైపు కట్ట తెంపి వరద మళ్లింపు



అధికారులను అడ్డుకున్న ఇస్తారిపల్లి గ్రామస్తులు

నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం (చెరువు)లోకి భారీగా వరద చేరుతుండడంతో ప్రమాద స్థాయికి చేరింది. చెరువు కట్టపై నుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో జలాశయం కట్ట తెగే ప్రమాదం ఏర్పడింది. దీంతో తమ గ్రామం ముంపునకు గురైయ్యే ప్రమాదం ఏర్పడిందని నారాయణపూర్ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తుండడంతో జలాశయం వద్దకు అధికారులు చేరుకుని సమీక్షించారు. వరద ఉధృతి గంటగంటకు పెరుగుతుండడంతో నారాయణపూర్ జలాశయం కట్టని తెంపేందుకు అధికారులు సమాయత్తమై జలాశయానికి వెళ్తుండగా, తమ గ్రామం ముంపునకు గురౌవుతుందని ఇస్తారిపల్లి గ్రామస్తులు అధికారులను అడ్డుకున్నారు. తమ గ్రామాన్ని ముంపు కింద గుర్తించి నారాయణపూర్ చెరువు కట్టను గండి పెట్టాలని అధికారులతో ఇస్తారుపల్లి గ్రామస్తులు వాగ్వివాదానికి దిగారు. కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్, గంగాధర తహసీల్దార్ సదానందం, ఎస్ఐ అభిలాష్‌తో పాటు అధికారులు నారాయణపూర్ జలాశయానికి వెళ్తుండగా ఇస్తారుపల్లి సమీపంలో ఆ గ్రామస్తులు అడ్డుకొని ఆందోళనకు దిగారు. కట్ట తెంపితే తమ గ్రామం ముంపునకు గురవుతుందని కట్ట తెంపేందుకు వీలులేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు నారాయణపూర్ రిజర్వాయర్ నీటిని నిల్వ చేసేందుకు వీలుగా గంగాధర చెరువును ఆనుకుని ఇస్లాంపూర్ వైపు పోసిన కట్టకు గండి పెట్టి వరద నీటిని వదులుతున్నారు. దీంతో ప్రమాద స్థాయికి చేరిన నారాయణపూర్ జలాశయంలో చేరిన నీరు గంగాధర చెరువు నుండి బయటకు వెళ్తుంది. వరద ఉధృతి ఇదేవిధంగా కొనసాగితే నారాయణపూర్ కట్టకు గండి పెట్టడం తప్పదని అధికారులు యోచిస్తున్నారు. గత వర్షాకాలంలో నారాయణపూర్, గంగాధర చెరువు కట్టలను తెంపడంతో చెరువులో ఉన్న నీరు వృథాగా వెళ్లిపోయింది. దీంతో చెరువులో నీకు లేక ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో నారాయణపూర్ జలాశయం కట్ట మరమ్మతులు చేపట్టి ఎల్లంపల్లి నీటితో సంపుల ద్వారా నీటిని నింపారు. గత వర్షాకాలం కట్టలు తెగి ఇబ్బంది పడిన రైతులు కట్టకు గండి పెడితే అదే పరిస్థితి ఎదుర్కొనే పరిస్థితులు ఈ ఏడాది కూడా ఏర్పడతాయని వాపోతున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కరీంనగర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి



హుజురాబాద్ : పెద్దవాగు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

నవతెలంగాణ - హుజురాబాద్ : భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. గురువారం హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని పెద్దచెరువును పోలీసు కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు, ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. చెల్పూర్ గ్రామంలో పెద్దచెరువు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో చెల్పూరు- జూపాక -కందుగుల గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిపివేసినట్టు చెప్పారు. రానున్న 24 గంటల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, కాబట్టి లోతట్టు ప్రాంత ప్రజలకు ఎటువంటి హానీ కలుగకుండా వెంటనే వారిని ఆయా ప్రాంతాల నుండి తరలించడానికి అవసరమైన సహాయక చర్యలతో అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. వాగులు, కాలువలు వద్ద ఎప్పటికప్పుడు నీటి ప్రవాహాన్ని పరిశీలించాలని, ఎటువంటి నష్టం వాటిల్లకుండా క్షేత్ర స్థాయిలో పరిస్థితులను గురించి తెలుసుకుంటు సంబంధించిన విషయాన్ని తెలియజేయాలని అన్నారు. పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ పోలీస్ అధికారులందరు వారి పరిధిలో సంబంధిత అధికారులతో సమన్వయ పరుచుకోవాలని, సహాయక చర్యలు అందించడానికి సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. రోడ్లపై నుండి వరద నీరు ప్రవహించే మార్గాలలో రాకపోకలను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. వారివెంట హుజురాబాద్ ఆర్డీఓ హరిసింగ్, ఏసీపీ జీవన్‌రెడ్డి, చెల్పూర్ సర్పంచ్ మహేందర్, తహసీల్దార్ కోమల్‌రెడ్డి, సీఐ బొల్లం రమేష్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి సురేష్

నవతెలంగాణ - కరీంనగర్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు కొనసాగిస్తామని బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగామ నర్సింగ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ దండు అంజయ్య అన్నారు. కేవీపీఎస్ నగర కార్యదర్శి గాజుల కనకరాజు అధ్యక్షతన స్థానిక మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ సర్కార్ టెంట్ల వద్ద మద్దతు ఇచ్చినప్పటికీ అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాసి కార్పొరేట్లకు ఉపయోగపడే నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల పొట్టకొట్టి కార్పొరేట్లకు మేలు చేస్తుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీపీ జేఏసీని చర్చలకు ఆహ్వానించి, సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు తిప్పారపు రోహిత్, కార్యదర్శి రత్నం సురేష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లెంకలపల్లి అనిల్, మహిళా నాయకురాలు పూజ, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

నవతెలంగాణ - కరీంనగర్ : గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో స్థానిక మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్, గురుకులాలను అధికారులు సందర్శించాలని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల శిథిలావస్థలో ఉన్న గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్ కూలిపోయే పరిస్థితి కూడా ఉంటుందన్నారు. ఎస్సీ సంక్షేమ హాస్టల్ (గర్ల్స్) సుభాష్ నగర్ హాస్టల్లోకి నీరు చేరి, భవనాల పైన నుంచి రూమ్‌లోకి నీరు వచ్చే అవకాశం ఉందని, జిల్లా కలెక్టర్, డీడీ వెళ్లి సందర్శించాలని అన్నారు. ఎం.పూజ, జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్, సభ్యులు రత్నం సురేష్, శ్రీవాణి, సవిత తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి



నవతెలంగాణ - కరీంనగర్ : ప్రభుత్వం భేషజాలకు పోకుండా గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ 22 రోజులుగా చేస్తున్న సమ్మెకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. పీఆర్సీలో నిర్ణయించిన మినీమం బేసిక్ రూ.19వేలు చెల్లించాలన్నారు. ఆలోపు స్వీపర్లకు రూ.15,600, ఎలక్ట్రిషన్, పంపు ఆపరేటర్, కారోబార్, బిల్లు కలెక్టర్, డ్రైవర్లకు రూ.19,500 నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించాలన్నారు. జీవో 51ని సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఒక మంత్రి పోరాటంలో ఉన్న కార్మికుల పట్ల నోరు పారేసుకోవడం సరికాదన్నారు. 2 సంవత్సరాలుగా కనీస వేతనాలు సవరించాలని రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్రజల ఆరోగ్యాలను, కార్మికుల కష్టాలను గుర్తించి చర్చలకు పిలిచి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు



సిరిసిల్ల పట్టణ ఒడ్డున మానేరు నది ప్రవాహం



రాళ్ల పేట ఓబులాపూర్ గ్రామాల మధ్య నిండుగా పారుతున్న ఒర్రె



సిరిసిల్లలో తాడు సహాయంతో వరదల నుంచి లోతట్టు ప్రాంత ప్రజలను దాటిస్తున్న పోలీసులు



కొనరావుపేట: వైద్యశాలలో నీరు



సిరిసిల్ల ప్రధాన రహదారులు జలమయం

అంతా జలమయం

- తెగిన చిన్న బోనాల చెరువు.. సిరిసిల్ల పట్టణాన్ని ముంచేత్తిన వరద
- పొంగిపొర్లుతున్న ఎగువ మానేరు
- మిడ్ మానేరు 22గేంట్లు ఎత్తివేత
- పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ
- జిల్లా పరిస్థితులపై మంత్రి కేటీఆర్ ఆరా..



ముస్తాబాద్: రామలక్ష్మణపల్లి రాకపోకల బంద్



బోయినిపల్లి : వర్షం నీరుతో తెగిన వంతెన



ముస్తాబాద్: అవునూర్‌లో కూలిన ఇల్లు



వేములవాడలో... సహాయక చర్యలు

నవతెలంగాణ - సిరిసిల్ల : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు రాజన్న సిరిసిల్ల జిల్లా మొత్తం జలమయమైంది. ఎగువమానేరు జలాశయం పూర్తిస్థాయిలో నిండి పరవళ్ల తొక్కుతోంది. చెరువులు అలుగు దూకుతున్నాయి. లోతట్టు ప్రాంతాలను సిరిసిల్ల పురపాలక సంఘం అధికారులు చైర్పర్సన్, జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తూ సహాయక చర్యలు చేపట్టారు. పట్టణంలోని అంబిక నగర్, అశోక్ నగర్, అనంత నగర్, సంజీవనగర్, తదితరులుతట్టు ప్రాంతాల ఇండ్లలోకి నీళ్లు చేరుకున్నాయి.

తెగిన చిన్న బోనాల చెరువు...

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి అనుకొని ఉన్న చిన్న బోనాల పెద్ద చెరువు కట్ట తెగడంతో పూర్తిస్థాయి నీరు చిన్న బోనాల నుండి ప్రవహిస్తూ సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట అనంత నగర్ తదితర ప్రాంతాలకు తీవ్ర స్థాయిలో వరద వచ్చి చేరుతుంది. ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా చెరవులను తలపించేలా నదుల ప్రవాహంలో నీరు కనిపిస్తోంది. కాలనీవాసులు బయటకు వెళ్లలేని పరిస్థితిలో స్థానిక టిఆర్ఎస్ నాయకులు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, మున్సిపల్ అధికారులు, జిల్లా పోలీసు అధికారులు, వెంటనే సహాయక చర్యలు చేపట్టి ముప్పు నుంచి తప్పించారు.

విషయం తెలుసుకున్న అధికార యంత్రాంగం పోలీసులు అప్రమత్తమై వెంటనే సహాయక చర్యలు చేపట్టారు.ఆ కాలనీలో ఉన్న ప్రజలను జెసిబిల ద్వారా ట్రాక్టర్ల ద్వారా పునరవాసన కేంద్రమైన సినారే కళామందిరానికి తరలిస్తున్నారు.



తంగళ్ళపల్లి: వర్షానికి కూలిపోయిన ఇల్లు



కొనరావుపేట పోలీస్ స్టేషన్‌లోకి వరద



ముస్తాబాద్ పెద్ద చెరువు

అధికార యంత్రాంగం అప్రమత్తం సమీక్షలను నిర్వహిస్తున్న కలెక్టర్..

రాష్ట్ర వాతావరణ శాఖ రాజన్న సిరిసిల్ల జిల్లాకు భారీ వర్ష సూచన ఉందన్న హెచ్చరికల జారీ తో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సమీక్షలు నిర్వహిస్తూ ముందస్తు సహాయక చర్యలపై అధికార యంత్రంగానికి సూచనలు చేస్తున్నారు.

జిల్లాలోని జలాశయాల ఇన్‌ఫ్లో.. అవుట్ ఫ్లో..

- గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో ఉన్న ప్రాజెక్టు సామర్థ్యం 2.20టీఎంసీ కాగా 11వేల985 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఉంది.
- బోయినపల్లి మండలంలోని మధ్య మానేరు జలాశయం సామర్థం 27.50టీఎంసీ కాగా, 26వేల700 క్యూసెక్కుల నీరు ఎగువ నుండి వస్తుండగా.. 22గేట్లు ఎత్తి నీరు దిగువకు వదులుతున్నారు.



రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు గంభీరావుపేట



బోయినిపల్లిలో వర్షం నీరుతో తెగిన వంతెన



సిరిసిల్ల : తెగిన చిన్న బోనాల చెరువు



సిరిసిల్ల పట్టంలో వరద ప్రాంతాలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ ఉదయ్ రెడ్డి

ముస్తాబాద్ కస్తూర్బాలోకి వరద నీరు

నవతెలంగాణ - ముస్తాబాద్ : వర్షానికి ముస్తాబాద్ మండల కస్తూర్బా పాఠశాలలో వరద నీరు చేరింది. పాఠశాల లోతట్టు ప్రాంతంలో ఉండడంతో చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు చేరుతోందని ఉపాధ్యాయులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ శరత్ రావు ఎస్సై శేఖర్ రెడ్డి ఎంపీడీవో రమాదేవి ఆ పాఠశాలలోని విద్యార్థులను జాగ్రత్తగా పాఠశాల నుండి బయటకు తీసుకువచ్చారు. మండలంలోని పోతుగల్ ప్రభుత్వ ప్రాథమికున్నత పాఠశాలలో వరద నీరు చేరడంతో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రాకేష్ ప్రభుత్వ పాఠశాలలో బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఆవునూరు గ్రామంలో వర్షానికి ఇల్లు కూలింది. రామలక్ష్మణ పల్లె మానేరు వాగు తీవ్రంగా రావడంతో పదిరే గ్రామాల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి.

జలదిగ్బంధంలో పోలీస్ స్టేషన్, సర్కారు దవాఖాన

నవతెలంగాణ - కొనరావుపేట : వర్షాలతో కొనరావుపేట పోలీస్ స్టేషన్‌తోపాటు సర్కారు దావఖాన పోలీస్ లైబ్రరీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గురువారం ఉదయం నుంచి సర్కార్ దావకానలోని పలు రూములోకి నీళ్లు వచ్చి చేరడంతో రోగులకు చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది ఇబ్బంది పడ్డారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్ గదిలోకి వరద నీరు చేరింది. మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారి పై వరద ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

మామిడిపల్లి ఎస్సీ కాలనీ 150ఇండ్లలోకి వరద నీరు

కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి గ్రామంలో మూలవాగు పక్కన ఉన్న ఎస్సీ కాలనీ లోని 150 ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో కాలనీవాసులంతా రోడ్లమీదకి వచ్చి ఆందోళన చేపట్టారు. తమను సురక్షితమైన ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో మూలవాగు పక్కకు గోడ నిర్మిస్తామని హామీలు ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

పొంగి పొర్లుతున్న బిక్క వాగు

నవతెలంగాణ - ఇల్లంతకుంట : బిక్క వాగు, చెరువులు , కుంటలు పొంగిపొర్లుతుండటంతో పెద్దలింగాపూర్, రహీంఖాన్‌పేట, నర్సక్కపేట, జవారిపేట, వల్లంపట్ల, ఇల్లంతకుంట, గాలిపెల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నర్సక్కపేటలోని లోతట్టు ప్రాంత ఇండ్లు నీట మునిగాయి.

ఇళ్లలోకి వర్షపు నీరు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : వర్షానికి మండల కేంద్రంలో కొడం శ్రీధర్, పడిగ దేవయ్యల ఇండ్లు కూలిపోయాయి. మండల కేంద్రంలోని రాంనగర్ ప్రాంతంలో నివాసాల్లోకి వరద చేరగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మండలంలోని రాళ్ల పేట గ్రామం నుండి ఓబులాపూర్, ముస్తాబాద్ గ్రామాలకు వెళ్లే దారిలో మార్గమధ్యంలో ఉన్న ఓర్రెలు పొంగిపొరలడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

50ఎకరాల్లో పంట నష్టం..

నవతెలంగాణ - గంభీరావుపేట : మండల పరిధిలోని గోరంటాల మీదుగా వచ్చే మల్లుపల్లి లోతువాగు మల్లుపల్లి గ్రామం నుండి సముద్రాల లింగాపూర్ వెళ్లే వైపు రోడ్డు ప్రధాన రహదారి వరద ధాటికి తెగిపోయింది. వాగు కట్టలు తెగి 50ఎకరాల పంట నష్టం జరిగింది.

వర్షంతో తెగిన కాలువలు వంతెనలు

నవతెలంగాణ - బోయినిపల్లి : స్తంభం పెల్లి నుండి వేములవాడకు వెళ్లే రహదారులో ఉన్న గంజి వాగు వర్షపు నీరుతో అధికంగా ప్రవహిస్తుండటంతో సర్పంచ్ కరుణాకర్ సహాయంతో ఎస్సై మహేష్ రాకపోకలు నిలిపివేసి ప్రజలను అప్రమత్తం చేశారు. మిడ్ మానేరు లోకి అధికంగా వర్షపు నీరు రావడంతో 22గేట్లను ఎత్తారు. అధిక వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

ఉప్పొంగి ప్రవహించిన మూల వాగు

నవతెలంగాణ - వేములవాడ : పట్టణంలోని బుడగ జంగాల కాలనీ, సౌరల కాలనీ ప్రజలు జలదిగ్బంధంలో మునిగిపోయారు. భారీ వర్షాలతో లోలెవెల్ కల్వర్టులు, ప్రధాన రహదారుల వెంట నీరు చేరి వేములవాడ నుండి సిరిసిల్ల, జగిత్యాల, మల్లారం రోడ్డు, కోరుట్ల, కరీంనగర్ వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని మూల వాగుకు వరద ప్రవాహం పెరిగి ప్రమాద స్థాయికి చేరింది. ప్రవాహాన్ని చూసేందుకు పట్టణ ప్రజలు, యువతి, యువకులు, చిన్నారులు పోటీపడ్డారు.

సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

వేములవాడ పట్టణంలో కురిసిన భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారుల వెంబడి నీళ్లు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో వెంటనే మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. ఈ సహాయ చర్యల్లో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్ర చారి, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. అంతకుముందు లోతట్టు ప్రాంతాలను, ప్రమాదకర వాగులు, వంకలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ చంద్రయ్యలు పరిశీలించిపలు సూచనలు చేశారు.

అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే రమేష్ బాబు

నవతెలంగాణ - వేములవాడ : జలమయమైనా లోతట్టు ప్రాంతాలను స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే రమేష్ బాబు పరిశీలించారు. పరిశీలనలో భాగంగా శాత్రాజ్ పల్లి రోడ్, బతుకమ్మ తెప్ప, సబ్ స్టేషన్, లాలపల్లి కట్టు కాలువ, చెక్కపల్లి రోడ్ బ్రిడ్జి, మల్లారం రోడ్ ప్రాంతాలను సందర్శించారు. అవసరమైతేనే ప్రజలు ప్రయాణాలు చేయాలన్నారు. బేడ, బుడగ జంగాల కుటుంబాలకు శాశ్వత పరిష్కారానికి డబల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తాం అని తెలిపారు. బుడగ జంగాల కాలనీలోని 35 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.3వేల ఆర్థిక సాయం అందించారు.

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని గిద్ద చెరువు నిండుకుండలా మారి మత్తడి పోర్లుతోంది. కిషన్‌దాస్‌పేటలోని దొంత ఆనందం గతంలో పీపుల్స్ వార్ ఉత్తర తెలంగాణ కార్యదర్శిగా పని చేసిన దొంత మార్కండేయ అలియాస్, శంకర్ ఇళ్లు రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయింది. పలువురి ఇండ్లు కూలిపోగా బీఆర్ఎస్ నాయకులు పందిర్ల పర్శరాములు వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. మండల కేంద్రంలోని గిద్ద చెరువు మత్తడి పొంగి ప్రవహిస్తుండడంతో తహసీల్దార్ జయంత్ కుమార్, ఎంపీడవో చిరంజీవి, సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రమకాంత్ వెళ్లి పరిశీలించారు. వరద ఉధృతికి కిషన్‌దాస్‌పేట తిమ్మాసి కుంట తెగి వరి పొలాలు మునిగాయి. నీరు భారీగా ప్రవహించడంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి బస్టాండ్ ప్రాంతం నుండి గ్రామంలోకి రెండో బైపాస్ రోడ్డు, అంబేద్కర్ రోడ్డు గుండా రాకపోకలు నిలిచిపోయాయి.

బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ...

ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామంలో భారీ వర్షాలకు ఐదు ఇండ్లలో నీరు చేరగా బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులను మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు అనవేని రవి గురువారం పంపిణీ చేశారు.



గంభీరావుపేట: తెగిపోయిన ప్రధాన రహదారి



కొనరావుపేట: ఆరోగ్య కేంద్రంలోనిక చేరిన వరద నీరు



సిరిసిల్ల: పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య



గంభీరావుపేట: సహాయక చర్యల్లో పాల్గొన్న నేతలు



ముస్తాబాద్: కస్తూరిబా పాఠశాలలో చేరిన నీరు



వేములవాడ: ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్ బాబు



వేములవాడ: రహదారి పై సహాయక చర్యలు



ఎల్లారెడ్డిపేట: నిత్యావసర సరుకుల పంపిణీ



వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

జిల్లా యంత్రంగానికి మంత్రి కేటీఆర్ ఆదేశాలు

నవతెలంగాణ - సిరిసిల్ల :

గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ అలర్ట్‌గా ఉండాలని మంత్రి కేటీఆర్ జిల్లా యంత్రాంగా నికి ఆదేశాలు జారీ చేశారు. గురువారం కలెక్టర్ అనురాగ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ తో ఫోన్‌లో మాట్లాడారు. అధిక వర్షాలు, వరదల పరిస్థితులపై ఆరా తీశారు. సిరిసిల్ల పట్టణం పైన ఉన్న చిన్న బోనాల చెరువు తెగడం వలన పట్టణంలోని ప్రభావిత వరద ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అవసరమయితే సహాయక చర్యలకు యంత్రాలను హైద్రాబాద్ నుంచి పంపిస్తామని తెలిపారు. అలాగే ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలోనే ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు.

బీ.. అలెర్ట్

- గురువారం రాత్రి అధిక వర్షం పడే అవకాశం
- జిల్లాలో వర్షాల వల్ల ఒక్క ప్రాణనష్టం కూడా జరగొద్దు..
- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహజన్

నవతెలంగాణ - సిరిసిల్ల :

గురు, శుక్రవారాల్లో భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఒక్క ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. భారీ వర్ష సూచన దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై గురువారం సాయంత్రం జిల్లా అదనపు కలెక్టర్‌లు, ఆర్డీవోలు, అన్నీ ప్రభుత్వ జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో)లతో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సీరియస్‌గా దృష్టి పెట్టి సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. గ్రామాలు, ఆవాసలకు భారీ వర్షాల వల్ల రాకపోకలు నిలిచిపోయిన చోట డయాలసిస్, క్యాన్సర్ రోగులకు వైద్య సహాయం అందేలా ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలనీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావును అదేశించారు. 8 నెలలు నిండిన గర్భిణులను సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలన్నారు. గ్రామాలకు తాగునీటి సరఫరా కు అంతరాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో, ప్రమాదకరం ఉన్న ఇండ్లలో ఉన్న వారినీ, లోతట్టు ప్రాంత ప్రజలను కూడా వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. సిరిసిల్లలోని మానేరు, వేములవాడ పట్టణంలోని మూలవాగు బండ్ వద్ద 24గంటల పర్యవేక్షణ ఉండేలా మున్సిపల్ అధికారులు డ్యూటీలు వేయాలన్నారు. బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలోనీ చెరువు ఓవర్ ఫ్లో అయ్యేందుకు అవకాశం ఉన్న దృష్ట్యా అక్కడ ఇరిగేషన్ ఏఈని రాత్రిపూట కూడా ఉంటూ పర్యవేక్షణ చేసేలా చూడాలని జిల్లా ఇరిగేషన్ అధికారినీ కలెక్టర్ ఆదేశించారు. ఇసుక సంచులు కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. రాకపోకలు లేని ఫాజుల్ నగర్, వట్టెంల, శాత్రాజుపల్లి, హన్మజీపేట గ్రామాల ప్రజలకు అత్యవసరం వైద్య సహాయం అందేలా జిల్లా వైద్యాధికారి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నీటి ప్రవాహాలు, కాజ్ వేలు ఉన్న అన్ని గ్రామాలలో నైట్ డ్యూటీ లు వెంటనే వేయాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
-మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమత రెడ్డి

నవతెలంగాణ -పెద్దపల్లి టౌన్
ఎడతెరిపి లేకుండా గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని మున్సిపల్ చైర్ పర్సన్ డా. దాసరి మమత రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.గురువారం రంగంపల్లి వద్ద గల రాజీవ్ రహదారి, పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ మట్ట శ్రీనివాస్ రెడ్డి,వార్డ్ కౌన్సిలర్లతో కలిసి చైర్ పర్సన్ సందర్శించారు. పట్టణ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మా హెల్ప్ లైన్ నెంబర్ 9988556162 సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు కోమిరిశెట్టి కనకలక్ష్మి శ్రీకాంత్, బొంకురి భాగ్యలక్ష్మి సన్నీ, గాదె మాధవి, పూదరి చంద్రశేఖర్, సోనీ శ్రీకాంత్, సాహిదా సాబీర్ ఖాన్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు ఇస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మమతరెడ్డి


ముత్తారంలో మానేరు పరివాహ గ్రామంలో నిలిచిన నీరు

వాన జోరు.. వరద హోరు..

- నీట మునిగిన గ్రామాలు, పంట పొలాలు
- రాకపోకులకు తీవ్ర అంతరాయం..
- గోపాల్‌పూర్ మానేరు నదిలో చిక్కుకుపోయిన 15 మంది కూలీలు
- భారీ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్
- సబ్బితం జలపాతం సందర్శన నిలిపివేత
- ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలింపు


వరదల్లో చిక్కుకున్న కూలీలు, సహాయక చర్యలు చేపడుతున్న కలెక్టర్


హుస్సేన్ మియా వాగులు పరిశీలిస్తున్న ఇన్చార్జి తహసిల్దార్, ఎంపీడీవో


సుల్తానాబాద్‌లో నీట మునిగిన కాలనీలో ఆందోళన చెందుతున్న ప్రజలు


సింగరేణిలో వర్షంతో పాడైన ఓసిపి రోడ్లు, నిలిచి పోయిన వాహనాలు

నవతెలంగాణ-మంథని
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మంథని డివిజన్ వ్యాప్తంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.వరదల కారణంగా పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని అడవి నాగేపల్లి గ్రామం చుట్టూ ఉధృతంగా నీరు ప్రవహిస్తుంది.ఆ గ్రామం జలమయమైంది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలోని మంథని లోతట్టు గ్రామాలు జలసముద్రంలా మారాయి. మంథని మండలం నాగేపల్లి గ్రామంలోని ఇళ్ళలోకి మానేరు వరద నీరు వచ్చి చేరింది. ఓదాలలో మానేరు ఉధృతంగా పారుతుండడంతో నీటి మునిగిన పంట పొలాలు,నివాస గృహాలు.గ్రామాలు జలదిగ్బంధమైంది. ఈ క్రమంలో భారీ వరదలపై రెవెన్యూ,పోలీస్,ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్,ప్రజాప్రతినిధులు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ సహాయక చర్యలు తీసుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. మండలం గోపాల్ పూర్ మానేరు నదిలో ఇసుక క్వారీలో పనిచేస్తున్న15మంది కూలీలు మానేరు నది వరదల్లో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ తో పాటు అధికార యంత్రాంగం హుటాహుటిన గోపాల్ పూర్ ప్రాంతానికి చేరుకొని సహాయక రక్షణ చర్యలు చేప ట్టారు. కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ పర్యవేక్షణలో స్పీడు బోట్లతో వెళ్లి కూలీలను బయ టకు సురక్షితంగా తీసుకురావడంతో ప్రజలు, కూలీలు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రవాహం వలన బయటకు రాలేక చిక్కుకున్న19 మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఇబ్బంది ఎదురైన జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 7995070699 నందు సంప్రదించాలని కలెక్టర్ అన్నారు. ఈ రెస్క్యూ ఆపరేషన్ లో డిసిపి వైభవ్ గైక్వాడ్, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వి.హనుమ, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఎంపీపీ శంకర్,ఎంపీడీఓ రమేష్,తహసిల్దార్ సిరిపురం గిరి పాల్గొన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మానేరు నది ఉప్పొంగడంతో నది ప్రక్కనే ఉన్న అడవి సోమన్ పల్లి గ్రామంలోని ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించింది.దీంతో అప్రమత్తమైన అధికారులు వరద ముంపు గురైన 15 కుటుంబాలకు చెందిన వారిని అడవి సోమన్ పల్లి సమీపంలో గల పీహెచ్‌సీ, చిన్న ఓదాల గ్రామానికి చెందిన మూడు కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించామని మంథని ఎంపీడీవో రమేష్ తెలిపారు.

సుల్తానాబాద్ నవతెలంగాణ: భారీ వర్షాల దృష్ట్యా వరద ప్రాంతాల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సుల్తానాబాద్ పట్టణంలో గురువారం పర్యటించారు. పట్టణంలో వరద కారణంగా చెరువులు పొంగిపొర్లుతుండడంతో స్వప్న కాలనీలో ఇండ్ల ప్రాంగణంలో నీరు చేరింది. స్వప్న కాలనీ సందర్శించిన జిల్లా కలెక్టర్, మెడికల్ బృందాలను ఏర్పాటు చేసి స్వప్న కాలనీలోని ప్రతి ఇంటి వద్ద ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్ పట్టణంలో జలమయమైన పూసాల రోడ్డును పరిశీలించిన కలెక్టర్ జేసీబీ సహాయంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించి త్వరితగతిన క్లియర్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.సుల్తానాబాద్ పర్యటనలో కలెక్టర్ వెంట సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, సుల్తానాబాద్ తహసిల్దార్ యాకన్న పాల్గొన్నారు. వేణుగోపాలస్వామి ఆలయంలో శివాలయం ఆలయాలలో వరద నీరు చేరింది లోతట్టు ప్రాంతాలను సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ ముత్యం సునీత రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ బిరుదు సమతకృష్ణ, పాటు ఆయా వార్డులలో కౌన్సిలర్లు పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు.

నవతెలంగాణ జూలపల్లి: మండలంలోని హుస్సేన్ మియా వాగు పొంగిపొర్లుతుంది. మండలంలోని ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడి రాకపోకలు నిలిచాయి. ఎడతెరిపి లేని వర్షాలకు జనజీవన స్తంభించి, చీమల పేట తెలికుంట, వాడుక పూర్ కీచులాటపల్లి గ్రామాల మధ్య ఒర్రెలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. పెద్దాపూర్, తెలు కుంట రామప్ప చెరువు మత్తడి దునుకుతున్నాయి. చాలామంది రైతుల పత్తి చేనులు,నారుమడులు నీట మునిగాయి.120.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని ఇన్చార్జి తాసిల్దార్ అబూబకర్ తెలియజేశారు.

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం: పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామంలో గల గౌరీ గుండాల జలపాతం సందర్శనకు ఎవరు రావొద్దని బసంత్ నగర్ ఎస్ఐ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేసి నిషేధాజ్ఞలు ఉన్నాయి అని చెప్పిన కూడా పోలీస్ వారి మాటలను పట్టించుకోకుండా తాత్కాలిక ఆనందాల కోసం, కొందరు మాధ్యమాల్లో పోస్టుల కోసం సెల్ఫీ మోజులో పడి, స్నేహితులతో సరదా కోసం యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు.

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం నియోజకవర్గం లోతట్టు ప్రాంతాలు జలమలయమై ఇండ్లలోకి నీరు చేరి ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహస్తారని రామగుండం నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు ధర్మపురి, వంగ లక్ష్మిపతి గౌడ్, సదానందం, వికాస్ కుమార్ యాదవ్ ఉన్నారు. టిడిపి రామగుండం నియోజక వర్గ ఇన్‌ఛార్జి పెద్దపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ముంపు ప్రాంతాలను టిడిపి నాయకులు గురువారం సందర్శించారు. సప్తగిరి కాలనీలోని ముంపుకు గురైన ఇళ్లను, పక్కనే డ్రైనేజీ కాలువలను పరిశీలించి ఆయా కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కోటగిరి పాపయ్య, సంగేపు రాజు, నగునూరి రాజయ్య, హనుమ రాజమల్లు, సల్ల రవీందర్ తదితరులున్నారు. భారీగా కురుస్తున్న వర్షంతో గురువారం జనగామలో నివాసం ఉండే నిరుపేద మహిళ రమ తన ఇంట్లో జల దిగ్బంధంలో చిక్కుకోగా, విషయం తెలుసుకున్న కాంగ్రెష్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గురువారం కాపాడి, బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఆ మహిళకు ఆర్థిక సహాయం చేశారు. జీఎంతో మాట్లాడి మట్టి పోయిస్తానని హామీ ఇచ్చారు. భారీ వర్షాలతో 23వ డివిజన్ మోటినగర్, సుభాష్ నగర్ ఏరియాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇండ్లలోకి నీరు చేరి ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆ ప్రాంతానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్‌లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేష్ అన్నారు. గురువారం ఆయన 39వ డివిజన్ ముంపు ప్రాంతాల ప్రజలను కలిసి పరామర్శించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రజలు మరింతగా కష్టాలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉన్నదని, వరద బాధితులను, గోదావరి ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉన్నదని సిపిఐఎంఎల్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. గతవారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో రామగుండం యాష్ పాండ్ కట్ట తెగి నీట మునిగిన బాధిత కుటుంబాలకు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదేశాలతో రామగుండం డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక రావు భోజనాలు ఏర్పాటు చేశారు.

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ: ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ గురువారం ఓసీపీ-3 ప్రాజెక్ట్ వరద కాలువలను విస్తృతంగా తనిఖీ చేశారు. అధిక వర్షాల కారణంగా నదులు, కాలువలు పొంగి పొర్లుతున్న క్రమములో ఓసిపి-3 ప్రాజెక్ట్ ప్రక్క నుంచి ప్రవహిస్తున్న జల్లారం వాగు పైన కురుస్తున్న వర్షాల వల్ల పెరుగుతున్న ఉధృతిపై అంచనా వేయుటకు అధికారులతో కలిసి తనిఖీ చేశారు.

భారీ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్
(నవ తెలంగాణ - సింగరేణి ప్రతినిధి)
రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల నుంచి జరిగే బొగ్గు ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి గుండెకాయగా నిలిచే రామగుండం రీజియన్ లో నాలుగు ఓపెన్ కాస్ట్ గనులలో వర్షపు నీరు భారీగా చేరింది.వర్షాల వల్ల దాదాపు 3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది.
సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ ఎస్ వి కె శ్రీనివాస్ రామగుండం రీజియన్ లో మకాం వేసి బొగ్గు ఉత్పత్తిని, రక్షణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అధిగమించడానికి ఉన్నతాధికారులతో సమావేశాలను ఏర్పాటు చేసి పలు ఆదేశాలను జారీ చేసినట్లు తెలుస్తుంది.

నవతెలంగాణ -పెద్దపల్లి టౌన్: పెద్దపల్లి మండలం లోని సబ్బితం గ్రామంలో గౌరీ గుండాల జలపాతం సందర్శన కు ఎవరు రావొద్దని బసంత్ నగర్ ఎస్ ఐ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రత్యేక పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశామని, నిషేధాజ్ఞలు ఉన్నాయని తెలిపారు. సబ్బితం జలపాతం వద్ద బుధవారం మానుపాటి వెంకటేష్ ప్రసాద్, కిషన్ నగర్,కరీంనగర్ అను యువకుడు చనిపోయినట్లు తెలిపారు..

నవతెలంగాణ-ముత్తారం: మానేరు నది ముత్తారం మండలం వద్ద ఉప్పొంగి ప్రవహిస్తుంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరద నీరు భారీగా మానేరులోకి వచ్చి చేరడంతో మండలం వద్ద ఉగ్ర రూపం దాలుస్తుంది. ముత్తారం మండలంలోని మానేరు పరివాహక గ్రామాలైన ఓడేడు, అడవీ శ్రీరాంపూర్, ఖమ్మంపల్లితోపాటు పలు గ్రామాల్లో ఇప్పటికే మానేరు ఉధృతితో పంట పొలాలు నీట మునిగాయి. మానేరు పరివాహకంగా ఉన్న ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి సైతం నీరు చేరింది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ కె.వరంధన్ హుటాహుటిన ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించారు. ఆయన ఎంపిడిఓ కలికోట శ్రీనివాస్, ఎంపిఓ బైరి వేణు మాధవ్‌లతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులకు సమాచారం అందించాలని, తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వారి వెంట ఖమ్మంపల్లి సర్పంచ్ సముద్రాల రమేష్, ఓడేడు ఉప సర్పంచ్ భాను కుమార్ తదితరులున్నారు.


ముత్తారంలో పునరావాస కేంద్రం వద్ద ముంపు గ్రామాల ప్రజలు


మక్కాన్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న మహిళ


వరద బాధితులకు భోజనం అందజేస్తున్న డిప్యూటీ మేయర్


వరద కాలువపై అధికారులకు సూచన చేస్తున్న జీఎం ఏ మనోహర్

బామ్లానాయక్ తండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు


తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, యువతులు, మహిళలు

నవతెలంగాణ-గోదావరిఖని:
పాలకుర్తి మండలం బామ్లానాయక్ తండాలో గిరిజనుల ఆరాధ్య దైవం తీజ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తండా సర్పంచ్ రాజు నాయక్ ఆధ్వ ర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించచారు. గురువారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వేడుకల్లో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పాలకుర్తి జడ్పిటిసి కందుల సంధ్యారాణిలు పాల్గొన్నారు. తండాలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న పండుగ వేడుకల చివరి రోజు గురువారం గ్రామస్తులంతా కలిసి తీజ్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తీజ్ ఉత్సవాలను ఇంత ఘనంగా నిర్వహించిన సర్పంచ్ రాజు నాయక్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అభినందించారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇన్‌టెక్ వెల్‌ను సందర్శించిన డైరెక్టర్ ఆపరేషన్స్
నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరి నది తీరం వద్ద ఉన్న ఇన్‌టెక్ వెల్‌ను, ఎంటసిపి క్వారీ, ఎం సాండ్ ప్లాంట్‌ను సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వికె శ్రీనివాస్, ఆర్జీ 1 జీఎం చింతల శ్రీనివాస్ గురువారం సందర్శించారు. వారం రోజులుగా ఎడతెరిపి కురుస్తున్న భారీ వర్షాల వలన గోదావరి నది లోకి వచ్చి చేరుతున్న నీటిని పరిశీలించారు. గోదావరి లోకి వచ్చిన నీటి లెవల్ ను లెవల్ ఇండికేటర్ వద్ద పరిశీలించారు.

రైతుల దగ్గరికే అన్ని సేవలు
నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
రైతులకు డిఏపి, యూరియా సబ్సిడిపై అందిస్తున్న ఘనత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికే దక్కుతుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు. లక్ష 25వేల కిసాన్ సంవృద్ధి కేంద్రాలను దేశ ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్‌లో వర్చువల్ గా ప్రారంభించారు. రైతులతో కలిసి అమర్ చంద్ కళ్యాణ మంటపంలో బిజెపి నాయకులు మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలరపు పర్వతాలు, దాడి సంతోష్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్

ముఖాముఖి



నవతెలంగాణ -పెద్దపల్లి:
సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన రెవెన్యూ అదనపు కలెక్టర్ జీ.శ్యాం ప్రసాద్‌లాల్ అన్నారు. నూతనంగా పెద్దపల్లి జిల్లా రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి శ్యామ్ ప్రసాద్‌లాల్ తన అనుభవాలను నవతెలంగాణ దినపత్రికతో పంచుకున్నారు.

నవతెలంగాణ: పెద్దపల్లి రెవెన్యూ విభాగంలో అదనపు కలెక్టర్‌గా పని చేయడంపై మీ అభిప్రాయం?

అదనపు కలెక్టర్: పెద్దపల్లి జిల్లాలో రెవెన్యూ విభాగంలో అదనపు కలెక్టర్‌గా పని చేయడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పుట్టి పెరిగిన నాకు ఇదే ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్ తర్వాత పెద్దపంల్లి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్నందుకు అదృష్టంగా భావిస్తున్న.

నవతెలంగాణ: మీ నేపథ్యం ఏమిటి? ఎక్కడ జన్మించారు? విద్యాభ్యాసం మొదటి ఉద్యోగం?

అదనపు కలెక్టర్: మాది ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ . ప్రస్తుతం అది సిద్దిపేట జిల్లాలో ఉంది. హుస్నాబాద్ లో జన్మించాను. అక్కడే విద్యాభ్యాసం ప్రారంభించాను. ఇంటర్ వరకు హుస్నాబాద్ లోనే చది వాను. డిగ్రీ సిద్దిపేటలో చేశాను. ఎమ్మె, ఎంపిల్ ఫిలాసఫీ వరకు ఉస్మానియాలో పూర్తి చేశాను. మొదటగా 1992 నుంచి 95 వరకు ఈనాడు దినపత్రిక లో డెస్క్ జర్నలిస్ట్ సబ్‌ఎడిటర్‌గా పని చేశాను. కరీంనగర్ జనరల్ డెస్క్ లో కూడా పనిచేశాను.

నవ తెలంగాణ: మీ కుటుంబ నేపథ్యం?

అదనపు కలెక్టర్: మా తండ్రిగారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చాలా సుపరిచితులైన సాహితీ కారుడు. మంచి రంగస్థలం నాటకుడు. మా నాన్నగారు పేరు గాజుల రాజేశం. అయినప్పటికీ రాజశ్రీ అనే పేరు అందరికీ సుపరి చితమైనది. నాటకాలు వేయడం, పుస్తకాలు రాయడం, కవితలు రాయడం వంటి చాలా చేస్తారు. సాహిత్య కళాకారుడుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అందరికీ సుపరిచితమైన వ్యక్తి.

నవ తెలంగాణ: మీ పూర్తి పేరు ఏమిటి లాల్ అనే పేరు ఎందుకు వచ్చింది? మీకు మీ నాన్న నుండి సాహిత్యం పట్ల ఏమైనా అనుబంధం ఏర్పడిందా?

అదనపు కలెక్టర్: నా పూర్తి పేరు గాజుల వెంకట శ్యాం ప్రసాద్ లాల్. మా నాన్నగారు అప్పటి ప్రధానమంత్రి జోహార్ లాల్ నెహ్రూ గారి పేరును తీసుకొని లాల్ అనే పేరు తగిలించి పెట్టారు. మా నాన్నగారు మంచి సాహిత్య ప్రేమికుడు కాబట్టి నాకు కూడా సాహిత్యం పట్ల మంచి అభిరుచి ఉంది. అంత పెద్దగా కాకపోయినా కొన్ని కవితలు రాస్తాను. శాంతా శుభోదయం పేరుతో చిన్న చిన్న కవితలు రాస్తాను. త్వరలో ఒక పుస్తకం రాబోతుంది.

నవ తెలంగాణ: ఒక అధికారిగా ఉద్యోగ బాధ్యతలు ఎప్పటినుండి ప్రారంభించారు? ఏ బాధ్యతల్లో పనిచేశారు?

అదనపు కలెక్టర్: 1995లో గ్రూప్ టు ఏ అధికారిగా సెలెక్ట్ అయ్యాను. మొదటిసారిగా గంభీరావుపేట తాసిల్దారుగా పనిచేశాను. తరువాత బోయిన్పల్లి సిరిసిల్ల ,పెద్దపల్లి ,హుజురాబాద్ ,కరీంనగర్, కోరుట్ల మండలాల్లో తాసిల్దారుగా పనిచేశాను. 2011 లో డిప్యూటీ కలెక్టర్గా, తరువాత సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కరీంనగర్లో పనిచేశాను. 2014లో బోధనలో ఆర్డీవోగా 2018 లో సిరిసిల్ల ఆర్డిఓ పనిచేశాను. 2018లో పదోన్నతి పై పెద్దపెల్లి డిఆర్ఓ గా బదిలీ అయినప్పటికీ వెళ్లలేదు. తరువాత 2018 తర్వాత జగిత్యాల అదనపు కలెక్టర్‌గా తర్వాత కరీంనగర్ అదనపు కలెక్టర్గ 2023 వరకు పనిచేశాను. ఇదే సంవత్సరం 2023 జూలై 15న పెద్దపల్లి జిల్లా రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాను.

నవ తెలంగాణ: పెద్దపల్లి జిల్లా రెవెన్యూ విభాగానికి అదనపు కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన మీరు రెవెన్యూ సమస్యలు ప్రజా సమస్యలపై ఎలా పరిష్కరిస్తారు?

అదనపు కలెక్టర్: తహసీల్దారు నుంచి రెవెన్యూ విభాగానికి జిల్లా అదనపు కలెక్టర్గా కరీంనగర్ జగిత్యాల జిల్లాలలో పనిచేసిన అనుభవం ఉంది .ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో కూడా అదే బాధ్యతలు చేపట్టాను. రెవెన్యూలో ఉన్న సమస్యలు ప్రజా సమస్యలపై సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తాను. ఇటువంటి ఫైల్స్ గాని వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాను.

నవ తెలంగాణ: పెద్దపల్లి జిల్లాలో ప్రధానంగా సి ఎం ఆర్ సమస్య ఎక్కువగా ఉంది. మిల్లర్ల దోపిడి పై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

అదనపు కలెక్టర్: పెద్దపల్లి జిల్లాలో సీఎంఆర్ సమస్యతో పాటు మిల్లర్ల దోపిడి పై కొంత అవగాహన ఉంది .ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఉన్నప్పటికీ పెద్దపెల్లి జిల్లాలో ఎక్కువగా ఉన్నట్లు గమనించాను. బుధవారం రోజునే జిల్లాలోని అందరూ మిల్లర్లతో సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించాను. మిల్లర్ల దోపిడీ సిఎంఆర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని మిల్లర్లను హెచ్చరించాను. ఈ విషయంలో ఎటువంటి వారినైనా వదిలిపెట్టను. తోకలు జాడిస్తే కత్తిరిస్తాను.

నవ తెలంగాణ: రెవెన్యూ యంత్రాంగంలో అక్రమాలు నెలకొన్నాయి. ముఖ్యంగా మండల స్థాయిలో తహసీల్దార్లు. డివిజన్ కేంద్రంలో కార్యాలయంలో సిబ్బంది. కలెక్టరేట్లోని సిబ్బంది నిర్లక్ష్యం ఉంది. వాటిపై మీ చర్యలు ఎలా ఉంటాయి?

అదనపు కలెక్టర్: రెవెన్యూ విభాగంలో సుదీర్ఘంగా పనిచేస్తున్న నాకు రెవెన్యూ సమస్యలు యంత్రాంగంలో సిబ్బందిలో సమస్యలు నాకు పూర్తిగా అవగాహన ఉంది. పెద్దపల్లి జిల్లాలోని నెలకొన్న రెవెన్యూ విభాగంలో అక్రమాలపై ప్రత్యే కమైన దృష్టి సారిస్తాను. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తాను.

ఆపదలో అండగా ఉంటాం
నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి జిల్లాలోని వరద ముంపు ప్రాంతంలో జీవిస్తున్న ప్రజలకు ఆపదలో అండగా ఉంటామని పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ చైర్మన్ కొలిపాక నర్సయ్య తెలిపారు.వరదల నుండి కాపాడడానికి గజ ఈత గాల్లు సిద్ధంగా ఉన్నారని, ఇబ్బందులో ఉన్న వారు 9963990132,8897505147 నంబర్ లను సంప్రదించాలని తెలిపారు.

టీఎమ్మార్పీఎస్‌లో చేరికలు
నవతెలంగాణ-గోదావరిఖని:
తెలంగాణ ఎంఆర్‌పిఎస్ రామగుండం నియోజకవర్గ కమిటీలో మేడి ప్రవీణ్, మహేష్, సిందిళ్ళ రేణుక, శ్వేత, శ్రీలత జిల్లా నాయకులు యాసర్ల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర నాయకులు కొంద్ర శంకర్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల శ్రీనివాస్, ఈర్ల ప్రేమ్ కుమార్, మహేష్, వెంకటేష్ తదితరులున్నారు.

పెన్షన్ పే ఆర్డర్ కోసం పత్రాలు సమర్పించాలి
నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పే ఆర్డర్(పిపిఓ) సవరణ సీఎంపిఫ్ రీజినల్ కమిషనర్ రామగుండం, అసిస్టెంట్ కమిషనర్ సీఎంపిఫ్ కొత్తగూడెం లేఖలపై జియం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కార్పొరేట్ స్వీయ పెన్షనర్లకు సవరించిన పెన్షన్ పే ఆర్డర్(పిపిఓ) జారీ చేసేందుకు సర్క్యూలర్ జారీ చేసినట్లు సింగరేణి రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆళవందార్ వేణు మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి
నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:
ఏపీజే అబ్దుల్ కలాం 8వ వర్ధంతిని పురస్కరించుకొని శ్రీ రామ విద్యానికేతన్‌లో లయన్స్ క్లబ్, నేషనల్ యూత్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. అడ్డగుంటపల్లి చౌరస్తా లోని అబ్దుల్ కలాం విగ్రహంకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎన్‌వైపి అధ్యక్షులు యాదవ రాజు, పాఠశాల హెచ్‌ఎం సూర్య దేవర జ్యోతి, డాక్టర్ నారాయణ, సత్యం తదితరులున్నారు.

6వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి
నవతెలంగాణ-గోదావరిఖని:
ఈ నెల కొత్తగూడెంలో 29,30 తేదీల్లో సిఐటియూ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర 6వ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కోశాధికారి వేల్పుల కుమారస్వామి రామగుండం రీజియన్ కాంట్రాక్టు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభలు జయప్రదం చేయుటకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ఫ్యాషన్ పొల్యూషన్ తగ్గించేందుకు

అమ్మ సమాజ నిర్మాత అంటారు. అది నిజం చేస్తున్న భారతీయ మహిళలు ఎందరో ఉన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటుగా ఆర్థికంగా కూడా కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. వృత్తి, ఉద్యోగ వ్యాపార రంగాలలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. అటువంటి మహిళలలో ప్రియాంక తాయి ఒకరు. 'కుల స్టూడియో' పేరుతో ఓ సంస్థ స్థాపించి అమ్మలకు ఉపాధి కల్పిస్తున్నారు. బట్టల వ్యర్థాలతో కొత్త ఆవిష్కరణలు చేస్తూ ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

ప్రియాంక పుట్టింది హైదరాబాద్. అయితే పెరిగింది ముంబై, వృత్తి విద్యలను అభ్యసించింది బెంగళూరులో. ఈమె ఒక ఫ్యాషన్ డిజైనర్. 2008లో ఓ సంస్థలో అపారల్ డిజైనర్‌గా తన ప్రొఫెషన్‌ను మొదలుపెట్టారు. 2011 నాటికి 'కుల స్టుడియో' పేరిట సొంత సంస్థను స్థాపించే స్థితికి ఎదిగారు. ఒక బిడ్డగా, భారత నౌకాదళ ఉన్నతాధికారికి భార్యగా, ఇద్దరు ఆడపిల్లల తల్లిగా, కోడలిగా తన బాధ్యతలను నిర్వహిస్తూనే 'కుల స్టూడియో' క్రియేటివ్ డైరెక్టర్‌గా తన సంస్థ ఎదుగుదల కోసం కృషి చేస్తూ తన గమనాన్ని సాగిస్తున్నారు ప్రియాంక.





మిగిలిన సంస్థలకు భిన్నంగా

'కుల స్టుడియో' మిగిలిన అన్ని ఫ్యాషన్ సంస్థలకు భిన్నమైన ఆలోచనతో మొదలు పెట్టారు. ఆర్థికంగా సంపన్నమైన కుటుంబంలో జన్మించినా పొదుపుపై చక్కని అవగాహన ఉన్న వ్యక్తి ఈమె. ఏదీ వృధా కారాదు అన్న ఆలోచనతో 'కుల స్టూడియో' మొదలు పెట్టారు. వినూత్న ఆలోచనతో అభివృద్ధి చెందిన ఆ సంస్థ 2021లో టాప్ 40 స్టార్టప్స్‌లో స్థానం దక్కించుకుంది. ఇది తనకెంతో గర్వకారణం అంటారు ఆమె. 'మనం కట్టుకునే బట్టలు మన ఆలోచనకు, మన నమ్మకాలకు, మన ఇష్టాఇష్టాలకు సంబంధించిన విషయాలు ఎవరికి నచ్చిన విధంగా, వారి శరీరాకృతికి తగినట్టు, అందుకు అనుగుణంగా బట్టలు తయారు చేయించి ఇవ్వడం మా ప్రత్యేకం' అని నమ్మకంగా చెప్తున్నారు ప్రియాంక.

వాతావరణ కాలుష్యంతో పాటు

టెక్స్టైల్ మిల్స్‌లో మిగిలి వృధాగా పడి ఉన్న వస్త్రాలను, నచ్చినా కట్టుకోవడానికి వీలులేక ఇంట్లో అనవసరంగా పడి ఉన్న వస్త్రాల నుండి ఆధునిక డిజైనర్, సాంప్రదాయ దుస్తులను తయారు చేయడం కుల స్టూడియో ఉద్దేశం. ఫ్యాషన్ పొల్యూషన్‌ను తగ్గించి బట్ట లైఫ్‌ను పెంచడం తన లక్ష్యంగా పెట్టుకున్నారు ఆమె. 'ఇలా వ్యర్థ పదార్థాల వల్ల జరిగే వాతావరణ కాలుష్యంతో పాటు ఇతర నష్టాలను కూడా తగ్గించగలం. అందుకే వ్యాపారంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొన్నాను. నా భర్త, సంస్థ సభ్యులు నాకు ఎంతో సహాయ సహకారాలు అందిసున్నారు. లేకపోతే ఈ ప్రయాణం ఇంతకాలం కొనసాగేది కాదు' అంటున్నారు.

ట్రెండ్ మారుతూ ఉంటుంది

'కోవిడ్-19 వంటివి మనం ఇంతకు ముందు ఊహించలేని విధంగా సమాజాన్ని ప్రభావితం చేయగలవు. కాబట్టి ఇప్పటి నుండి 100 ఏండ్ల వరకు ఫ్యాషన్ అనేది మనం అంచనా వేసిన దానికంటే పూర్తి భిన్నంగా ఉండవచ్చు. మాస్కులు ధరించడం తప్పనిసరి అవుతుందని, అది ప్రపంచ వ్యాప్తంగా ప్రజల వార్డ్‌రోబ్ లలో ప్రధానమైనదిగా మారిపోతుందని ఎవరూ ఊహించలేదు. అయితే భవిష్యత్తులో మన దుస్తులు ఎలా ఉంటాయో మనం ఊహించగలం. దుస్తులు ధరించడంలో సాంకేతికత కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందని మనకు తెలుసు. ట్రెండ్‌లు నిరంతరం మారుతూ ఉంటాయి. సాంకేతికత పెరుగుతూనే ఉంటుంది. ఫ్యాషన్ పరిశ్రమ దుస్తులతో ప్రత్యేకమైన, బోల్డ్, టెక్-ఆధారిత ప్రభావాన్ని చూపుతుంది. గత పదేండ్ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా మహిళల శ్రామికశక్తి వేగంతో పెరుగుతోందని డేటా చెబుతోంది. ఆన్‌లైన్ వ్యాపారాలు చేస్తున్న మహిళల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అలాగే నిర్ణయాలు తీసుకునే విషయంలో కూడా స్వతంత్రంగా ఉంటున్నారు' అంటున్నారు ఆమె.


అమ్మలకే ప్రాధాన్యం

ఎంత మంచి ఆలోచన అయినా ఈ వ్యాపారంలో అతి తక్కువ మంది మాత్రమే ఉన్నారు. దాంతో ఇన్వెస్టర్ల నమ్మకం సంపాదించడం, ఫండ్స్ ఏర్పాటు చేసుకోవడం ప్రియాంకకు మొదట్లో చాలా కష్టమయింది. ఎంతో ఓపికతో ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు తన కుల స్టూడియో ద్వారా ఎంతో మంది మహిళలకు చేయూతనిస్తున్నారు. ముఖ్యంగా తల్లులు అయిన తర్వాత తిరిగి ఉద్యోగం ప్రారంభించాలనుకుంటున్న మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ విధంగా మహిళా సాధికారతకు తన వంతు కృషి చేస్తున్నారు. అంతేకాదు సంస్థలో పని చేసే మహిళలకు తమకు అనుకూలమైన సమయంలో పని చేసే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నారు. అలాగే మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక రెస్ట్ రూములు, వాళ్ళ పిల్లలకు క్రెచ్ కూడా ఏర్పాటు చేసి వారికి అన్ని సదుపాయాలను సమకూరుస్తున్నారు.

మహిళలకు అవగాహన ఎక్కువ

'స్త్రీలు స్వతహాగా నాయకులు. సామాజిక స్పృహ, విషయాల పట్ల అవగాహన రెట్టింపు వుంటుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మహిళా నాయకత్వం సంస్థలపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని నిరూపించబడింది. మహిళా నాయకత్వం ఉన్న కంపెనీలు లాభదాయకంగా, కొత్త ఆవిష్కరణలతో అభివృద్ధి చెందుతున్నాయి. టెక్నాలజీ సహకారంతో ఎక్కువ మంది మహిళలు ఫ్యాషన్ పరిశ్రమలో వ్యవస్థాపకలుగా అడుగులు వేస్తున్నారు. అందుకే ఫ్యాషన్ ఆవిష్కరణకు సాంకేతికత సాయంతో పనిచేసే మహిళలపై మనం శ్రద్ధ వహించాలి. చాలా మంది మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నేను చేసినట్లుగా మహిళా కస్టమర్ కోసం ఫ్యాషన్, టెక్నాలజీని మిళితం చేసే కొత్త వ్యవస్థాపక భావనలను రూపొందిస్తున్నారు' అంటూ ప్రియాంక తన అనుభవాలను పంచుకుంటున్నారు.

- బి. లావణ్య,
8184897897



పాలిచ్చే తల్లులు కొన్ని ఆహారాలకు దూరంగా ఉండటం ఎంత ముఖ్యమో, కొన్ని తినడం కూడా అంతే ముఖ్యం. అందులో చెప్పుకోవలసినది పైనాపిల్. ఇందులో చాలా ముఖ్యమైన పోషకాలు, డైటరీ ఫైబర్ బయోయాక్టివ్ కాంపౌండ్స్ ఉంటాయి, ఇవి దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడతాయి. ఈ పోషకాలలో చాలా వరకు తల్లి పాలలోకి వెళ్లి బిడ్డకు మేలు చేస్తాయి. ఇది హైడ్రేటింగ్ ఫ్రూట్ కూడా. పైనాపిల్ ఆమ్లంగా ఉంటుంది. సిట్రస్ కలిగి ఉండే ఆమ్ల పండ్లు శిశువు ఆరోగ్యానికి ఏ విధంగా సహాయపడతాయో చూద్దాం...

పాలిచ్చే తల్లులకు ప్రయోజనాలిచ్చే పైనాపిల్

పోషకాలు

పైనాపిల్‌లో విటమిన్ సి, పొటాషియం, ఫోలేట్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి పాలిచ్చే తల్లులకు మేలు చేస్తాయి. తల్లి పాల ద్వారా చిన్న మొత్తంలో కొన్ని విటమిన్లు, పోషకాలు బిడ్డకు అందుతాయి. కాబట్టి పోషకాల పరంగా పైనాపిల్ బెస్ట్.

డైటరీ ఫైబర్

పాలిచ్చే తల్లికి రోజుకు 34 గ్రాముల ఫైబర్ అవసరం. పైనాపిల్ ఫైబర్-రిచ్ ఫుడ్. చాలా మంది తల్లులు డెలివరీ తర్వాత మలబద్ధక సమస్యతో ఇబ్బంది పడతారు. కాబట్టి, పైనాపిల్ వారికి మంచి ఉపశమనం.

హైడ్రేషన్...

165 గ్రాముల పైనాపిల్ సుమారు 142 గ్రాముల నీటిని అందిస్తుంది. పాలిచ్చే తల్లుల్లో పాల ఉత్పత్తిని పెంచడానికి నీరు అవసరం కాబట్టి, ఆహారంలో పైనాపిల్‌ను చేర్చుకోవడం మంచిది. నీటితో పాటు, పైనాపిల్ ప్రసవానంతర సమస్యలను పరిష్కరిస్తుంది. దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలకు కూడా సహాయపడుతుంది.

కానీ పైనాపిల్‌తో సహా ఏదైనా ఆహారం తిన్న తర్వాత పాలిచ్చే తల్లులు బిడ్డపై అవి ఏ విధంగా ప్రభావం చూపుతాయో గమనించుకుంటూ ఉండాలి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే అటువంటి ఆహారానికి కొన్ని రోజుల పాటు దూరంగా ఉండటం ఉత్తమం.





ఇట్ల చేద్దాం

కిచెన్ క్యాబినెట్‌పై, హ్యాండిల్స్ దగ్గర జిడ్డు ఎంత శుభ్రం చేసినా ఎంతోకొంత పేరుకుపోయి ఉంటుంది. ఈ జిడ్డు పూర్తిగా వదలాలంటే బేకింగ్ సోడా తీసుకుని అందులో కొంచెం హైడ్రోజన్ పెరాక్సైడ్ వేసి శుభ్రం చేయాలి. ఇలా చేస్తే జిడ్డంతా వదిలి కొత్తదానిలా మెరిసిపోతుంది.

జమిలి ఎన్నికలు కష్టమే నిర్వహణకు అడ్డంకులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గత కొద్ది కాలంగా జమిలి ఎన్నికలపై దేశ వ్యాప్తంగా రకరకాలైన చర్చలు, ఊహాగానాలు నడుస్తున్న నేపథ్యంలో బుధవారం రాజ్యసభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జమిలి ఎన్నికలు ప్రస్తుత పరిస్థితుల్లో నిర్వహించడం కష్టమని అన్నారు. "ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అంత ఈజీ కాదు. ఒకేసారి ఎన్నికల నిర్వహణ వల్ల అనేక లాభాలు ఉన్నప్పటికీ అందుకు అనేక కీలక అవరోధాలు, అడ్డంకులు కూడా ఉన్నాయి. కనీసం ఐదు కీలక రాజ్యాంగ సవరణలు చేయాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగంలో పార్లమెంట్ ఉభయ సభల వ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 83, లోక్‌సభ రద్దు చేయడానికి రాష్ట్రపతికి ఉన్న అధికారాలకు సంబంధించిన ఆర్టికల్ 85, రాష్ట్ర శాసన సభల కాల వ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 172, రాష్ట్రాల శాసన సభలు రద్దు సంబంధించిన ఆర్టికల్ 174, రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి సంబంధించిన ఆర్టికల్ 356ను సవరించాల్సి ఉంది. అన్ని రాజకీయ పార్టీల ఏకాభిప్రాయాన్ని పొందడం.

పాలనా వ్యవస్థలో ముఖ్యమైన సమాఖ్య నిర్మాణానికి సంబంధించి, అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఏకాభిప్రాయం కూడా పొందడం అత్యవసరం. పెద్ద ఎత్తున అదనపు ఈవీఎంలు, వీవీప్యాట్ యం త్రాలు అవసరం. అందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. అయితే ఆ ఈవిఎంలు, వివిప్యాట్ యంత్రాలు 15 ఏండ్ల కంటే ఎక్కువ పనిచేయవు. ప్రతి 15 ఏండ్లకు ఒకసారి అంత పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేయాలి. అంతా భారీ స్థాయిలో ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలను కేవలం మూడు, నాలుగు సార్లు మాత్రమే ఉపయోగి ంచగలం. అదనంగా పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు అవసరం" అని తెలిపారు. "ఒకేసారి ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే కేంద్ర సిబ్బంది, న్యాయ శాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలన చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం సహా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపింది. తదుపరి రోడ్ మ్యాప్ రూపకల్పన అంశం ప్రస్తుతం లా కమిషన్ పరిశీలనలో ఉంది" అని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పేర్కొన్నారు.

స్టాండింగ్ కమిటీ నుండి ప్రతిపక్షాల వాకౌట్

(మొదటిపేజీ తరువాయి)

ముందు బిల్లు ప్రతిని తమకు అందజేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. సమావేశం నుంచి వాకౌట్ చేసిన వారిలో సీపీఐ (ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, టీఎంసీ ఎంపీలు మహువా మొయిత్రా, జవహర్ సిర్కార్, డీఎంకే ఎంపీ టి సుమతి, కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, టీడీపీ ఎంపీ జయదేవ్ గల్లా ఉన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఇచ్చిన నివేదికను బీజేపీ ఎంపీలు సరిగా పరిశీలించకుండానే ఆమోదించారని ప్రతిపక్ష ఎంపీలు తెలిపారు. సమావేశానికి కేవలం ఒక రోజు ముందే ముసాయిదా నివేదికను తమకు అందజేశారని, బిల్లును అధ్యయనం చేయడానికి తగినంత సమయం లభించలేదని చెప్పారు.

అయితే బిల్లులోని నిబంధనలపై కమిటీ ఇప్పటికే చర్చించిందని బీజేపీ ఎంపీలు పేర్కొన్నారు. జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ప్రతిపక్షాల ఆందోళన రాజకీయపరమైనది కాదనీ, ప్రభుత్వ తప్పుడు చర్యల గురించేనని అన్నారు. "మా వాదనలో వాస్తవాలను పట్టించుకోకుండా అధికార పార్టీ సభ్యులు ఓటింగ్ కోసం ఎందుకు పట్టుబడుతున్నారో అర్థం కావటం లేదు" అని బ్రిట్టాస్ చెప్పారు. ఈ సందర్భంగా తన అసమ్మతి నోట్‌ను కూడా కమిటీకి సమర్పించారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే మాట్లాడుతూ మెజార్టీ ఉంటే ఆమోదం పొందవచ్చునని అన్నారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుకు ఇటీవలే కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో దీనిని ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

'ఇండియా వర్సెస్ మోడీ'

- పార్లమెంట్‌లో నినాదాల హోరు
- ఉభయ సభలు వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పార్లమెంటును మణిపూర్ అంశం కుదిపేస్తోంది. మోడీ ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు కూడా గురువారం నల్ల దుస్తులతో పార్లమెంటుకు హాజరై నిరసన తెలిపారు. మణిపూర్‌పై ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడాల్సిందేనని పట్టుపట్టారు. హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళన ఉభయ సభల్లోనూ కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతుండగానే కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రధాని మోడీ విదేశీ పర్యటనపై ప్రకటన చేశారు.

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టేందుకు ప్రయత్నించారు. మణిపూర్ అంశంపై ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించడంతో పాటు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేశారు. మోడీ మౌనాన్ని వీడి నోరు విప్పాలని నినాదాలు చేస్తుంటే బీజేపీ సభ్యులు ప్రతిగా 'మోడీ...మోడీ' అంటూ నినాదాలు చేశారు. దీంతో ప్రారంభమైన ఆరు నిమిషాల వ్యవధిలోనే స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. గందరగోళం మధ్యే బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఖనిజాల చట్టానికి సవరణ బిల్లును, వినియోగ వ్యవహారాల మంత్రి పీయుష్ గోయల్ జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సభ సాయంత్రం మూడు గంటల వరకూ వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు 'మాకు న్యాయం కావాలి' అంటూ నినాదాలతో హోరెత్తించారు. జన్ విశ్వాస్ బిల్లుపై బీజేపీ ఎంపీలు రాజేంద్ర అగర్వాల్, వైసీపీ ఎంపీ భీశెట్టి సత్యవతి, బీఎస్పీ ఎంపీ మలూక్ నగర్ మాట్లాడిన తరువాత మూజువాణీ ఓటుతో ఆమోదించారు. అనంతరం సభ శుక్రవారం నాటికి వాయిదా పడింది.

రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్

రాజ్యసభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను ఛైర్మన్ జగదీప్ ధనకర్ మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా వేశారు. తొలుత సభలో మాట్లాడేందుకు ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ప్రయత్నించగా అధికార పక్ష సభ్యులు అడ్డుకున్నారు. దీనిని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొని, మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ సినిమాటోగ్రఫీ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేంద్రం మంత్రి చేసిన వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. సినిమాటోగ్రఫీ బిల్లుపై బీజేడీ, బీజేపీ, అన్నా డీఎంకే, వైసీపీ, టీడీపీ, టీఎంసీ (ఎం) సభ్యులతో పాటు కేంద్ర మంత్రి రాందాస్ అథావలే మాట్లాడారు. బిల్లు మూజువాణీ ఓటుతో ఆమోదం పొందిన తర్వాత సభ శుక్రవారం నాటికి వాయిదా పడింది.

నినాదాల హోరు

మణిపూర్ హింసపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు, దానికి ప్రతిగా బీజేపీ సభ్యులు రాజ్యసభలో పోటాపోటీగా నినాదాలు చేశారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సభలో ప్రసంగిస్తున్న సమయంలో గందరగోళం చోటుచేసుకుంది. ప్రతిపక్షాలు 'ఇండియా...ఇండియా' అంటూ ప్రధానిని విమర్శిస్తూ నినాదాలు చేయగా అధికార పక్ష సభ్యులు 'మోడీ...మోడీ' అంటూ ప్రతి నినాదాలు చేశారు.

మణిపూర్‌కు ప్రతిపక్ష ఎంపీలు

- 29,30 తేదీల్లో పర్యటన



మణిపూర్‌లో అల్లర్లు ప్రారంభమై దాదాపు 85 రోజులు కావస్తున్నా హింస మాత్రం ఆగడం లేదు. దీనిపై ప్రధాని మోడీ మాట్లాడడం కానీ, ఆ రాష్ట్రంలో పర్యటించడం కానీ జరగలేదు. దీంతో ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు మణిపూర్‌కు వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఈ నెల 29, 30 తేదీల్లో మణిపూర్‌లో ప్రతిపక్ష ఎంపీలు పర్యటించనున్నారు.

మూడేండ్లలో 20 సార్లు పెరిగిన గ్యాస్ ధర

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మూడేండ్లలో వంట గ్యాస్ ధర 20 సార్లు పెరిగింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 14.2 కేజీల వంట గ్యాస్ సిలిండర్ ధర 2020 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 1 వరకు మొత్తం 20 సార్లు పెరిగిందని తెలిపారు. 2020 ఏప్రిల్ 1న వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.714.5 ఉండగా, 2023 మార్చి 1 నాటికి రూ.1,102.50కి పెరిగిందని తెలిపారు.

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 33,979 మంది విద్యార్థులు డ్రాపౌట్

ఐదేండ్లలో కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 33,979 మంది విద్యార్థులు డ్రాపౌట్ అయినట్లు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. రాజ్యసభలో ఆయన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2019 నుంచి 2023 వరకు ఐదేళ్లలో దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో 17,454 మంది, ఐఐటిల్లో 8,139 మంది, ఎన్ఐటీల్లో 5,623 మంది, ఐఐఎస్ఈఆర్‌ల్లో 1,046 మంది, ఐఐఎంల్లో 858 మంది, ట్రిపుల్ ఐటీల్లో 803 మంది, ఎస్‌పీఏల్లో 56 మంది విద్యార్థులు డ్రాపౌట్ అయినట్టు తెలిపారు.

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 32 వేల పోస్టులు ఖాళీ

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 32 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 జులై 20 నాటికి దేశంలోని కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 32 వేల పోస్టుల ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సెంట్రల్ యూనివర్సిటీల్లో 21,215 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీ

సెంట్రల్ యూనివర్సిటీల్లో 21,215 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 ఏప్రిల్ 1 నాటికి సెంట్రల్ యూనివర్శిటీల్లో 5,825 టీచింగ్, 15,390 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వంలో 9,64,354 పోస్టులు ఖాళీ

కేంద్ర ప్రభుత్వంలోని మంత్రిత్వ శాఖలు, డిపార్టమెంట్‌ల్లో 9,64,354 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022 మార్చి 31 నాటికి మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌ల్లో గ్రేడ్ ఎ పోస్టులు 30,606, గ్రేడ్ బి పోస్టులు 1,11,814, గ్రేడ్ సి పోస్టులు 8,21,934 ఖాళీగా ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

(మొదటిపేజీ తరువాయి)

భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, హైదరాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని పేర్కొన్నారు. ఇంకా అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నదని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వరద ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని పార్టీ కార్యకర్తలు, శ్రేణులకు ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రేకుల షెడ్లు, గుడిసెలు, పాకల్లో జీవిస్తున్న పేదలు నిరాశ్రయులయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. పంట పొలాలు, రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని వివరించారు. వాటి వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని తెలిపారు. వాటిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. వరదల వల్ల ఇప్పటికే జరిగిన ప్రాణ, ఆస్తినష్టాలను అంచనావేసి నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు యుద్ధప్రాతిపదికన సహాయ సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంలో హెల్త్ డేటా

- సమాచారం ఉల్లంఘనలకు,సైబర్ దాడులకు గురయ్యే అవకాశం
- నిపుణులు, సామాజిక కార్యకర్తల హెచ్చరిక

న్యూఢిల్లీ : భారత్‌లోని ప్రజల ఆరోగ్య సమాచారం భద్రతపై నిపుణులు సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెల్త్ డేటా దుర్వినియోగమయ్యే ప్రమాదమున్నదని వారు హెచ్చరించారు. సైబర్ దాడులకూ గురయ్యే అవకాశమున్నదని చెప్పారు. గతేడాది భారత్‌లో కోవిన్ వ్యాక్సిన్ పోర్టల్ నుంచి డేటా ఉల్లంఘనలపై వచ్చిన నివేదికలను ఈ సందర్భంగా వారు ఉటంకించారు. అయితే, కోవిన్ డేటా దుర్వినియోగం కాలేదని అధికారులు ఆ సమయంలో చెప్పారు. అయితే, గత నెలలో టెలిగ్రామ్ యాప్ ద్వారా కోవిన్ డేటా భారీ లీక్‌కు సంబంధించి ఒక ముఖ్య అధికారి వ్యక్తిగత సమాచారమే బహిర్గతం కావటం గమనార్హం. అయితే, ఈ లీక్ జరగలేదని, సమాచారం దుర్వినియోగం కాలేదని అధికారులు ఆ సమయంలో అధికారులు ఖండించారు. అధికారి సమారం బహిర్గతమైన తర్వాతి రోజే ఈ ఘటనతో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారని విశ్లేషకులు గుర్తు చేశారు. ప్రజల పేర్లు, ఆధార్ కార్డు సమాచారం, మొబైల్ నెంబర్లు, ఓటర్ ఐడీలు, పాస్‌పోర్టులు, లక్షలాది మంది ప్రజల కోవిడ్ వ్యాక్సినేషన్ స్థితి డేటా లీక్ భారత్‌లోని అతిపెద్ద సమాచార తస్కరణ అని నిపుణులు అభిప్రాయపడ్డారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామ పంచాయితీ కార్మికుల వేతనాలు కనీస స్థాయికి పెంచి, వారు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. గ్రామ పంచాయితీ కార్మికులు 22 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారని తెలిపారు. వారికి నెలకు రూ.8,500మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. పారిశుధ్య కార్మికులకు రూ.16,500, ఆ పైన పని చేసే వారికి రూ. 19,000లు, మాత్రమేవేతనాలుగా చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ వేతనాలను అమలు చేసినా వారికి సంవత్సరానికి వచ్చేది రూ.1,98,000 మాత్రమేనని పేర్కొన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,17,000 లుగా ఉన్నదంటూ అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వ పెద్దలు అనేక పర్యాయాలు ప్రస్తావించారని గుర్తు చేశారు. గ్రామ పంచాయితీ కార్మికుల కుటుంబాల్లో కనీసం నలుగురు సభ్యులుంటారని తెలిపారు. ఆ లెక్కన తలసరి ఆదాయం ప్రకారం ఆ కుటుంబం వాటా రూ.12,68,000లు ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కుటుంబ ఆదాయం తెలంగాణ తలసరి ఆదాయం (రూ.3,17,000) సమానంగా అయినా ఉండాలి కదా? పేర్కొన్నారు. అయినప్పటికీ వారు ఏడాదికి రెండు లక్షలు ఇస్తే సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారని గుర్తుచేశారు. ఈ క్రమంలో గ్రామ పంచాయితీ కార్మికుల వేతనాలను పెంచి వారి సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యాసంస్థలకు నేడు సెలవు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాల నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకు శుక్రవారం ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. అందుకు సంబంధించి తక్షణమే ఉత్తర్వులను జారీ చేయాలంటూ విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు విద్యాసంస్థలకు శుక్రవారం సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులను జారీ చేశారు. ఈనెల 20 నుంచి వరుసగా మూడు రోజులపాటు రాష్ట్రంలోని విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. సోమ, మంగళవారం మాత్రమే విద్యాసంస్థల్లో తరగతులను నిర్వహించారు. ఇప్పుడు మళ్లీ బుధవారం నుంచి శుక్రవారం వరకు సెలవులు ప్రకటించింది. శనివారం మొహర్రం సందర్భంగా సాధారణ సెలవు, రేపు ఆదివారం. దీంతో సోమవారం నుంచి విద్యాసంస్థలు తెరుచుకుంటాయి.



ముంచెత్తుతోంది..

(మొదటిపేజీ తరువాయి)

ముత్యందార జలపాతం సందర్శన కోసం వెళ్లిన 80 మందిని కాపాడారు. వెంకటాపూర్‌లో 24 గంటల్లో 65 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి-పరకాల ప్రధాన రహదారిపై మొరంచపల్లి వాగు సుమారు 15 అడుగుల ఎత్తులో ఉధృతంగా ప్రవహించడంతో గ్రామం జలదిగ్బంధమైంది. సీఎం ఆదేశాలతో ప్రమాదంలో ఉన్నవారిని హెలికాప్టర్ ద్వారా తరలించారు. వర్షాలపై సీఎం అధికారులతో సమీక్ష జరిపారు. ఆయా జిల్లాలకు ప్రత్యేక అధి కారులను నియమిస్తూ సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీ చేశారు.

సురక్షిత ప్రాంతాలకు విద్యార్థులు

- కరీంనగర్ శివారులోని రేకుర్తి గురుకుల హాస్టల్, సైదాపూర్ మండలం మోడల్‌స్కూల్, రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ కస్తూరిబా పాఠశాల భవనాలు జలదిగ్బంధం కావడంతో పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉమ్మడి కరీంనగర్‌లోని నాలుగు జిల్లాల కలెక్టర్లు ట్రోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా ప్రజలకు సహాయక చర్యలు అందిస్తున్నారు.

గన్నేరువరం మండల కేంద్రంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుతో కరీంనగర్ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రంగి మండల కేంద్రంలో వేములవాడ కోరుట్ల వెళ్లే రహదారిపై నందివాగు ప్రవాహంతో మండల కేంద్రానికి దారులు మూసుకుపోయాయి. వీర్నపల్లి మండలంలో వాగులు పొంగిపొర్లుతుండటంతో 16 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. జగిత్యాల జిలా వెల్గటూర్ మండల పరిధిలోని వెల్గటూర్ - రాజక్కపల్లి గ్రామాల మధ్య ఉన్న పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మెగా కంపెనీకి చెందిన ట్యాంకర్ వాగులో చిక్కుకుంది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శివారు కాలనీల వారిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

తెరుచుకున్న శ్రీరాంసాగర్, నిజాంసాగర్

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. పలు చెరువులకు గండ్లు పడ్డాయి. ఇండ్లు కూలాయి. నందిపేట్ మండలంలో చేపలవేటకు వెళ్లి ఒకరు గల్లంతయ్యారు.



నిజామాబాద్ జిల్లాల్లో 14 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ మహారాష్ట్ర నుంచి భారీగా వరద వస్తుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగా నదులుతో పాటు గ్రామాల సమీపంలోని వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. తలమడుగు మండలం కోడద్- హస్నాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించడంతో అటువైపు గ్రామాలతో పాటు మహారాష్ట్ర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బోథ్ మండలం ధనోర(బి) గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగడంతో ఆ గ్రామం జలదిగ్బంధనంలో చిక్కుక్కుంది. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ త్రివేణి సంగమం చెరువు మత్తడి పోయడంతో ఆదిలాబాద్-ఉట్నూర్ ప్రధాన రహదారి తెగిపోయింది. మెదక్ జిల్లా హావేలీఘన్‌పూర్ చెర్వులో నీట మునిగి నర్సింహులు అనే యువకుడు చనిపోయాడు. పెద్దశంకరంపేటలో స్కూల్ భవనం కూలింది.

ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 7.32లక్షల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. అదేస్థాయిలో ప్రాజెక్టు 38గేట్లు ఎత్తి దిగువకు 6.69లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మానేరు నదిపై ఉన్న అప్పర్‌మానేరు డ్యామ్ పూర్తిస్థాయిలో నిండి అలుగుదూకుతోంది. మధ్యమానేరు ప్రాజెక్టులోకి 26,700 క్యూసెక్కుల నీరు వస్తోంది. దిగువమానేరు ప్రాజెక్టులోకి మోయ తుమ్మెద నుంచి వరద వస్తుండటంతో ఒక్కరోజులోనే నిండుకుండలా మారింది.

యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలకేంద్రంలో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సిల్క్‌నగర్, పెద్దమ్మవాడ, బీసీకాలనీల్లో నీళ్లు చేరాయి. ఈదులవాగు, రత్నాల వాగు, పర్రెకాలువలు పొంగిపొర్లుతున్నాయి. కొలనుపాక గ్రామ సమీపంలో ఉన్న పితమరం వాగు ప్రవాహంతో సిద్దిపేటకు రాకపోకలు బంద్ అయ్యాయి. కేజీబీవీ పాఠశాలను వరదనీరు చుట్టుముట్టడంతో పిల్లలను ఇంటికి పంపించారు. నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు 8 గేట్లను ఎత్తారు.

వరద బాధిత జిల్లాలకు స్పెషల్ అధికారుల నియామకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు వరద బాధిత జిల్లాలకు ఐఏఎస్ అధికారులను స్పెషలాఫీసర్లుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నియమించారు. ఈ మేరకు గురువారం సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.

- ములుగు జిల్లా - కృష్ణ ఆదిత్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సభ్య కార్యదర్శి
- భూపాల పల్లి - పి గౌతమ్, సెర్ప్ సీఈఓ
- నిర్మల్ - ముషారఫ్ అలీ, ఎక్సయిజ్ శాఖ, కమిషనర్
- మంచిర్యాల - భారతి హోలికేరి, మహిళా, శిశు సంక్షేమ శాఖ, స్పెషల్ సెక్రెటరీ
- పెద్దపల్లి - సంగీత సత్యనారాయణ
- అసిఫాబాద్ - హన్మంత రావు, పంచాయితీరాజ్ శాఖ కమిషనర్

ప్రాణనష్టం జరగకుండా
చూడండి: కేటీఆర్

హుస్సేన్‌సాగర్ వద్ద వరద ఉధృతి పరిశీలన

మరో రెండు గేట్ల ద్వారా జంట జలాశయాల నీరు విడుదల



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. అన్ని పట్టణాల్లో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వర్షాలను కూడా రాజకీయం చేయడం సరికాదని, చేతనైతే సహాయక చర్యల్లో పాల్గొనాలని ప్రతిపక్షాలకు మంత్రి సూచించారు. గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్ తదితర అధికారులతో కలిసి హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ వరద పరిస్థితిని మంత్రి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వర్షకాలం ప్రారంభానికి ముందే నాలాల్లో పూడిక తీశామని చెప్పారు. చెరువుల్లోనూ తక్కువ నీటిమట్టం ఉండేలా జాగ్రత్తలు తీసుకు న్నామని తెలిపారు. ఈసారి నాలా డెవలప్ మెంట్ ప్రోగ్రాం ద్వారా చేపట్టిన కార్యక్రమాల వల్ల వరద ప్రభావం కొంత తగ్గిందన్నారు. భారీ వర్షా లపై ముఖ్యమంత్రి ఎప్పటి కప్పుడూ సమీక్షిస్తున్నారని, శిథిల భవ నాల నుంచి జనాలను వెంటనే తరలిం చాలన్నారు. జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డుతో పాటు ఇతర శాఖల ఉన్నతాధి కారులతోపాటు క్షేత్రస్థా యిలో సిబ్బంది వరకు అందరూ పనిచేస్తు న్నారన్నారు. వర్షంతో నగ రంలో ప్రజలకు కొంత ఇబ్బంది ఎదురవు తున్నదని, వర్షాలు తగ్గాక కబ్జాలపై దృష్టిసారిస్తా మన్నారు. అవసరమైతే వాటిని కూల్చేస్తామని తెలిపారు.

భారీ వర్షాల్లో నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసే విధంగా ప్రతిపక్షాలు చిల్లర విమర్శలు చేయొద్దని సూచించారు. ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తూ తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకునే విధంగా అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో 14 బ్రిడ్జిలు మంజూరు చేశామన్నారు. ముసారంబాగ్ వద్ద మూసీనదిపై ఉన్న బ్రిడ్జిని కేటీఆర్ పరిశీలించారు. బ్రిడ్జి వద్ద ప్రవాహం పెరిగినా.. ప్రస్తుతం ప్రమాదం ఏమీ లేదన్నారు. మూసీ నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదిలావుండగా వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించామని, అవసరమైతే శు క్రవారం తాను కూడా వెళ్తానని కేటీఆర్ తెలిపారు.

జీహెచ్ఎంసీ పూర్తిస్థాయిలో సంసిద్ధం: తలసాని

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డితో కలిసి మంత్రి జీహెచ్ఎంసీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. కంట్రోల్ రూమ్‌కు వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం కింద 36 నాలాల అభివృద్ధి పనులు చేపట్టగా, 30 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 6 పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. ప్రజలు అత్యవసర సేవలకు జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ (040-21111111, 9000113667)కు కాల్ చేయాలని కోరారు. హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లోపై ఎప్పటికప్పుడూ అధికారులు పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్టు వివరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 455 టీంలు పని చేస్తున్నాయని చెప్పారు.



చిరంజీవి

కిడ్నాప్‌ల సూత్రధారి ఎవరు?

చిరంజీవి తాజాగా నటిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను గురువారం రామ్ చరణ్ లాంచ్ చేశారు.

'కోల్‌కతాలో చాలా మంది యువతులు కిడ్నాప్ అవుతారు. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, కిడ్నాప్‌ల వెనుక ఉన్న సూత్రధారిని పోలీసులు కనుగొనలేకపోతారు. అప్పుడు భోళా శంకర్.. నేరస్థుడిని పట్టుకోవడానికి, అమ్మాయిలను రక్షించడానికి వస్తాడు. సీరియస్‌గా ప్రారంభమైన కథనం ఒకదాని తర్వాత ఒక ప్రధాన పాత్రల ప్రవేశంతో వినోదాత్మకంగా మారుతుంది. చిరంజీవి వింటేజ్ అవతార్‌లో కనిపించి తన మాస్ పవర్‌ను మరోసారి చూపించారు. యాక్షన్‌తో పాటు వినోదాత్మక సన్నివేశాలలో కూడా ఎక్స్‌ట్రార్డినరిగా ఉన్నారు. తమన్నా లాయర్‌గా, కీర్తి సురేష్ చిరంజీవి సిస్టర్‌గా , సుశాంత్ ఆమె బాయ్ ఫ్రెండ్‌గా కనిపించారు. వెన్నెల కిషోర్ భోళా సీనియర్‌గా కనిపించడం నవ్వులు పూయించింది. ట్రైలర్‌లో సూచించినట్లుగా ఇదొక ఒక మెగా-మాస్ యాక్షన్ ఎంటర్టైనర్. ఈ సినిమా మాస్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ని కూడా ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు దర్శకుడు మెహర్ రమేష్. డడ్లీ సినిమాటోగ్రఫీ అత్యున్నతంగా ఉంది. మహతి స్వర సాగర్ తన సంగీతంతో విజువల్స్‌ను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లారు. అనిల్ సుంకర ఎకె ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. నిర్మాణ ప్రమాణాలు ఉన్నత స్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రాన్ని ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు' అని చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్ డైలాగ్స్: తిరుపతి మామిడాల, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్.

నవచిత్రం

వరుణ్‌తేజ్ మట్కా మొదలైంది

వరుణ్ తేజ్ తన 14వ చిత్రాన్ని 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో చేస్తున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'మట్కా' టైటిల్‌తో ఈ చిత్రం గురువారం హైదరాబాద్‌లో టీమ్, పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో గ్రాండ్‌గా ఆరంభమైంది. సురేష్ బాబు, చిత్ర నిర్మాతలు ప్రొసీడింగ్స్ ప్రారంభించేందుకు దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ముహూర్తం షాట్‌కు దర్శకుడు మారుతి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దిల్ రాజు గౌరవ దర్శకత్వం వహించారు.



విజయేందర్ రెడ్డి, మీనాక్షి చౌదరి, వరుణ్‌తేజ్, సి.వి.మోహన్, కరుణ కుమార్

టైటిల్ పోస్టర్‌ను హరీష్ శంకర్ లాంచ్ చేశారు. 'మట్కా'అనే ఆసక్తికరమైన టైటిల్, పోస్టర్ ప్రత్యేకంగా ఆకట్టుకునేలా డిజైన్ చేశారు. 'మట్కా' అనేది ఒకరకమైన జూదం. 1958-1982 మధ్య జరిగే ఈ కథ యావత్ దేశాన్ని కదిలించిన యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిస్తున్నారు. కథ వైజాగ్ నేపథ్యంలో జరుగుతుంది.1958 నుంచి 82 వరకు సాగే కథలో వరుణ్ తేజ్‌ని నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో చూడబోతున్నాం. వరుణ్ తేజ్‌కు జోడిగా నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి ఎంపికయ్యారు. ఈ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌లో నోరా ఫతేహి ఒక ప్రత్యేక పాటలో కూడా అలరించనున్నారు. నవీన్ చంద్ర, కన్నడ కిషోర్ ఇతర ముఖ్య తారాగణం.


ఊహించని ట్విస్టులతో సాగే సినిమా



సంపత్‌నంది, సందీప్ మాధవ్, క్యాథరిన్

'ఓదెల రైల్వే స్టేషన్' చిత్ర దర్శకుడు అశోక్ తేజ దర్శకత్వంలో రూపొందనున్న నూతన చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. క్యాథరిన్ హీరోయిన్‌గా, సందీప్ మాధవ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కేసీఆర్ ఫిలిమ్స్, శ్రీమహా విష్ణు మూవీస్ బ్యానర్‌లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన ముహుర్తపు సన్నివేశానికి దర్శకుడు సంపత్ నంది క్లాప్ నివ్వగా, నిర్మాత సి.కల్యాణ్ స్విచ్చాన్ చేశారు. ప్రసన్నకుమార్, జెమిని కిరణ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ,'నా 'ఓదెల రైల్వేస్టేషన్'కు పదిరెట్లు అద్భుతంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. 'స్క్రీన్‌ప్లే బేస్డ్ సినిమా ఇది. సరికొత్త యాక్షన్ థ్రిల్లర్' అని హీరోయిన్ క్యాథరిన్ చెప్పారు. హీరో సందీప్ మాధవ్ మాట్లాడుతూ,'ఇందులోని ప్రతి సన్నివేశం, అలాగే ట్విస్ట్‌లు ఎవరూ ఊహించలేరు. ఇందులో పోలీస్‌ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నా' అని అన్నారు. చిత్ర సమర్పకుడు సోమ విజయప్రకాష్, నిర్మాతల్లో ఒకరైన పల్లి కేశవరావు మాట్లాడుతూ,' చిత్రీకరణ పూర్తయ్యే వరకు కంటిన్యూ షెడ్యూల్ ఉంటుంది. అందరి ఊహలకు భిన్నంగా ఉండే సినిమా ఇది' అని తెలిపారు.

సరికొత్త కాన్సెప్ట్



బ్రహ్మాజీ

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. మైక్ మూవీస్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రానికి పూరీ జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించారు. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈనెల 29న రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా ఇందులో ముఖ్య పాత్ర పోషించిన బ్రహ్మాజీ మీడియాతో మాట్లాడుతూ, "మిస్టర్ ప్రెగ్నెంట్' సినిమా చిత్రీకరణ టైంలోనే నిర్మాత అప్పిరెడ్డి ఈ కథ, కాన్సెప్ట్ గురించి చెప్పారు. ఓ కొత్త దర్శకుడు కథ చెప్పాడు విని, సలహా చెప్పండి అని అన్నారు. కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది. బాగుందని చెప్పాను. ఇందులో ఓల్డ్ సిటీలో ఉండే విడాకుల స్పెషలిస్ట్ లాయర్‌గా ఇందులో కనిపిస్తాను. ఉర్దూ, తెలుగు మిక్స్ చేసి మాట్లాడే క్యారెక్టర్. మా అబ్బాయి సంజయ్ డాగ్ లవర్ అవ్వడంతో కాన్సెప్ట్‌కు ఈజీగా కనెక్ట్ అయ్యాడు. 'పుష్ప' పార్ట్ 2 చిత్రీకరణ జరుగుతున్నప్పుడు బన్నీ మా ట్రైలర్‌ను చూసి ప్రశంసించారు. ఇందులో నాకు, సప్తగిరికి మధ్య ఉండే సీన్లు పోటాపోటీగా ఉంటాయి. జడ్జిగా ఫిష్ వెంకట్ కనిపించడం హైలెట్. దీనికి భీమ్స్ అదిరిపోయే సంగీతాన్ని ఇచ్చారు. మంచి మాస్, మెలోడీ పాటలు ఇచ్చారు. మ్యూజికల్ హిట్ అవుతుంది. ప్రస్తుతం 'గుంటూరు కారం', 'సలార్', 'భగవంత్ కేసరి', 'ఊరి పేరు భైరవకోన', నాగ శౌర్యతో ఓ సినిమా.. ఇలా చాలానే ఉన్నాయి' అని చెప్పారు.

బస్తీ నేపథ్యంలో పేక మేడలు



హీరో విశ్వక్‌సేన్‌తో 'పేక మేడలు' చిత్ర బృందం

'నా పేరు శివ', 'అందగారం' చిత్రాల ఫేం వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పేక మేడలు'. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై రాకేశ్ వర్రే దీన్ని నిర్మిస్తున్నారు. బుధవారం ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వక్సేన్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'రాకేశ్ యాక్టర్‌గా నటిస్తూనే నిర్మాతగా కూడా మారడం ఆనందంగా ఉంది. ఈ చిత్ర హీరో వినోద్ కళ్లతో నటిస్తాడు. ఈ సినిమా పోస్టర్స్, టీజర్ అద్భుతంగా ఉంది. మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నా' అని అన్నారు. 'ఈ 'పేక మేడలు' కథ నచ్చి నేను హీరోగా కాకుండా నిర్మాతగా ఈ సినిమా మొదలుపెట్టా. హైదరాబాద్‌లోని ఓ బస్తీలో సాగే కథ ఇది. ఈ చిత్రానికి వినోద్, అనూష యాప్ట్. వాళ్లిద్దరిమీదే సినిమా నడుస్తుంది. మంచి కమిట్‌మెంట్ ఉన్న హీరో విశ్వక్‌సేన్ చేతుల మీదుగా టీజర్ లాంచ్ అవ్వడం ఆనందంగా ఉంది' అని నిర్మాత రాకేశ్ వర్రే చెప్పారు. దర్శకుడు నీలగిరి మాట్లాడుతూ,'అనీస్ కురువిళ్లా దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశా. అప్పుడే ఈ కథ నా మనసులో మెదిలింది. బస్తీ లైఫ్ ఎలా ఉంటుంది. అక్కడ ఎవరు పేక మేడలు కడతారు అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రం చేశాం. ప్రతి ఒక్కరికీ జీవితంలో ఎదురయ్యే కథ ఇది. ఇలాంటి కథ బయటకు వెళ్తే బజ్ క్రియేట్ అవుతుందని నమ్మి చేశాం' అని తెలిపారు. 'ఈ చిత్రంలో నేను చేసిన పాత్ర ఎప్పటికీ ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ సినిమా జర్నీ బ్యూటిఫుల్‌గా సాగింది' అని హీరో వినోద్ చెప్పారు. హీరోయిన్ అనుష మట్లాడుతూ,' ఇంత మంచి సినిమాలో అవకాశం రావడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఈ చిత్రానికి సహ నిర్మాత: వరుణ్ బోర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : కేతన్ కుమార్, లైన్ ప్రొడ్యూసర్: అనూష బోర, డి ఓ పి: హరిచరణ్.కె, సంగీతం: స్మరన్, ఎడిటర్: సృజన అడుసుమిల్లి - హంజా అలీ, స్క్రీన్ ప్లే : హంజా అలీ -శ్రీనివాస్ ఇట్టం-నీలగిరి మామిళ్ళ, డైలాగ్స్ - లిరిక్స్ : భార్గవ కార్తీక్.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.